



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 28, సంచిక: 136 | గురువారం | 06-11-2025 | హైదరాబాద్ | Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00




ట్రంప్‌కు షాక్!

## జోహ్రాన్‌కు జై కొట్టిన న్యూయార్క్



- మేయర్‌గా మమ్దానీ అద్భుత విజయం
- 34 ఏళ్లకే వరించిన పదవి
- బిలియనీర్ల కోటలో సోషలిస్టు గెలుపు
- డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా జయకేతనం
- ముస్లిం, భారతీయ మూలాలున్న తొలి మేయర్‌గా రికార్డు


**న్యూయార్క్:** అమెరికా దేశంలో అతి పెద్ద నగరం, బిలియనీర్ల స్వర్గధామంగా పిలువబడే న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లో సోషలిస్టు భావాలు కలిగిన డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ చరిత్రాత్మక విజయం సాధించారు. ఈ పదవి చేపట్టనున్న తొలి ముస్లిం, భారతీయ మూలాలు కలిగిన, అతి పిన్నవయస్కుని(34 ఏళ్ళు)గా ఆయన గణుతికెక్కనున్నారు. మమ్దానీని కమ్యూనిస్టు పిచ్చోడని, ఆయన గెలిస్తే న్యూయార్క్ నిధులు కత్తిరిస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వెరవకుండా ఓటర్లు ఆయనకు పట్టం గట్టారు. సామాన్యులను మతం, జాతీయవాదం వలసలు పేరుతో విభజిస్తూ, ఆర్థిక కష్టాలతో సతమతం చేస్తున్న ట్రంప్ విధానాలకు ఇదొక చెక్ లాంటిదని అమెరికన్ వాసులు భావిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఇంటి అద్దెల నియంత్రణ, ప్రభుత్వ నిధులతో చౌక ఇళ్ళు, నగరపాలిక ఆధ్వర్యంలో చౌక ధరలకే గ్రోసరీ షాపుల ఏర్పాటు, పిల్లలకు ఉచిత సంరక్షణ వంటి మౌలికమైన వాగ్దానాలు చేసి న్యూయార్క్ ఓటర్ల అభిమానాన్ని చూరగొన్నారు. సొంత పార్టీలోనే వ్యతిరేకులను అధిగమించి, ఆయన సంచలన విజయం సాధించారు. న్యూయార్క్‌లో ఎన్నికల ప్రక్రియ యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది. దీంతో డెమోక్రటిక్‌పార్టీలో, ఆయన అభిమానులలో సర్వత్రా ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. అతి చిన్న వయసులో మేయర్ పదవి ఆయనను వరించింది. నిలువెల్లా సోషలిస్టు భావజాలాన్ని నింపుకున్న మమ్దానీ 2026 జనవరి 1వ తేదీన న్యూయార్క్ 111వ మేయర్‌గా పదవీ బాధ్యతలు తీసుకుంటారు. ప్రైమరీలో డెమోక్రాట్ల తరపున సీటు పొందలేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆండ్రూ క్యోమో 40 శాతం ఓట్లు పొందారు. స్లివా కేవలం ఏడూశాతం ఓట్లు పొందారు. దీంతో ఆయన గడచిన 100 సంవత్సరాలలో అతిపెద్ద న్యూయార్క్ నగర మేయర్ బాధ్యతలు చేపట్టిన అతి పిన్నవయస్కుడవుతారు. అంతేకాకుండా న్యూయార్క్ మేయర్ బాధ్యతలు చేపట్టిన మొదటి ముస్లింగా కూడా ఆయన రికార్డుల్లోకి ఎక్కుతారు. న్యూయార్క్‌లో ఇక మీదట ఇళ్ళ అద్దెలు గణనీయంగా తగ్గుతాయని, వాటికి కళ్ళెం వేసేవిధంగా మమ్దానీ విధాన నిర్ణయం తీసుకుంటారని, జీవన వ్యయాలు కూడా ఇక ప్రజలకు అనుకూలంగా ఉంటాయని అందరూ ఆశగా ఆయన ప్రమాణస్వీకారం కోసం తరువాయి 2లో

## హర్యానాలో నకిలీ ఓట్లు 25 లక్షలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల కమిషన్ భారత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు రూపొందించిన 'క్రమబద్ధమైన ఓటు చోరీ' పద్ధతిని బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కూడా అమలు చేస్తాయి. హర్యానాలో 'ఓట్ల దొంగతనానికి ఎవరు బాధ్యులో చాలా స్పష్టంగా తెలుస్తోంది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవకుండా చూసుకోవడానికి ఈ పెద్దమనుషులు బిజెపితో కుమ్మక్కయ్యారు.

### ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 8 మంది ఓటర్లలో ఒకరు నకిలీ

- బ్రెజిలియన్ మోడల్ ఫొటోతో 22 ఓట్లు
- సీమా, స్వీటీ, సరస్వతి వంటి వేర్వేరు పేర్లతో ఓటర్ జాబితాలో చోటు
- కాంగ్రెస్ అఖండ విజయానికి 'ఆపరేషన్ సర్కార్' చోరీకి పాల్పడ్డ పోల్ ప్యానెల్
- బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కు
- ఓట్ల దొంగను కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న ఇసి






బ్రెజిలియన్ మోడల్

**న్యూఢిల్లీ :** ఎన్నికల దొంగతనంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి ధ్వజమెత్తరు. ఎన్నికల కమిషన్‌పై దుమ్మెత్తి పోశారు. ఓట్ల దొంగలను ఇసి కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తుందని ఆరోపించారు. గత సంవత్సరం జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల ఓట్లు నకిలీవేనన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కయ్యిందని ఎన్నికల జాబితా డేటాను ఉటంకిస్తూ కాంగ్రెస్ రాహుల్ గాంధీ మండిపడ్డారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాయ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 10 బూత్‌లలో బ్రెజిలియన్ మోడల్‌కు కూడా 22 ఓట్లు ఉన్నాయని, ఆమె ఫొటోను ఉపయోగించి సీమా, స్వీటీ, సరస్వతి వంటి వేర్వేరు పేర్లతో ఓటు కల్పించారని బుధవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. హర్యానాలో తమ పార్టీ సాధించిన అఖండ విజయాన్ని ఆ రాష్ట్రంలో తరువాయి 2లో

తనునుంచి కేసును

## తప్పించేందుకు కేంద్రం యత్నం

సుప్రీం కోర్టు సిజెఐ తీవ్ర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఇప్పటికే చివరి దశలో విచారణలో ఉన్న కేసును ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తిని గవాయ్ తప్పుబట్టారు. ట్రిబ్యునళ్ళ సంస్కరణల చట్టం – 2021 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విషయంలో తెరపైకి వచ్చింది. వాదనలు పూర్తయిన తరువాత కేసుపై విస్తృత ధర్మాసనం విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం కోరడం పట్ల గవాయి తీవ్ర వ్యాఖ్యలే చేశారు. ఇది కేసును తప్పించుకునే ఎత్తుగడనే అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంతో భారత అత్యున్నత న్యాయస్థానంపై న్యాయ స్వాతంత్ర్యం, కార్యనిర్వాహక ప్రభావం గురించి గతంలో జరిగిన ఇబ్బందికర చర్చ మళ్ళీ మొదలైంది. ట్రిబ్యునల్ సంస్కరణల చట్టం రాజ్యాంగ చెల్లుబాటుకు సంబంధించిన కేసులో క్వాసీ జ్యుడీషియల్ సంస్థలలో నియామకాలు, తరువాయి 12లో



## యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం

ఎన్నికల వేళ తొమ్మిది వామపక్షాలు విలీనం

మరిన్ని లెఫ్ట్‌పార్టీలతో చర్చలు తుదిదశకు : ప్రచండ

**కాఠ్మండు:** నేపాల్‌లో తొమ్మిది వామపక్షాలు విలీనమై నేపాల్ కమ్యూనిస్టు పార్టీగా ఆవిర్భవించాయి. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్), సిపిఎన్ (యూనిఫైడ్ సోషలిస్ట్) పార్టీలతో పాటు మరో ఏడు పార్టీలు విలీనమై ఏకపార్టీగా ఆవిర్భవించాయి. మాజీ ప్రధానమంత్రి, సిపిఎన్ (మావోయిస్టు సెంటర్) అధ్యక్షుడు పుష్పకమల్ దహల్ (ప్రచండ) నాయకత్వంలో ఆవిర్భవించిన ఈ పార్టీకి 'యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టు పార్టీ' (యుఎన్‌సిపి)గా నామకరణం చేసినట్లు నేపాల్ పత్రికలు ప్రకటించాయి. సిపిఎన్ (మావోయిస్టు సెంటర్)కు ఛైర్మన్‌గా వ్యవహరించిన పుష్పకమల్ దహల్ ఈ కొత్త పార్టీకి సమన్వయకర్తగా పనిచేస్తారు. దహల్ తర్వాత పార్టీలో రెండోస్థానంలో మాధవ్‌కుమార్ నేపాల్ (యూనిఫైడ్ సోషలిస్ట్‌పార్టీ నాయకుడు) కో–కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ఝూలానాథ్ ఖనల్ తరువాయి 12లో

## బిఆర్ఎస్ పేరుతో బిజెపి ఓట్లు

- కాషాయ పార్టీలో గులాబీని విలీనంచేసే యత్నాలు సాగుతున్నాయ్
- కాళేశ్వరంపై మాజీ సిఎం కెసిఆర్‌పై సిబిఐ విచారణకు మోదీ ప్రభుత్వం అనుమతించడంలేదు
- జూబ్లీహిల్స్‌లో సమస్యలకు కిషన్‌రెడ్డి కారణం
- ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచి బిజెపి తప్పుకున్నదని, బిఆర్ఎస్ పేరుతో ఓట్లు అడుగుతున్నదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. బిజెపిలో బిఆర్ఎస్‌ను విలీనం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని, గతంలో మోదీ ప్రభుత్వానికి ప్రతి అంశంలో బిఆర్ఎస్ మద్దతునిచ్చిందని, ప్రస్తుతం కాళేశ్వరం అవినీతి విషయంలో మాజీ సిఎం కెసిఆర్‌పైన సిబిఐ విచారణకు మోదీ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం సిట్టింగ్ ఎంపిగా ఉన్న కిషన్‌రెడ్డికి తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లాలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. వివరాల ప్రకారం బీజాపూర్ జిల్లాలోని తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల అన్నారం–మరిమల్ల అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉందనే పక్కా సమాచారం మేరకు భద్రతా బలగాలు తెల్లవారు జాము నుండే ముమ్మర కూంబింగ్ ఆపరేషన్ మొదలు పెట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడటంతో లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ మావోయిస్టుల వైపు నుండి కాల్పులు తరువాయి 2లో

## ప్రయాణికులపైకి ట్రైన్

రైల్వే లైన్ దాటుతుండగా ఢీకొట్టిన నేతాజీ ఎక్స్‌ప్రెస్

ఆరుగురు ప్రయాణికులు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని చునార్ రైల్వే స్టేషన్‌లో ఘటన



**మీర్జాపూర్/బిలాస్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన రైలు ప్రమాదం ఘటన మరవకముందే బుధవారం ఉత్తర ప్రదేశ్‌లో మరో ప్రమాదం సంభవించింది. చునార్ రైల్వే స్టేషన్‌లో చోపాన్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతున్న ప్రయాణికులను నేతాజీ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు చనిపోయినట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్తీక పౌర్ణమి నేపథ్యంలో గంగా స్నానాలు ఆచరించడానికి వెళ్తున్నారన్నారు. ఘటన బుధవారం 9:30 గంటల సమయంలో జరిగింది. చూనార్ రైల్వే స్టేషన్‌లోని నాలుగో ప్లాట్‌ఫాం వద్ద చోపాన్–ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ వచ్చి ఆగింది. ప్రయాణికులు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న మరో ప్లాట్‌ఫాంపైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న హౌరా నుంచి కల్కా వెళ్లే నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మృతి తరువాయి 12లో

## నేడే బిహార్ దంగల్



- తొలి సమరానికి రంగం సిద్ధం
- 1,314 మంది అభ్యర్థులు : 3.75కోట్ల మంది ఓటర్లు
- బిహార్‌లో మొదటి విడతగా 121 నియోజకవర్గాలకు నేడు పోలింగ్

**పాట్నా :** బిహార్ తొలి విడత సమరానికి రంగం సిద్ధమైంది. 243 స్థానాలకుగాను తొలి దశలో 121 నియోజకవర్గాలకు గురువారం ఓటింగ్ జరగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. అధికారం నిలబెట్టుకోవాలని పావులు కదుపుతున్న బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ, మళ్లీ సిఎం పీఠం దక్కించుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతున్న ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్ మధ్య గట్టిపోటీ నెలకొంది. అయితే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని జనసురాజ్ పార్టీ తొలిసారి బిహార్ బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావంపై ఉత్కంఠ నెలకొంది. బిహార్ 243 నియోజకవర్గాలు ఉండగా 18 జిల్లాల పరిధిలోని 121 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఓటింగ్, సాయంత్రం 6గంటలకు ముగియనుంది. భద్రతా కారణాలతో సిమ్రిబఖ్తియార్‌పూర్, మహిషి, తారాపుర్, ముంగర్, జమల్‌పుర్, సూర్యగర్హ నియోజకవర్గంలోని 56 పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సాయంత్రం 5 గంటలకే ముగియనుంది. తొలి విడతలో 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 3.75కోట్ల మంది బిహారీలు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. అందులో తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## భారత సంతతికి చెందిన పురేవాల్ సిన్సినాటి మేయర్‌గా తిరిగి ఎన్నిక

**న్యూయార్క్ :** భారత సంతతికి చెందిన పురేవాల్ (43) అమెరికా ఒహియో రాష్ట్రం సిన్సినాటి మేయర్‌గా మరోసారి విజయం సాధించారు. పురేవాల్ భారత్ పంజాబ్‌కు చెందిన సంతతివారు. 1992లో అమెరికాలోని ఒహియోలో జన్మించి అక్కడే విద్యాభ్యాసం పూర్తిచేశారు. డెమోక్రటిక్‌పార్టీ తరపున 2021లో సిన్సినాటిఇ మేయర్‌గా గెలిచిన పురేవాల్ మంగళవారం జరిగిన ఎన్నికల్లో రెండోసారి కూడా విజయభేరీ మోగించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌కు పురేవాల్ సవతి సోదరుడు. ఆయన గతంలో అమెరికా అటార్నీకి స్పెషల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. మొదటిసారి ఆయన 66 శాతం ఓట్లతో మేయర్ పదవి గెలుచుకున్నారు. పురేవాల్ తల్లి టిబెట్‌కు చెందినవారు. బాల్యంలో అక్కడ నుండి భారత్‌లో ఉన్న శరణార్థ శిబిరానికి వచ్చి తలదాచుకున్నారు. పురేవాల్ తండ్రి పంజాబీ. 2015లో పురేవాల్ తన రాజకీయ జీవితం ప్రారంభించారు. హామిల్టన్ కోర్టులో ఒక క్లర్కుగా జీవితం ప్రారంభించారు.

# అమెరికా ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయభేరి



**వాషింగ్టన్:** అమెరికాలో జరిగిన కీలకమైన ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయభేరి మోగించారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో గడచిన 50 ఏళ్ళలో ఎన్నడూలేని విధంగా 20 లక్షలమంది ఓటర్లు భారీ ఎత్తున పోలింగ్ ప్రక్రియలో పాల్గొని రికార్డు సృష్టించారు. దీనిని న్యూయార్క్ మేయర్ అభ్యర్థి మమ్దానీ మహిమగా డెమోక్రాట్లు పేర్కొంటున్నారు. ఈ ఎన్నికల్లో మూడు ముఖ్యమైన పదవులను డెమోక్రాట్లు చేజిక్కించుకున్నారు. న్యూయార్క్ మేయర్ పదవి, న్యూజెర్సీ గవర్నర్ పదవి, విర్జీనియా గవర్నర్ పదవిని గెలుచుకోవడమే కాకుం డా, పెన్సిల్వేనియో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానంలో డెమోక్రాట్లకు ఉన్న 5–2 మెజారిటీని వారు కోల్పోకుండా ఓటర్లు తిరిగి నిలబెట్టారు. మరీ ముఖ్యంగా కాలిఫోర్నియాలో జిల్లాలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి ప్రతిపక్ష డెమోక్రాట్లు చేసిన ప్రతిపాదనలను, వారి ఆలోచనలను సమర్థిస్తూ ప్రజలు ఓట్లు వేశారు. తద్వారా ట్రంప్ ఆలోచనా ధోరణిని కాలిఫోర్నియా ప్రజలు తిరస్కరించారు. ఇక కాలిఫోర్నియా రాష్ట్ర ముఖచిత్రం డెమోక్రాట్ల ప్రణాళిక ప్రకారం మారిపోయేందుకు సిద్ధం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన ఈ ప్రజాభిప్రాయంలో ఓటర్లు జిల్లాల పునర్విభజనను డెమోక్రాట్లు ప్రతిపాదించిన విధంగా 'ప్రిపొజిషన్ 50 ప్రణాళికకు ఆమోదం ఇచ్చారు. దేశ అత్యున్నత దిగువసభను చేజిక్కించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో భాగంగా కాలిఫోర్నియాలో డెమోక్రాట్లు పైచేయి సాధించారు.

మమ్దానీ న్యూయార్క్‌కు తొలి ముస్లిం మేయర్‌గా పదవీ బాధ్యతలు తీసుకోబోతుండగా, స్పాన్‌బెర్గర్ వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. మికీ షెరిల్ న్యూజెర్సీ గవర్నర్ పదవి చేపట్టబోతున్నారు. వీరంతా వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన పదవీ బాధ్యతలు తీసుకుంటారు. అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టిన 10 నెలల కాలంలోనే ప్రజల్లో ఆయన పాలనపట్ల ఏవగింపు కలిగింపు కలిగిందని ఈ ఎన్నికల్లో ఘన విజయం ద్వారా డెమోక్రాట్లు రుజువు చేశారు. న్యూయార్క్ మేయర్ పదవికి అందరూ అనుకున్నవిధంగానే జోహ్రాన్ మమ్దానీ ఘన విజయం సాధించారు. న్యూజెర్సీ గవర్నర్ పదవికి జరిగిన ఎన్నికల్లో రెబక్కా మికీ షెరిల్ (53)విజయం సాధించారు. అలెగ్జాండ్రియాలో 1972లో జన్మించిన మికీ షెరిల్, రెండో ప్రపంచయుద్ధంలో అమెరికా తరపున వైమానికదళ పైలెట్‌గా పనిచేసిన తన తాతను స్ఫూర్తిగా తీసుకుని ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. చిన్న వయసులోనే ఆమె పైలట్‌గా పనిచేశారు. తర్వాత లా డిగ్రీ చేశారు. 2018లో న్యూజెర్సీ 11వ జిల్లా నుండి అమెరికా దిగువసభ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. ఇక వర్జీనియా రాష్ట్ర గవర్నర్‌గా డెమోక్రాట్ల అభ్యర్థి అబిగైల్ స్పాన్‌బెర్గర్ (46) విజయం సాధించారు. ఆమె 2019 నుండీ 2025 వరకూ వర్జీనియా ఏడవజిల్లా నుండి దిగువసభ సభ్యురాలుగా ప్రాతినిధ్యం వహించారు.

**మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురీత?**

ఇదిలా ఉండగా, వచ్చే ఏడాది నవంబరు 3వ తేదీన అమెరికాలో జరిగే మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌కు కష్టాలు ఎదురవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే డెమోక్రాట్లు ట్రంప్‌కు హెచ్చరికలు కూడా చేశారు. వచ్చే ఏడాది సెనేట్‌లో 35 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రతినిధుల సభలో 435 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం రిపబ్లికన్లు ఇటు దిగువసభను, అటు ఎగువసభను తమ నియంత్రణలో ఉంచుకున్నారు. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో డెమోక్రాట్లు పైచేయి సాధిస్తే ఇక రాబోయే రెండేళ్ళూ ట్రంప్ బిల్లులను ఆమోదించుకోవడానికి నానాపాట్లూ పడాల్సి వస్తుంది.

# ఇది ట్రంప్ ఓటమికి బాట

### మమ్దానీ ప్రత్యక్ష హెచ్చరిక
### వలస ప్రజల కేంద్రంగా న్యూయార్క్ నగరం



**వాషింగ్టన్:**న్యూయార్క్ మేయర్‌గా ఘన విజయం సాధించిన మమ్దానీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు నేరుగా హెచ్చరిక చేశారు. ''మిమ్మల్ని మీరు సరిదిద్దుకోండి'' అని హెచ్చరించారు. ఎన్నికల్లో విజ యం సాధించిన తర్వాత అభిమానుల సమక్షంలో ఆయన తొలి సందేశం ఇస్తూ డోనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ''మీరు నన్ను చూస్తున్నారని (ఎలక్ట్రానిక్ ప్రసార మార్గాల్లో) నాకు తెలుసు, అందుకే చెబుతున్నాను, మిమ్మల్ని మీరు సరిదిద్దుకోండి'' అని హెచ్చరించారు. అభిమానులతో మాట్లాడుతూ.. ఈ విజయం ట్రంప్ ఓటమికి బాటలు పరిచిందన్నారు. న్యూయార్క్ నగరం ఇక వలస ప్రజలకు నిలయంగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. న్యూయార్క్ నగరంలో ఇక అద్దెలను క్రమబద్ధీకరిస్తామని చెప్పా రు. ట్రంప్ వలస విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆయన ఎన్నికల్లో ప్రచారం చేసిన విషయం తెలిసిందే. అవినీతి సంస్కృతికి అంతం పలుకుతానని న్యూయార్క్ ప్రజలకు భరోసా ఇచ్చారు. రాజకీయ అంధకారం నుండి న్యూయార్క్ సిటీ బయట పడిందని, న్యూయార్క్ నగరంలో వెలుగులు విరబూశాయని అన్నారు. ఒక మార్పుకు, కొత్త తరహా రాజకీయాలకు మీరు ఓటు వేశారని ఆయన ఓటర్లను అభినందించారు. ఈ విజయం న్యూయార్క్‌లో కొత్త ఉషోదయానికి, నవ శకానికి నాంది అన్నారు. తన తల్లితండ్రులకు కృతజ్ఞతలు చెప్పారు.

**జవహర్‌లాల్‌నెహ్రూ ప్రసంగాన్ని ఉటంకించిన మమ్దానీ**

ఎన్నికల్లో గెలిచిన తర్వాత మమ్దానీ అభిమానులను ఉద్దేశించి తొలి సందేశం ఇస్తూ జవహర్ లాల్ నెహ్రూ పేరును ఉటంకించారు. చరిత్రలో పాతదనం నుండి కొత్త దనంలోకి ప్రవేశించే సమయం వస్తుందని అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1947 ఆగస్టు 15వ తేదీ అర్ధరాత్రి నెహ్రూ ప్రసంగాన్ని మమ్దానీ ప్రధానంగా ప్రస్తావించారు. నెహ్రూ ఆనాడు 1600 పదాలతో ఒక ప్రసంగం చేశారు. ఈ ప్రసంగాన్ని ఈ విధంగా ఉటంకించడం అమెరికాలో ఒక కొత్త విషయం. భారత దేశానికి పునర్జన్మను ఇచ్చేందుకు భారత జాతిని మేల్కొలిపేందుకు నెహ్రూ తన ప్రసంగంలో అనేక విషయాలు ఆనాడు చెప్పారు. మమ్దానీ తన ప్రచార పర్వంలో మొదటి నుండీ బాలీవుడ్‌ను తన ప్రచారభాషగా మార్చారు. ఆయన ప్రసంగం పూర్తయిన తర్వాత ధూమ్ చిత్రంలో టైటిల్ సాంగ్ ఆ ప్రాంతంలో ప్రతిధ్వనించింది. ఇప్పుడు తాజాగా విజయం సాధించిన తర్వాత దశాబ్దాల క్రితంనాటి నెహ్రూ ప్రసంగాన్ని ముందుకు తీసుకురావడం ఆయన ప్రచారపర్వంలో ఒక విజృంభణ. నెహ్రూ ప్రసంగాన్ని ఇష్టపడి ఆదర్శంగా తీసుకున్న మమ్దానీ ఆ ప్రసంగాన్ని ఉటంకించడం అమెరికాలో ప్రధానంగా ఒక సరికొత్త విషయం కాగా, ఏదో కల నెరవేరిందని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న భావన ఆయన అభిమానులలో దీనివల్ల బలంగా వేళ్ళూనుకుంది.

# ఫిలిప్పీన్స్‌లో తుఫాను: 90 మంది మృతి

### కొట్టుకుపోయిన కార్లు, కంటైనర్లు

**మనీలా:** ఆగ్నేయ ఆసియా దేశం ఫిలిప్పీన్స్‌ను 'కల్మెగీ' తుఫాను అతలాకుతలం చేసింది. ఈ తీవ్ర తుఫాను, వరదల కారణంగా 90 మంది మరణించారు. వేలాదిమంది తుఫాను బారినపడ్డారు. దేశ మధ్యప్రాంతం సెబు, ఈస్టర్న్ సమర్, గుయిమరస్, బొహొల్, పలవన్ రాష్ట్రాలలో తీవ్ర ప్రభావం చూపించి విధ్వంసం సృష్టించిన తుఫాను అనంతరం వియత్నాంవైపు దూసుకుపోయింది. తుఫాను తీవ్రతవల్ల సెబు ప్రాంతంలో ఎక్కువమంది మరణించారు. 'కల్మెగీ' తుఫాను వల్ల కేవలం 24 గంటల వ్యవధిలో సెబూలో 183 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తుఫాను ప్రభావం వల్ల ఇటీవలికాలంలో ఎన్నడూ లేనంతగా సెబూ ప్రాం తం వరద ముంపునకు గురైంది. ప్రధాన నగరాలు, పట్టణాలు నీట మునిగాయి. కార్లు కొట్టుకుపోయాయి. చివరకు షిప్పింగ్ కంటైనర్లు కూడా ఎటువైపు కొట్టుకుపోయాయో జాడతెలియని పరిస్థితి దాపురించింది. ఐతే తుఫాను హెచ్చరిక రాగానే ముందు జాగ్రత్తగా 4,00,0000 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ భారీగా మరణాలు సంభవించాయి. మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతూ 90కి చేరింది. తుఫాను తీవ్రత, నష్టం కారణంగా పలు కోస్తా ప్రాంతాలలో సహాయ చర్యలను నిలిపివేశారు. ప్రతి సంవత్సరం దాదాపు 20కిపైగా తుఫానులు ఫిలిప్పీన్స్‌ను భయపెట్టి నష్టం కలిగిస్తూ ఉంటాయి. తుఫానులు ప్రతి ఏటా బీభత్సం సృష్టించే కోస్తా ప్రాంతాలలో లక్షలమంది తీవ్ర పేదరికంలోనే జీవనం సాగిస్తున్నారు.

వందలసంఖ్యలో ఇళ్ళు ధ్వంసమయ్యాయి. సెబూ రాస్ట్రంలో అనూహ్యమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. పట్టణాలు, నగరాల్లో ప్రజలు దిక్కుతోచని పరిస్థితుల్లో ఇళ్ళ పైకప్పులపైకి ఎక్కి కూర్చున్నారు. హెలికాప్టర్లు, పడవల ద్వారా తర్వాత వారికి సహాయం చేసి అన్ని సదుపాయాలు సమకూర్చారు. రెండు రోజులుగా తుఫాను వణికించడంతో సహా య బృందాలు కూడా ఏమీ చేయలేని పరిస్థితులు సంభవించాయి. గంటకు 180 కి.మీ వేగంగా గాలులు వీయడం వల్ల నిస్సహాయంగా ఉండిపోయినట్లు సంబంధిత అధికారులు చెప్పారు. తుఫాను అనంతరం సెబూ రాష్ట్ర రాజధాని నగరం లిలోన్‌లోని మెట్రో ప్రాంతంలో వరద నీటి నుండి 40 మృతదేహాలను వెలికితీసి స్వాధీనం చేసుకున్నట్లు సెబూ అధికార ప్రతినిధి రోస్ రామోస్ చెప్పారు. సెబూలో గతంలో ఎన్నడూ లేనంతగా అసాధారణమైన పరిస్థితి నెలకుందని ఆ రాష్ట్ర గవర్నర్ పమేలా బారికువాట్రో చెప్పారు.

## వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా హైదరాబాదీ హష్మి



**న్యూయార్క్:** వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన గజాలా హష్మి (61)గెలిచారు. డెమొక్రటిక్‌పార్టీ నుండి దక్షిణాసియాకు చెందిన అభ్యర్థులలో భారత సంతతికి చెందిన ముస్లిం మహిళ గజాలా హష్మి. వర్జీనియా సెనేట్‌లో (15వ జిల్లాకు ప్రాతినిధ్యం) వహిస్తారు. 2020లోనే దక్షిణాసియాకు చెందిన తొలి మహిళగా, సెనేట్‌కు గెలిచి తొలి ముస్లింగా ఆమె ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆమెకు 1,465,634 ఓట్లు (54.2 శాతం) లభించాయి. ఆమె 1964లో హైదరాబాద్‌లో జన్మించారు. మలక్‌పేటలో తన అమ్మమ్మగారి ఇంట్లో నివసించారు. ఆమె తాతగారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికశాఖలో పనిచేశారు. 1969లో ఆమె కుటుంబం అమెరికాకు వెళ్ళి వర్జీనియాలో స్థిరపడింది. అక్కడే హష్మి విద్యాభ్యాసం చేశారు. ఆమె 25 ఏళ్ళు విద్యారంగంలో పనిచేశారు. రిచ్మండ్ విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇంకా పలు విశ్వవిద్యాలయాలలో ఆమె పనిచేశారు. 2019లో 10వ సెనేట్ జిల్లాకు జరిగిన ఎన్నికల్లో గెలిచారు.



## బిఆర్‌ఎస్ పేరుతో బిజెపి ఓట్లు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన బిజెపినే కారణమని దుయ్యబట్టారు. ఉప ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌ను గెలిపించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. జూబ్లీ హిల్స్‌లోని పలు ప్రాంతాల్లో సిఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు గడ్డం వివేక్, కొండా సురేఖ, అజారుద్దీన్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎంఐఎం కౌసర్ మొయినుద్దీన్, జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. షేక్ పేట డివిజన్ పారా మౌంట్ కాలనీ, వెంకటగిరి వాటర్ ట్యాంకు నుంచి కృష్ణా నగర్ బి బ్లాక్ మీదుగా యూసుఫ్ గూడ చెక్ పోస్ట్ వరకు రోడ్ షో జరిగింది. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కెసిఆర్, మోదీ ఒవైపు నిలబడితే, మరో వైపు తాను, రాహుల్ గాంధీ నిలబడ్డామన్నారు.2007లో పిజెఆర్ గుండెపోటుతో, ఆ తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో పిజెఆర్ కుటుంబానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తే, ఆ సమయంలో కెసిఆర్ మద్దతు ఇవ్వలేదని, సెంటిమెంట్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఉప ఎన్నికలకు నాంది పలికిందే కెసిఆర్ అని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అలాంటిది కెసిఆర్ కుమారుడు ఇప్పుడు జూబ్లీ హిల్స్‌లో సెంటిమెంట్ రాజకీయాలతో ఓటు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. పిజెఆర్ విగ్రహానికి బిఆర్‌ఎస్ నేతలకు ముక్కునేలకు రాయాలని, ఆ తరువాతనే జూబ్లీహిల్స్‌లో ఓట్లు అడగాలని సూచించారు. జూబ్లీహిల్స్‌లో తమ ఎంఎల్‌ఎ లేకపోయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం రూ. 400 కోట్లను కేటాయించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే, జూబ్లీహిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, నియోజకవర్గ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. పదేళ్ల కాలంలో కెసిఆర్ ప్రభుత్వం ప్రజలకు కనీసం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, సన్న బియ్యం సరఫరా చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాతనే కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశామని, పేదలకు సన్నబియ్యం సరపరా చేస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలీండ్‌ను సరఫరా చేస్తున్నామని సిఎం వివరించారు. రానున్న రోజుల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నాలుగువేల డబుల్ బెడ్‌రూములను ఇస్తామన్నారు.

**అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి ఎందుకు ఇబ్బంది?**

అజారుద్దీన్‌ను రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పిస్తే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎందుకు ఇబ్బంది అవుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు . ముస్లింల వాటాలో భాగంగానే వారికి మంత్రి పదవి దక్కిందని, ముస్లింల వాటాను ముస్లింలకు ఇస్తే ఎందుకు ఇబ్బందిపడుతున్నారని అన్నారు.మోదీ, గుజరాత్ , కిషన్ రెడ్డి ఆస్తులను తాము మైనార్టీలకు ఇవ్వడం లేదని, మైనార్టీల వాటాను మాత్రమే వారికి ఇస్తున్నామన్నారు. కేంద్ర మంత్రిగా ప్రధాని మోదీతో మాట్లాడి హైదరాబాద్‌లోని మూసి ప్రాజెక్ట్‌కు నిధులను ఎందుకు తీసుకురావడం లేదని, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్ల నిర్మాణానికి ఎందుకు అడ్డుపడుతున్నారని సిఎం నిలదీశారు.

## జోహ్రాన్‌కు జై కొట్టిన న్యూయార్క్ (మొదటి పేజీ తరువాయి)

ఎదురుచూస్తున్నారు. దేశంలో ముస్లింలు మతపరమైన గుర్తింపు పొందడంలో ఇప్పటి వరకూ ఎదురవుతున్న సమస్యలన్నింటినీ ఈ ఎన్నికల ద్వారా మమ్దానీ అధిగమించారు. దీంతో అమెరికాలో ముస్లింలకు సామాజిక జీవితంలో వ్యతిరేక ముద్రలు పోయి సానుకూలమైన పరిస్థితులు ఏర్పడే అవకాశాలు వస్తాయని బిబిసి వ్యాఖ్యానించింది. మమ్దానీ గడచిన రెండు వారాలుగా ఎంతో కష్టపడి ఒక ముస్లింగా తనకున్న గుర్తింపును అధిగమించి విజయభేరీ మోగించారని వ్యాఖ్యాత పేర్కొన్నారు.

మమ్దానీ ప్రధానంగా వలస ప్రజల పక్షాన నిలబడ్డారు. దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న జీవన వ్యయాల గురించి ప్రధానంగా ప్రచారం చేశారు. జీవన వ్యయాలు, సామాన్య ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ఇంటి అద్దెల పెరుగుదలకు ఒక నియంత్రణ విధించాలని, కనీస వేతనాలు 30 డాలర్లు ఉండాలని, ఉచిత ప్రభుత్వ రవాణా ఉండాలని, పిల్లల సంరక్షణ ప్రభుత్వమే తీసుకోవాలని, ప్రజల ప్రయోజనార్థం, తక్కువ ధరలకే సరుకులు లభ్యమయ్యేవిధంగా ప్రభుత్వమే కిరాణా దుకాణాలను నిర్వహించాలని, ఎల్‌జిబిటిక్యూలకు సమాన హక్కులుండాలని, ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశాలనే ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో ముందుకు తెచ్చారు. న్యూయార్క్ నగరంలో ప్రధానంగా ఇంటి అద్దెల బాధను ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 10 ప్రధానమైన నగరాలలో ఇళ్ళ అద్దెలు పోల్చిచూస్తే న్యూయార్క్ లోనే ఇళ్ళ అద్దెలు అత్యధికం. ప్రస్తుతం న్యూయార్క్‌లో నెలవారీ సింగిల్ బెడ్రూమ్ అపార్ట్‌మెంట్ అద్దె 4,143 డాలర్లు ఉండగా, ప్రపంచవ్యాప్తంగా దుబాయ్, డబ్లిన్, జ్యూరిచ్, లండన్, సింగపూర్ సహా గిలిన ప్రాంతాలలో మూడు వేలపై చిలుకు నుండి రెండువేల డాలర్ల వరకూ ఉంది.

**మమ్దానీ గురించి క్లుప్తంగా....**

న్యూయార్క్ 36వ జిల్లాలో క్వీన్స్‌నుండి విజయం సాధించిన మమ్దానీ 2021 నుండీ ఆయన న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీ ప్రతినిధిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆర్థిక ప్రజాస్వామ్యం, సోషలిస్టు మార్కెట్ వ్యవస్థ, కార్మికుల స్వయంప్రతిపత్తికోసం పోరాటం చేసే ''డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా (డిఎస్‌ఎ) అమెరికాలో వామపక్షాలకు అతి పెద్ద సోషలిస్టు శిబిరంగా భాసిల్లుతున్న రాజకీయ సంస్థ. ఈ సంస్థ ప్రధానంగా సామ్యవాద ఆర్థిక,రాజకీయ సైద్ధాంతిక భావజాలం పునాదిగా పనిచేస్తుంది. డిఎస్‌ఓసి, ఎన్‌ఎఎంలు విలీనం కావడంతో 1982లో డిఎస్‌ఎ ఆవిర్భవించింది. మమ్దానీ తండ్రి గుజరాతీ ముస్లిం. తల్లి గుజరాతీ హిందూ మీరా నాయర్. ఆయన తల్లి మీరానాయర్ ప్రసిద్ధ భారతీయ,అమెరికన్ ఫిలిమ్ మేకర్. మమ్దానీ బాల్యంలోనే వారి కుటుంబం ఉగాండానుండి అమెరికాకు తరలివెళ్ళింది. 1991 అక్టోబరు 18న ఉగాండాలోని కంపాలలో జన్మించిన జోహ్రాన్ క్వామే మమ్దానీ ఆఫ్రికాను క్షుణ్ణంగా అధ్యయనం చేసి బౌడోయన్ కాలేజీ నుండి 2014లో బ్యాచిలర్ డిగ్రీ తీసుకున్నారు. ఆ తర్వాత నుండీ ఆయన అమెరికాలో ప్రస్తుత ప్రధాన ప్రతిపక్షం డెమోక్రటిక్‌పార్టీలో, డెమోక్రటిక్ సోషలిస్టు అమెరికాలో సభ్యుడుగా కొనసాగుతున్నారు. ఏడాదికాలంగా ఆయన ప్రచారం చేస్తూ వలస ప్రజలు, మౌనారిటీలు, కార్మికులు, అణగారిన వర్గాల పక్షాన తన వాణి వినిపిస్తూ నేషనల్ ఫిగర్‌గా ఎదిగారు.

## ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మొదలయ్యాయి. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు సైతం ఎదురు కాల్పులు జరపడంతో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా ప్రాంతం నుండి ఆయుధాలు, పేలుడు సామాగ్రి, కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకుని అడవుల్లోనికి పారిపోయినట్లు భావిస్తున్న భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ మరింత ముమ్మరం చేశాయి. మావోయిస్టుల మృతదేహాలను సంఘటనా స్థలంనుండి బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు.

## నేడే బిహార్ దంగల్ (మొదటి పేజీ తరువాయి)

122 మంది మహిళా అభ్యర్థులు కాగా జన్ సురాజ్ పార్టీ తరపున ఓ ట్రాన్స్‌జెండర్ కూడా బరిలో ఉన్నారు. తొలి విడతలో ఓటువేయనున్న 3.75 కోట్లమంది కోసం కేంద్ర ఎన్నికల సంఘం 45వేల 341పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 36వేల 733 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 10.72లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ఈ విడతలో ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షం జెడియు అత్యధికంగా 57 స్థానాల్లో పోటీ చేస్తుండగా బిజెపి నుంచి 48 మంది, ఎల్‌జెపి తరపున 14 మంది, రాష్ట్రీయ లోక్‌మోర్చా తరపున ఇద్దరు బరిలో ఉన్నారు. మహాఘట్బంధన్‌కు సంబంధించి ఆర్‌జెడి అత్యధికంగా 73 చోట్ల పోటీచేస్తుండగా కాంగ్రెస్ నుంచి 24మంది, సిపిఐ(ఎంఎల్) తరపున 14 మంది రంగంలో ఉన్నారు. తొలిసారి బిహార్ ఎన్నికల బరిలో దిగిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్‌సురాజ్ పార్టీ నుంచి 119 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. రాజపకర్, బచ్వారా, బెల్దౌర్, గౌరాబౌరం, బిహార్ షరీఫ్ స్థానాల్లో మహాగఠ్‌బంధన్‌లోని భాగస్వామ్య పార్టీలైన ఆర్జేడీ, కాంగ్రెస్, విఐపి, సిపిఐ కూటమి అభ్యర్థులతో పరస్పరం తలపడుతున్నాయి.

**బరిలో 16 మంది మంత్రులు :** బిహార్ తొలి విడతలో ప్రధాన కూటముల తరపున పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. నీతీశ్‌కుమార్ సర్కార్‌లోని 16 మంది మంత్రులు మరోసారి తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. అందులో ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా సహా బిజెపికి చెందిన 11మంది మంత్రులు ఉన్నారు.

సామ్రాట్ చౌదరీ తారాపుర్ నుంచి, విజయ్‌కుమార్ సిన్హా లఖిసరాయ్ నుంచి పోటీ చేస్తున్నారు. మహాఘట్బంధన్ సిఎం అభ్యర్థి, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వీయాదవ్ మూడోసారి రాఘోపుర్ నుంచి బరిలో నిలిచారు. ఆయన సోదరుడు, మాజీమంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్ మహువా నుంచి పోటీ చేస్తున్నారు. రఘునాథ్‌పుర్‌లో రాజకీయనేతగా మారిన గ్యాంగ్‌స్టర్ దివంగత మహ్మద్ షాబుద్దీన్ కుమారుడు ఒసామా సాహబ్ ఆర్‌జెడి తరఫున పోటీ చేస్తున్నారు. నలందలో జెడియు తరఫున ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రవణ్‌కుమార్ ఎనిమిదోసారి రంగంలో ఉన్నారు. తొలిసారి ఎన్నికల బరిలో దిగిన జానపద కళాకారిణి మైథిలీ ఠాకూర్ బిజెపి అభ్యర్థిగా అలీనగర్ నుంచి, కేసరిలాల్ యాదవ్‌గా సుపరిచితుడైన భోజ్‌పుర్ నటుడుగాయకుడు శత్రుఘన్ యాదవ్ చాప్రా నుంచి పోటీలో ఉన్నారు.

# నకిలీ ఓట్లు 25 లక్షలు (మొదటి పేజీ తరువాయి)

ఓటమిగా మార్చడానికి పోల్ ప్యానెల్ 'ఆపరేషన్ సర్కార్ చోరి'ని ప్రారంభించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. తన వద్ద ఉన్న వంద శాతం రుజువుతో ఎన్నికల కమిషన్‌ను, దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రశ్నిస్తున్నానన్నారు. హర్యానాలో అధికార పార్టీ విజయాన్ని నిర్ధారించడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు బిజెపితో కుమ్మక్కయ్యారని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో వారు భాగస్వామ్యంలో ఉన్నారని పేర్కొన్నారు. నిరాశ్రయులకు జీరో ఇంటి నెంబర్ ఇస్తున్నామని భారత ప్రజలకు ఇసిసి అబద్ధాలు చెప్పారని, కానీ అదే వాస్తవమన్నారు. ఇందిరా భవన్‌లో మీడియాతో మాట్లాడిన రాహుల్‌గాంధీ హర్యానా ఎన్నికల జాబితాను ఉదహరించారు. 25,41,144 మంది నకిలీ ఓటర్లు, చెల్లని చిరునామాలు, బల్క్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. హర్యానాలో ఎనిమిది మంది ఓటర్లలో ఒకరు నకిలీ అని, అయినప్పటికీ కాంగ్రెస్ 22,779 ఓట్ల తేడాతో ఓడిపోయిందన్నారు. తాను షాక్‌లో ఉన్నానని, తాము కొన్నిగొన్నదాన్ని చూస్తే నమ్మలేక పోయానన్నా రు. తమ బృందాన్ని అనేకసార్లు చెక్‌చేయమని చెప్పానన్నారు. భవిష్యత్తు దొంగిలించ బడుతున్నందున యువకులు, జనరల్ జెడ్ దీనిని స్పష్టం గా అర్థం చేసుకోవాలని కోరుతున్నానన్నారు. ఎన్నికల కమిషన్ నకిలీలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నిస్తూ, ఇసి నిష్పాక్షికమైన ఎన్నికలకు జరగాలని కోరుకోవడం లేదని ఆరోపించారు. అన్ని ఎగ్జిట్ పోల్స్ హర్యానాలో కాంగ్రెస్ గెలుస్తుందని సూచించాయని, అందులో ఐదు అగ్ర సంస్థలకు కూడా కాంగ్రెస్ క్వీన్‌స్వీప్ చేస్తుందని అంచనా వేశాయని రాహుల్ చెప్పారు. ఆశ్చర్యమైమిటంటే హర్యానాలో మొదటి సారిగా పోస్టల్ ఓట్లు ఫలితం కంటే భిన్నంగా ఉన్నా యని, పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ 73 సీట్లు పొందగా, బిజెపి 17 సీట్లు గెలుచుకుందన్నారు. ఉత్తరప్రదేశ్, హర్యానా రెండింటిలోనూ బిజెపితో సంబంధం ఉన్న వేలాది మంది ఓటు వేశారని గాంధీ పేర్కొన్నారు. బ్రెజిలియన్ మోడల్ అని తాను పేర్కొన్న మహిళ ఫోటోను చూపిస్తూ, ఆమె హర్యానాలోని 25 లక్షల రికార్డులలో ఒకరు అని, ఇది కేంద్రీకృత ఆపరేషన్‌కు రుజువు' అని అన్నారు. హర్యానాలో కాంగ్రెస్ సాధించిన అఖండ విజయాన్ని ఓటమిగా మార్చడానికి ఒక ప్రణాళిక అమలులో ఉందని ఆయన పేర్కొన్నారు. 'సర్కార్ చోరీ' భారతదేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిందని ఇప్పుడు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అంశం తాజా ఆయుధమని రాహుల్ వివరించారు. ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ ప్రతిపక్ష పార్టీలతో సమన్వయం చేసుకుంటుందని ఆయన చెప్పారు. కానీ దేశంలో ప్రజాస్వామ్యం హత్య చేయబడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**బిహార్‌లోనూ 'క్రమబద్ధమైన ఓటు చోరీ'**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల కమిషన్ భారత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు రూపొందించిన 'క్రమబద్ధమైన ఓటు చోరీ' పద్ధతిని బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో కూడా అమలు చేస్తాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. హర్యానాలో 'ఓట్ల దొంగతనానికి ఎవరు బాధ్యులో చాలా స్పష్టంగా తెలుస్తోందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల చిత్రాన్ని చూపిస్తూ గాంధీ అన్నారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవకుండా చూసుకోవడానికి ఈ పెద్దమనుషులు బిజెపితో కుమ్మక్కయ్యారని, ఎన్నికల కమిషన్ ప్రధానమంత్రి, హోంమంత్రి (అమిత్ షా)తో అవగాహనను కలిగి ఉందని, వారు ఈ దేశ ప్రజాస్వామ్య పునాదులను నాశనం చేశారని మండిపడ్డారు. 'ఇది ఇప్పుడు ఒక వ్యవస్థ. పారిశ్రామికీకరణ చేయబడిన ఈ వ్యవస్థను ఏ రాష్ట్రంలోనైనా ఉపయోగించవచ్చు. దీనిని బిహార్‌లో ఉపయోగించ బోతున్నారని మాకు చాలా స్పష్టంగా తెలిసింది. బిహార్ ఎన్నికల తర్వాత, మేము అదే రికార్డులను పొందుతామని, బిహార్‌లో కూడా అదే జరిగిందని మీకు చూపిస్తామని నేను విశ్వసిస్తున్నాను' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ అన్నారు. ఎన్నికలకు ముందు చివరి నిమిషంలో ఓటర్ల జాబితా వచ్చేటప్పటికి రాజకీయ పార్టీలు 'ఓటు చోరి' డిజైన్లను అడ్డుకోవడానికి పని చేయలేవని గాంధీ తన ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. 'రాజ్యాంగాన్ని ఖూనీ చేయడానికి, భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు ప్రధానమంత్రి, బిజెపి, ఎన్నికల కమిషన్ అభివృద్ధి చేసిన క్రమబద్ధమైన వ్యవస్థ' అని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఓటరు జాబితాలలో పేర్లు తొలగించబడిన బిహార్ గ్రామానికి చెందిన కొంతమందిని కూడా గాంధీ వేదికపైకి పిలిచారు. ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించబడిన వారిలో ఒకరు తన గ్రామంలోని 187 మంది పేర్లను తొలగించారని చెప్పారని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఓటర్ల జాబితా సమగ్రత ఏ రాజకీయ పార్టీ బాధ్యత కాదు, కానీ ఇసి బాధ్యత అని ఒక ప్రశ్నకు సమాధానంగా రాహుల్ చెప్పా రు.

**రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం : ఇసి**

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎన్నికల దొంగతనం వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఓటు తారుమారు ఆరోపణ నిరాధారమైనదని, ఎందుకంటే హర్యానాలో ఓటర్ల జాబితాపై ఎటువంటి అప్పీళ్లు దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. 2024 అక్టోబర్‌లో జరిగిన ఎన్నికల్లో బహుళ ఓట్లు వేసిన ఓటర్లను కాంగ్రెస్ బూత్ ఏజెంట్లు ఎందుకు గుర్తించలేదని కూడా వారు ప్రశ్నించారు. బహుళ పేర్లను నివారించడానికి ఓటరు జాబితా సవరణ సమయంలో కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్లు ఎటువంటి వాదనలు, అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదన్నారు. ఎన్నికల జాబితాలో ఏవైనా అవకతవకలను గుర్తించడానికి రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజెంట్లు లేదా బిఎల్‌ఎలను నియమిస్తాయి. కాగా, ఎన్నికల జాబితాలపై 'సున్నా అప్పీళ్లు' దాఖలు అయ్యాయని, ప్రస్తుతం 22 ఎన్నికల పిటిషన్లు మాత్రమే పంజాబ్, హర్యానా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఇసి అధికారులు స్పష్టం చేశారు. హర్యానాలోని రాయ్, హోడల్ అసెంబ్లీ సీట్ల అంశాన్ని గాంధీ లేవనెత్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితాలను శుభ్రపరచడానికి ఇసి చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, పౌరసత్వ ధృవీకరణతో పాటు నకిలీ, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కు గాంధీ మద్దతు ఇస్తున్నారా అని అధికారులు ప్రశ్నించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పత్తి బస్తాలు తడిచిన ఘటనపై విచారణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల కురిసిన భారీ వర్షం కారణంగా 'వరంగల్ మార్కెట్' పత్తి సంచులు తడిచిన ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు, 7329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు గుర్తించారు. తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజు కొనుగోలు చేశారని అధికారులు తమ నివేదికలో పొందుపర్చారు. ఈ నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు అందజేశారు. 'వరంగల్ మార్కెట్‌లో పత్తి సంచులు తడిచిన ఘటన'పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విచారణకు ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి సూచనతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఈ విచారణలో 7329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు తేలింది.

తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజున కొనుగోలు చేశారు. రైతులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగలేదని రీజనల్ జాయింట్ డైరెక్టర్ తన నివేదికలో పొందుపర్చారు.

## బిఆర్ఎస్‌ను తిరస్కరించి... కాంగ్రెస్‌కు ఓటు వేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా సిపిఐ నాయకులు నియోజకవర్గంలోని మోతీనగర్ చౌరస్తా నుండి బంజారా నగర్, ఎన్ఆర్ఆర్‌పురం, శ్రీ సాయిబాబానగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో బుధవారం ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్ బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, పాలబిందెల శ్రీనివాస్, వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు చైతన్య, నరసింహ అనిల్, లెనిన్,దస్తగిరి, సుశాంత్, భాను, అరుణ్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ బృందం ప్రతి షాపులను, ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, సిపిఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రజలను అవమానించే బిఆర్ఎస్‌ను తిరస్కరించి, కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ తెలంగాణను దోచుకుని, దాచుకున్నదని ఆరోపించారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించారని, అప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిఆర్ఎస్ అనేక కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే బిజెపితో అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకుని తిరిగి ఎన్నికల్లో గెలిచేందుకు బిఆర్ఎస్ అబద్ధాలతో ప్రజలను మోసగిస్తోందని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ ప్రతిపక్ష పాత్ర నిర్వహించేందుకు సిద్ధంగా లేదన్నారు. మళ్లీ అధికారాన్ని దక్కించుకుని దోపిడీ చేయాలని ఉవ్విళ్లు ఊరుతున్నారని, ఇలాంటి పార్టీని ప్రజలు ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి ఆ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కమతం యాదగిరి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్న పరిస్థితి అత్యంత విషాదకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నదన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

# అధ్వాన పాలనను అడ్డుకోకపోతే అధోగతే

ఎన్‌డిఎ విధానాలపై సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ విమర్శ



**విజయవాడ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక పాలనతో ప్రజల జీవన పరిస్థితులు దయనీయంగా మారిపోయాయని, బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ఈ అధ్వాన పాలనకు చరమగీతం పలకాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశాలు విజయవాడలోని దాసరి భవన్‌లో బుధవారం జరిగాయి. పి.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ హాజరయ్యారు. ఎపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అజెండా ప్రవేశపెట్టారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ సీపీఐ చండీగఢ్ మహాసభలు ఇచ్చిన పిలుపు మేరకు వామపక్షాల ఐక్యత దిశగా పార్టీశ్రేణులను నడిపించాలని పిలుపునిచ్చారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా బలోపేతం కావడానికి సమస్యల ప్రాతిపదికగా ఉద్యమ నిర్మాణాలే శరణ్యమని అన్నారు. సరైన సమయంలో, సరైన రీతిలో, సరైన రాజకీయ నిర్ణయాలు అత్యంత అవశ్యమని చెప్పారు. వామపక్షాలు ఆత్మవిమర్శనా దృష్టితో లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చినప్పుడే మతోన్మాద, ఫాసిస్టు బీజేపీని గద్దె దింపగలమని చెప్పారు. ఇండియా ఐక్యసంఘటన బలోపేతం కావడానికి కాంగ్రెస్ చొరవ చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై బీజేపీ సైతం మద్దతునిచ్చిందని, అయితే కేంద్రంలో బీజేపీ నాటకాలాడుతూ బీసీ వర్గాలను దగా చేస్తున్నదన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు సందర్భంగా డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో కనీవినీ ఎరుగని రీతిలో జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేటీకరణ, అప్పులు, అవినీతితో చంద్రబాబునాయుడు ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని విమర్శించారు. విద్య, వైద్యం వంటి ప్రాధాన్యత రంగాలతోపాటు సర్వం ప్రైవేటీకరణ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి జరుగుతున్నదన్నారు. 70 శాతం ప్రాథమిక విద్యను ప్రైవేటువారి చేతుల్లో పెట్టిన కూటమి సర్కారు... మెడికల్ కాలేజీలన్నింటినీ అమ్మేసిందని, ఇకపై ఉన్నతవర్గాలకు తప్ప సామాన్యుడికి వైద్య, విద్య అందే పరిస్థితి లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపిస్తూ స్టాఫ్ కొరతతో యూనివర్సిటీలు మూతపడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని జగన్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన చంద్రబాబు... ఇప్పుడు అంతకుమించిన అప్పులతో రాష్ట్రాన్ని మరిన్ని కష్టాల్లోకి నెట్టేశారన్నారు. బీహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వ ఓటమి ఖాయమని, తేజస్వీయాదవ్ నాయకత్వంలో మహాగట్బంధన్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. బీహార్‌లో కులంతో పాటు భూ సమస్య వేధిస్తున్నదని, భూసమస్యపై పోరాడిన చరిత్ర కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందని, 9 స్థానాల్లో పోటీ చేస్తున్న సిపిఐకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికలు దేశ భవిష్యత్‌కు చాలా కీలకమన్నారు. తీవ్ర పేదరికం నుంచి కేరళను విముక్తి చేసిన ఎల్‌డీఫ్ ప్రభుత్వ విధానాలు దేశానికే మార్గదర్శకమని అన్నారు. నూటికి నూరు శాతం దుర్భర దారిద్ర్యాన్ని తొలగించడంతోపాటు వందశాతం అక్షరాస్యత, భూసంస్కరణలు అమలు చేసిన ఏకైక రాష్ట్రంగా కేరళ నిలిచిందని, మానవ అభివృద్ధి సూచీలోనూ ముందంజలో నిలిచిందని కొనియాడారు. కమ్యూనిస్టుల పాలనలో కేరళ అభ్యున్నతి సాధించడం గర్వంగా ఉందన్నారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సిపిఐ వందేళ్ల ముగింపు కార్యక్రమం పురస్కరించుకొని డిసెంబరు 26వ తేదీన జరిగే 'చలో ఖమ్మం' కార్యక్రమంలో ప్రతి జిల్లా నుంచి విస్తృతంగా పాల్గొనాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొలుత అమరవీరులకు నివాళులర్పిస్తూ సిపిఐ కార్యదర్శివర్గసభ్యులు తాటిపాక మధు సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, సభికులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమితి సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఏఐకేస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంక య్య పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రనాయక్, పెంచలయ్య విప్లవ గీతాలు ఆలపించారు.

### సిపిఐ నూతన కార్యదర్శివర్గం ఇదే

**అమరావతి:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శివర్గాన్ని విజయవాడ దాసరి భవన్‌లో పి.రామచంద్రయ్య అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యతో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా జేవీ సత్యనారాయణమూర్తి, పి.హరినాథరెడ్డి, కేవీవీ ప్రసాద్, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులు, శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ ఎన్నికయ్యారు.


## పేదవాడి ఓటు హక్కును హరించేందుకు బిజెపి కుట్ర



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/జనగామ :** పేదవాడి ఓటు హక్కును హరించేందుకు బీజేపి కుట్ర చేస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సిపిఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి జువారి రమేష్ అధ్యక్షత వహించగా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పేదలకు ఓట్లు వేయనీయవద్దని చెప్పిన కేంద్రమంత్రి లలన్‌సింగ్‌ను కేంద్రమంత్రి మండలి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కేంద్రం ఓటరు ప్రత్యేక జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించేందుకు సిద్ధమైందన్నారు. కేంద్రప్రభుత్వ కనుసన్నల్లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను చేపట్టిందని, ఎస్ఐఆర్‌ను రాజకీయ అస్త్రంగా ఉపయోగించి ఎన్నికలకు ముందు ఓటర్లను బెదిరించడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో జరిగే సిపిఐ శతజయంతి ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభకు జిల్లా నుండి పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు జీడి ఎల్లయ్య, రావుల సదానందం, పాతూరి ప్రశాంత్, కావటి యాదగిరి, చొప్పరి సోమయ్య, జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లను పరిష్కరించే వరకు కళాశాలల బంద్ కొనసాగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు 'కళాశాలల బంద్'ను కొనసాగిస్తామని, బకాయిలలో సగం నిధులను, రూ.5వేల కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తేనే బంద్‌ను విరమించుకుంటామని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేశ్ బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో అధ్యాపకుల సభను నిర్వహిస్తామన్నారు. ఈ నెల 11 లేదా 12వ తేదీన విద్యార్థులతో సభను నిర్వహిస్తామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని, కానీ అందులో అనవసరమైన వ్యక్తులను సభ్యుల నుంచి తొలగించాలని కోరారు. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలన్నారు.

## కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా 26న నిరసన ప్రదర్శనలు

సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం పశ్యపద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టి.సాగర్, మండలి వెంకన్న, ఎం.భిక్షపతి, వి.ఉపేందర్‌రెడ్డి, జక్కుల వెంకటయ్య, బి.రాము, ఈ.విజయ్ హాజరయ్యారు. కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 26న జిల్లా కేంద్రాలలో కార్యక్రమాలను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల దోపిడీకి వ్యతిరేకంగా, దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాలని, పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బ్లాక్‌డేను పాటించామని, విద్యుత్ సవరణ బిల్లు 2025 ను ఉపసవరించాలని, రుణమాఫీ చట్టం చేయాలనే డిమాండ్‌లపై పోరాటాలను ఉధృతం చేసినా, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసినప్పటికీ ఇలా అనేక కార్యక్రమాలను సంవత్సరాలుగా నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర పాలకులు స్పందించలేదని విమర్శించారు. కార్పొరేట్ అనుకూల విధానాలను బరితెగించి అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని నాయకులు విమర్శించారు. పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు–2025ను ఉపసంహకరించుకోవాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, వరుసగా కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఆహార పంటలకు ఎకరాకు రూ.25000, ఉద్యాన, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50,000 నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. భూ సేకరణ చట్టం 2013ను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. పంటలకు బోనస్ ఇవ్వాలని, లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేయడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తుందన్నారు. ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రాలలో జరగనున్న కార్యక్రమాలను జయప్రదం చేసే విధం గా సంబంధించి అన్ని జిల్లాల్లో పత్రికా సమావేశాలను ఏర్పాటు చేయాలని, రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.

## మహిళా సంఘాలను ఆర్థికంగా తీర్చిదిద్దుతున్నాం

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. 'వడ్డీ లేని రుణాల' పథకం కింద ఏటా రూ.వేయి కోట్లకు పైగా మహిళా సంఘాలకు వడ్డీలు చెల్లిస్తున్నామని, 63 లక్షల మంది మహిళలు సంఘటిత శక్తిగా 'ఇందిరా మహిళా శక్తి' పని చేస్తోందన్నారు. స్థూల జాతీయ ఉత్పత్తిలో మహిళలకు భాగస్వామ్యం పెంచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నెదర్లాండ్‌లో జరిగిన 'వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్(వివిజిఎఫ్) గ్లోబల్ సమ్మిట్‌లో 'ప్రతికూలతల నుండి సాధికారతవైపు దేశాలను మారుస్తున్న మహిళల శక్తి' అనే అంశంపైన జరిగిన సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళలు తెలంగాణ రాష్ట్రంలో సోలార్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారని, ఆర్‌టిసికి బస్సులు అద్దెకు ఇస్తున్నారని, పెట్రోల్ బంకులు నడుపుతున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణాన్నిఅమలు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళల భాగస్వామ్యం 40 శాతం కాగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అది 20 శాతం లోపే ఉందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే సంకల్పంతో తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి సంవత్సరం కనీసం రూ.25 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు మహిళా సంఘాలకు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గిరిజన హక్కులను కాపాడడమే తెలంగాణ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాగా అంతర్జాతీయ సదస్సులో పెరూ దేశ మొట్టమొదటి మహిళ ప్రధాని బెట్రిజ్ మెరినో, వివిధ దేశాలకు చెందిన మహిళా ఎంపిలు, పలువురు మహిళా ప్రముఖులు ప్రసంగించారు. ఆయా దేశాల్లో నెలకొన్న పరిస్థితులు, మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సాధించాల్సిన లక్ష్యాలపై తమ అనుభవాలను సీతక్క తెలిపారు.

## రూ.10 కోట్లు డిమాండ్ చేసిన మీడియా ప్రతినిధులపై కేసు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనను బ్లాక్ మెయిల్ చేసి టివి5 యాంకర్ డిహెచ్‌విఎస్ఎస్ఎన్ మూర్తి రూ.10 కోట్లు డిమాండ్ చేశాడని నటుడు ధర్మ సత్య సాయి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు చర్యలు తీసుకున్నారు. తన ఫోన్ ట్యాప్ చేసి, వ్యక్తిగత వివరాలను టెలికాస్ట్ చేస్తూ రూ.10 కోట్లు డిమాండ్ చేశాడని మహేష్ ఆరోపించారు. ఈ ఆరోపణలతో ఆయన కోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాలపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాలతో ఎ1గా చిరుమామిళ్ల గౌతమి, ఎ2గా మూర్తి చేరుస్తూ కూకట్‌పల్లి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే ధర్మ మహేశ్ డ్రింకర్ సాయి, సింధూరం సినిమాల్లో హీరోగా నటించాడు. కొన్నేళ్ల క్రితం సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ గౌతమి చౌదరిని అతడు వివాహం చేసుకోగా ఇద్దరి మధ్య విభేదాల కారణంగా దూరం అయ్యారు. ఈ క్రమంలో గౌతమి, ధర్మ మహేశ్ తరచూ టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇటీవల కూడా ధర్మ మహేశ్.. మూర్తిపై సంచలన ఆరోపణలు చేశాడు. ఇక ఇప్పుడు కోర్టును ఆశ్రయించడంతో ఏం జరుగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు:మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల అకాంక్షలను అనుగుణంగా సిఎం రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కోనసాగాలంటే కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మంత్రి జూపల్లి కృష్ణారావు తన ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఉప ఎన్నికపై ప్రత్యేక దృష్టి సారించిన జూపల్లి... కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎర్రగడ్డ డివిజన్‌లో బోరబండలోని సాయిబాబా నగర్‌లో బుధవారం నవీన్ యాదవ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వృద్ధులను, మహిళలను అప్యాయంగా పలకరిస్తూ... అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ... హస్తం గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

## ప్రతి హామీ నెరవేర్చుతాం... ఆందోళన వద్దు

ఓర్వలేకే మాపై ప్రతిపక్షాల విమర్శలు


జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా నెరవేర్చుతామని, ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళనకు గురి కావొద్దని ప్రజలకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి... అత్యధిక మెజార్టీతో నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఎల్లారెడ్డి గూడ, కమలాపురి కాలనీ, ఇమాంగూడ, జయప్రకాష్ నగర్, తవాక్కల్ నగర్, అలీ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఇంటింటికి తిరిగి వివరించారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసిన బీఆర్ఎస్ నేతలు ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. మా అభివృద్ధి, సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంటే, అది చూసి ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

## రెండేళ్లలో ఏం చేశారో చెప్పి ఓట్లు అడగండి

కాంగ్రెస్‌కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో చేసిన కార్యక్రమాలను వివరించి ఓటు అడగాలని డిమాండ్ సిఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్‌లో ఇప్పటి వరకు రూ.5,328 కోట్లు ఖర్చు చేయగా, వీటి ద్వారా 2,12,862 మందిలబ్ధి చేకూరిందన్నారు. దళిత బంధు రూ.10.6 కోట్లు, బిసి బంధు రూ.3.8 కోట్లు ఖర్చు చేశామన్నారు. ''జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రగతి నివేదిక''ను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ ప్రగతి నివేదికలో బిఆర్ఎస్ పదేళ్లకాలంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రజా రవాణ, రోడ్లు, మెట్రో,ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు రూ 2,463 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. జూబ్లీహిల్స్‌లోని ఏ గల్లీకి వెళ్లినా మాగంటి గోపినాథ్ వేసిన శిలాఫలకం కనిపిస్తుందని, తాము చేసిన అభివృద్ధిని వివరించి ప్రజలకు ఓట్లు అడుగుతామని కెటిఆర్ తెలిపారు. టిమ్స్ ఆస్పత్రి, బస్తీదవఖానను ఏర్పాటు చేశామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 34,712 మందికి వ్యాక్సిన్లు ఇచ్చినట్లు వివరించారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద రూ.98 లక్షలు, కెసిఆర్ కిట్ కింద రూ.73 లక్షలు, కంటివెలుగు కోసం రూ.55 లక్షలు, న్యూట్రిషన్ కిట్ల కోసం రూ.14 లక్షలు ఖర్చు చేశామని కెటిఆర్ తెలిపారు. గృహ నిర్మాణానికి రూ.324 కోట్లు ఖర్చు చేశామన్నారు. మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపించామన్నారు.


దేవాదాయ-ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వము
**శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము**
అలంపూరు పట్టణము, జోగుళాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నం. 08502-241327

సీల్డ్ టెండరు కం బహిరంగ వేలము కం ఆన్‌లైన్ టెండర్ల ప్రకటన

లేఖ నం.: 6/EO/SJBBSGD/2025 తేది: 05-11-2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఇట్టి దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింద తెలిపిన వివిధ టెండర్లు నిర్వహించబడును.

విభాగము - ఎ

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | శ్రీ అమ్మవారి చీరల సేకరణ చేసుకొను హక్కు | ఒక సంవత్సరము 01.12.2025 నుండి 30.11.2026 వరకు | 1,000-00 | 8,00,000-00 |
| 2 | టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 20,00,000-00 |
| 3 | పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు | " | 1,000-00 | 20,00,000-00 |
| 4 | ఫోటోలు క్యాసెట్లు అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 3,00,000-00 |
| 5 | వసతి గదులు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 4,00,000-00 |
| 6 | క్యాంటిన్ షాపు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 1,00,000-00 |
| 7 | రక్షా కంకణాలు, డాలర్లు, క్యాలెండర్లు అమ్ముకొను హక్కు | " | 1,000-00 | 2,00,000-00 |
| 8 | శౌచాలయములు నిర్వహించుకొను హక్కు | " | 1,000-00 | 3,00,000-00 |

విభాగము - బి

| క్ర.సం. | టెండరు వివరములు | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | లడ్డు, పులిహోర కవర్లు, లడ్డు బాక్సులు, క్యారీబ్యాగులు మొ॥ ప్రింటింగ్ చేసి సరఫరా చేయుటకు | 2 సంవత్సరములు 01.12.2025 నుండి 30.11.2027 వరకు | 1,000-00 | 10,000-00 |
| 2 | పూల మాలలు సరఫరా చేయుటకు & పూల అలంకరణలు చేయుటకు, | " | 1,000-00 | 10,000-00 |
| 3 | టెంట్ హౌస్ & సప్లయర్స్ సామాగ్రి సరఫరా చేయుటకు, | " | 1,000-00 | 10,000-00 |
| 4 | అరటి మట్టలు, మామిడాకులు సరఫరా చేయుట | " | 1,000-00 | 10,000-00 |
| 5 | స్టేషనరీ సామాగ్రి సరఫరా చేయుటకు | " | 1,000-00 | 10,000-00 |
| 6 | హెూమమునకు అవసరమైన కట్టెలు (సమిధలు) సరఫరా చేయుటకు | " | 1,000-00 | 10,000-00 |

ఆసక్తి గల వారు సీల్డ్ కం బహిరంగ వేలము కం ఆన్ లైన్ టెండరు పూర్తి వివరముల కొరకు
www.tender.telangana.gov.in endowments. Marketing నందు తిలకించగలరు
ఈ సీల్డ్ టెండర్లలో పాల్గొనదలచిన వారు తేది:- 07.11.2025 నుండి 11.11.2025 నాడు సా. గం.5-00 లోపు షెడ్యూలు ధర రూ.1,000/- చెల్లించి షెడ్యూల్లు పొందగలరు.
వేదిక :- శ్రీ జోగుళాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము, అలంపూర్ గ్రా॥ & మం॥, జోగుళాంబ గద్వాల జిల్లా.
టెండర్లు నిర్వహించు తేది:- 12.11.2025 బుధవారము, సమయము ఉ.11-00 లకు
షరతులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు కానీ (లేదా)
సెల్ నం. 9490518885 కానీ, 9441311022 ను కానీ సంప్రదించగలరు.

DIPR R.O. No. : 10275-PP/CL/ADVT/1/2025-26, Date: 05-11-2025 కార్యనిర్వహణాధికారి



# జనరల్
STATE & REGIONAL NEWS




జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని యూసఫ్ గూడ వెంకటగిరిలో బుధవారం ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న కొండ సురేఖ.
రహమత్ నగర్లో టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ ఇంటింటి ప్రచారం.

## మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయండి

మార్కెట్‌ను సందర్శించిన సిపిఐ బృందం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. బుధవారం సిపిఐ నాయకులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలు జరిగే సమయం కాబట్టి వీలైనంత తొందరగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండవ పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా ఖమ్మం ఉందని తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్లగొండతో పాటు ఆంధ్రా నుంచి కూడా వచ్చి ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులను రైతులు విక్రయిస్తారని ఆయన తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ మార్కెట్ పనులను పూర్తి చేయాలని జానిమియా కోరారు. మిర్చి సీజన్ త్వరలో ప్రారంభం కానుందని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టేవిధంగా ఉందని పత్తి కొనుగోలుపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, నాయకులు భూక్యా రవీందర్ పాల్గొన్నారు.



## పత్తి పంటను ధ్వంసం చేసిన ఫారెస్ట్ అధికారులు

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గత 20 సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటున్నా తమ పోడు భూముల్లో పత్తి పంటను మంగళవారం సాయంత్రం ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారని బాధితులు బుధవారం వాపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాయికంపాడు బీట్ పరిధిలో పోడు భూముల్లో పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేయటాన్ని నిరసిస్తూ పోడుదారులు పీకిన పత్తితో పోడుదారులైన గుగులోత్ వాలీ, తేజవత్ సరోజనల తమ నిరసన వ్యక్తం చేశారు. సుమారు ఐదు ఎకరాల్లో చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేశారని వారు ఆవేదన వ్య క్తం చేశారు.

## 51.9 కిలోల గంజాయి పట్టివేత


ముగ్గురిపై కేసు నమోదు, ఇద్దరు అరెస్ట్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఒడిస్సా నుండి అక్రమంగా కేరళాకు తరలించుకు పోతున్న నిషేదిత గంజాయిని పట్టణంలోని కూనవరం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్నారు. బుధవారం అనుమానాస్పదంగా అతివేగంతో వ స్తున్న కేఎల్ 08 బిఎక్స్ 48 55 నెం బర్ గల కారును ఎక్సైజ్ అధికారులు ఆపి సోదాలు చేయగా కారు ఇంజన్ ఉండే ప్రదేశంలో గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వాటిని స్వాదీనం చేసుకుని తూకం వేయగా 51.5 కేజీ లు ఉన్నాయి. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 26 లక్షల వరకు ఉంటుంది. గంజాయితో పా టు కారు, మోటార్ సైకిల్‌ను స్వా దీనం చేసుకున్నా రు. ఇందులో భాగంగా కేరళాకు చెందిన జకారి యా పర్యాల్, నసిర పూర్తియా వేట ల్ ను అదుపులోనికి తీసుకుని అ రెస్టు చేశారు. అదే విధంగా అరెస్టు అయిన వారు ఇచ్చిన సమాచారం మేరకు సూర్యపేటకు చెందిన కం దుల రవి అనే వ్యకిపై కూడా కేసునమోదు చేశారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మె ంట్ డైరెక్టర్ షాన్వాస్ ఖాసీం చేపట్టి న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గంజాయిని పట్టుకున్నట్లు ఖమ్మం అసిస్టెంట్ కమీషనర్ గణేష్ తెలిపారు.

## టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ఫీజు చెల్లిస్తా

కలెక్టర్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విధ్యార్థులందరికి ఈ యేడాది ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12292 మంది విధ్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విధ్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకు పైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధ్యార్థులంతా దారిద్రరేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విధ్యార్థుల తల్లిదండ్రులు కూలీ పనిచేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు సైతం చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆమొత్తాన్ని తన వేతనం నుంచి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వచ్చే ఏడాది విద్యాసంవత్సరం ఆరంభంలోనే మోదీ కిట్స్ పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయబోతున్నారు.

# ‘హైడ్రా’కు జన నీరాజనం

రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ

భారీ ర్యాలీలు - ప్లకార్డులతో ప్రదర్శనలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రా చేపట్టిన చర్యలతో ప్రజలలో సానుకూలత వ్యక్తం అవుతోంది. పార్కులు, ప్లే గ్రౌండ్‌లు, లౌఔట్‌లలో ఖాళీ స్థలాల కబ్జాలపై ఫిర్యాదు అందిన వెంటనే చర్యలకు ఉపక్రమించడంతో పట్ల బాధిత ప్రజలు హైడ్రాకు నీరాజనం పడుతున్నారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరపడం త్వరితగతిన చర్యలు చేపట్టడంతో సత్వర ఫలితాలు వస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు హైడ్రా చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే హైడ్రా చర్యలను స్వాగతిస్తూ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించి, హైడ్రాకు మద్దతుగా నిలుస్తున్నారు. మంగళవారం అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వద్ద వాకింగ్ చేసిన వారు హైడ్రా పనులను కీర్తిస్తే, బుధవారం మణికొండ మర్రి చెట్టు వద్ద దాదాపు 15 కాలనీల వారు ర్యాలీ నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీలో రూ. వెయ్యి కోట్లకు పైగా విలువైన పార్కులను కాపాడి నగర ప్రజలకు ప్రాణవాయువును అందించారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నెక్నాంపూర్ విలేజ్, తిరుమల హిల్స్ నుంచి చిన్నా పెద్ద వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఖాజాగూడ ప్రశాంతి హిల్స్‌లో హైడ్రా కాపాడిన పార్కుల్లో మొక్కలు నాటారు. కొండాపూర్‌లోని రాఘవేంద్ర కాలనీలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ కాలనీలో 4300 గజాల ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడారంటూ ర్యాలీ జరిపారు. రాఘవేంద్ర కాలనీలో 2000 గజాల పార్కును కాపాడినందుకు అభినందన సభ ఏర్పాటు చేశారు.

**దుష్ప్రచారం తగదు ..**

హైడ్రాపై దుష్ప్రచారం తగదని పలువురు ఈ సందర్భంగా హితవు పలికారు. కొంతమంది స్వార్థానికి అందరూ బలి కావద్దని అన్నారు. ఇటీవల పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని హఫీజ్ బాబా నగర్‌లో హైడ్రా ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదు. రహదారి విస్తరణలో భాగంగా ఇప్పటికే ఆ మార్గంలో ఉన్న భవనాలకు నష్టపరిహారం కూడా చెల్లించడమైంది. రహదారి విస్తరణతో పాటు నాలా పనుల వల్ల అర్నా గ్రామర్ స్కూల్ బిల్డింగ్‌ను జిహెచ్‌ఎంసి తొలగించింది. దీనిని కూడా హైడ్రాకు ఆపాదించి సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేయడాన్ని కూడా పలువురు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా హైడ్రా పని చేస్తున్న విషయం పలు సందర్భాల్లో నిరూపితమైందన్నారు. దశాబ్దాల సమస్యలను గంటల్లో రోజుల్లో పరిష్కరించే సత్తా ఉన్న హైడ్రాకు మేమంతా అండగా ఉన్నామని, నగర ప్రజలు ఇప్పటికే హైడ్రాతో కలిసి పని చేస్తున్నారని పలువురు తెలిపారు.



ప్రభుత్వ సలహాదారుగా

## సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ప్రభుత్వ సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. మంత్రి తుమ్మల, ఇతర నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోనే సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, పాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించి తెలంగాణ సర్కార్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు కేబినెట్ హోదాతో కూడిన పదవిని కట్టబెట్టారు. కాగా సుదర్శన్‌రెడ్డికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, చిట్‌ఫండ్ కంపెనీల బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వజ్రాల అరుణ, సంఘం నాయకులు సత్యనారాయణ రాజు, ప్రవీణ్, లత పాల్గొని సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు.



## 9న విజెఏ పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (విజెఎ) ఆదివారం (ఈ నెల 9న) బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఒక ప్రత్యేక పుస్తక విడుదల కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఇందులో సీనియర్ జర్నలిస్టుల అనుభవాలను వివరించే రెండు ప్రధాన ప్రచురణలు ఉన్నాయి.గండూరి కృష్ణ (జెకె) రచించిన మొదటి, అప్పుడు–ఇప్పుడు, జర్నలిజంలో మారుతున్న కాలాన్ని ప్రతిబింబించే కథనాన్ని అందిస్తుంది. రెండవది, అనుభవాలు–జ్ఞాపకాలు, ప్రముఖ జర్నలిస్టులు తమ అనుభవాలను మరియు జ్ఞాపకాలను పంచుకునే ప్రసంగాల సంకలనం, దీనిని వెటరన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించి ప్రచురించింది. భారత మాజీ ఉపరాష్ట్రపతి మరియు కేంద్ర మంత్రి ఎం. వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, సమాచార ప్రజా సంబంధాల ప్రత్యేక కమిషనర్ సి. ప్రియాంక గౌరవ అతిథులుగా హాజరవుతారు. ప్రముఖ సంపాదకులు కె. రామచంద్ర మూర్తి, ఎస్. వెంకట్ నారాయణ్ (మాజీ ఎడిటర్, ఇండియా టుడే ఇంగ్లీష్), రాజా సుఖ (మాజీ ఎడిటర్, ఇండియా టుడే తెలుగు) కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10:45 గంటలకు బషీర్ బాగ్‌లోని ఎపియుడబ్ల్యూజె కార్యాలయంలో ప్రారంభమవుతుంది.

## తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మద్యం తయారీ కంపెనీలు

రూ.3366.21 బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మద్యం తయారీ కంపెనీలు కొట్టుమిట్టాడుతున్నాయని ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా( ఐఎస్‌డబ్ల్యూఎఐ) సిఒఇ సంజిత్ పాథి, బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) డైరెక్టర్ జనరల్ వినోద్ గిరి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజ్ కంపెనీస్ (సిఐఎబిసి) డైరెక్టర్ జనరల్ అనంత్ అయ్యర్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో పండుగ సీజన్ ముందు పేమెంట్ సంక్షోభం మరింత తీవ్రమవడంతో మద్యం కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో మద్యం, బీర్ సరఫరా ప్రభుత్వ ఆధీనంలోని హోల్‌సేల్ కార్పొరేషన్ ద్వారా జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చెల్లింపులను భారీగా ఆలస్యం చేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీపావళి, దసరా సందర్భంగా అక్టోబర్ 2025లో అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరగడంతో ప్రభుత్వానికి రెవెన్యూ ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. అయినా, సప్లయర్లకు చెల్లింపులు మాత్రం గత నాలుగు నెలల సగటుతో పోలిస్తే అక్టోబర్‌లో దాదాపు 50 శాతం తగ్గిందన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, చెల్లింపులు సాధారణ స్థితికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే పండుగ సమయాల్లో వినియోగదారులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. అక్టోబర్ 2025లో మూడు ప్రధాన పరిశ్రమ సంఘాల అధ్యక్షులు పలుమార్లు రాష్ట్రంలోని ఉన్నతాధికారులను, ప్రత్యేకంగా ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రిని కలిసి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లిచకపోవడంతో అక్టోబర్ నెలలో పరిస్థితి మరింత తీవ్రమైందన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

## 1992 మద్యం బాటిళ్ల పట్టివేత

ఢిల్లీ,గోవా, పాండిచ్చేరి నుంచి దిగుమతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోవా ఢిల్లీ పాండిచ్చేరి ప్రాంతాల నుంచి విమానాల్లో మద్యం తీసుకువచ్చి తెలంగాణలో అమ్మకాలకు ప్రయత్నం చేస్తున్న ఓ ముఠా గుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌టెంట్ టీం అధికారులు రట్టు చేశారు.ఈ క్రమంలోనే పహాడీషరీఫ్ వద్ద కార్లను తనిఖీ చేయగా ఢిల్లీ, గోవా, పాండిచ్చేరి నుంచి తెచ్చిన రూ. 5.76 లక్షల విలువ చేసే 1992 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎఇఎస్ జీవన్‌కిరణ్ తెలిపారు. హైదరాబాద్‌కు కొంత మంది యువకులు తక్కువ ధరలకు లభించే ఢిలీ, గోవా, పాండిచ్చేరిల నుంచి మద్యం బాటిళ్లను ఖరీదు చేసి విమానాల ద్వారా ఇక్కడికి చేరుకుంటున్నారు. ప్రతి సారి మాదిరిగానే శంషాబాద్ విమానాశ్రయంకు చేరుకున్న నిందితులు మద్యం బాటిళ్లను తమ తమ కార్లలో చేర్చుకుని పహడీషరీఫ్ మీదుగా నగరంలోకి ప్రవేశించే క్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ టీం పోలీసులకు దొరికిపోయారు. ఇలా పట్టుబడిన 20 మందికి ఎక్సైజ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్వాస్ ఖాసిం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈ మద్యం బాటిల్ ని పట్టుకున్నందుకు డైరెక్టర్ ఎంఫోర్స్మెంట్ అభినందించారు. ఆయనతో పాటు రంగారెడ్డి ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ కూడా అభినందించారు.

## కల్వకుర్తిలో దారుణం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిపై మారణాయుధాలతో దాడి

తీవ్రగాయాలు పరిస్థితి విషమం... ఆస్పత్రికి తరలింపు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటిలోని సంజాపూర్‌లో బుధవారం సాయంత్రం దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై మారణాయుధాలతో దాడిచేశారు. వివరాల్లోకి వెళితే... వెల్దండ మండలం చెరుకూర్‌కు చెందిన శిరీషకు కల్వకుర్తి మున్సిపాలిటిలోని సంజాపూర్‌కు చెందిన గుర్రం మల్లేష్‌తో గత రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నారు. మల్లేష్‌కు వివాహానికంటేముందు నుంచి సిలార్‌పల్లికి చెందిన యువతితో అక్రమ సంబంధం కొనసాగుతున్నది. ఈవిషయం ఇంట్లో తెలిసి పలుమార్లు పెద్దలసమక్షంలో ఇరువురికి నచ్చచెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయింది. గతమూడు నెలలక్రితం సిలార్‌పల్లికి చెందిన యువతిని తీసుకొని మల్లేష్ వెళ్లిపోయాడు. భార్య శిరీష తల్లిదండ్రులవద్ద ఉంటుంది. మూడునెలలైనా మల్లేష్ ఆచూకి దొరకకపోవడంతో మంగళవారం శిరీష కుటుంబసభ్యులు సంజాపూర్‌కు వచ్చి మల్లేష్‌తండ్రి జంగయ్య, తల్లి అలివేలు, తమ్ముడు పరమేష్‌లతో మాట్లాడారు. ఈక్రమంలో ఇరువర్గాలమధ్య మాటమాటపెరిగి శిరీష కుటుంబసభ్యులు ఆగ్రహించి మారణాయుధాలతో జంగయ్య, అలివేలు, పరమేష్‌లపై దాడికి పాల్పడ్డారు. దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ముగ్గురిని చికిత్సకోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో ముగ్గరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు తరలించారు. ఘటనస్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల్లో ముగ్గురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

## విద్యారంగ సమస్యలను విస్మరించిన ప్రభుత్వాలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ధర్నా




**ప్రజాపక్షం/భూపాలపల్లి:**రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విఫలమైందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని మంజూరు నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐ ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అవుతుందని, ఇప్పటివరకు విద్య రంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయింద ఆరోపించారు. ఇప్పటివరకు ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదని, ముఖ్యంగా రాష్ట్రంలో 9000 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని, పెండింగ్ బకాయలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దుర్మార్గమని అది సరి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యా శాఖ మంత్రిని ఏర్పాటు చేసి విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విద్య రంగ సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని కళాశాల హాస్టల్ భవనానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని, ఎస్సీ ఎస్టీ కళాశాలల బాయ్స్ హాస్టల్ కు సొంత భవనం లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే సొంత ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసి విద్య రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. లేనియెడల రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ ధర్నాకు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ తన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రవీణ్, పోతుల పవన్, రమాకాంత్, పవన్, శ్రీనివాస్, అజయ్, సురేష్, వంశీ, కృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.


## నేడు జాబ్‌మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కు ప్రైవేట్ రంగం భారత్ హ్యూండయ్ ప్రై.లిమిటెడ్ ఖమ్మం నందు సేల్స్ కన్సల్టేంట్స్ (మేల్) 22, సర్వీస్ అడ్వయిజర్ రెండు ఉద్యోగాలకు ఈనెల ఏ డున జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీ రాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఏడున శుక్రవారం ఉద యం 10 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ ఖమ్మం నందు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెంలలో పనిచేసేవిధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టులకు ఏదైనా డిగ్రీ, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల 22 నుంచి 30 వయస్సుల యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి వేతనం రూ. 18వేలు ఉంటుందని తెలిపారు.

ట్రంప్‌తో సంభాషణల విషయాన్ని

## మోదీ ఎందుకు ఒప్పుకోవడంలేదు?

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో తరచు ఫోన్‌లో మాట్లాడుతున్న విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎందుకు అంగీకరించడం లేదని కాంగ్రెస్‌పార్టీ నిలదీసింది. ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న విషయాన్ని అంగీకరించేందుకు మోదీ ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి,ఆ పార్టీ కమ్యూనికేషన్ల విభాగం ఇన్‌ఛార్జి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా ఆయన బుధవారం ఒక పోస్టింగ్ పెడుతూ, నరేంద్రమోదీతో డోనాల్డ్ ట్రంప్ తరచు ఫోన్‌లో మాట్లాడుతున్నారని వాషింగ్టన్ వర్గాలు చెబుతున్నాయని, కానీ మోదీ మాత్రం ఆ విషయాన్ని ఎందుకు ఒప్పుకోవడం దని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్ష కార్యాలయంతో ఆయనకున్న సంబంధాలను విమర్శించారు. అమెరికా విదేశీమంత్రిత్వశాఖ ఈ ఏడాది మే 10వ తేదీ సాయంత్రం 5.37 గంటలకు ప్రకటన చేసిన కారణంగానే ఆపరేషన్ సిందూర్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందా? అనే విషయాన్ని దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్, మోదీ ఇద్దరు పరస్పరం ఫోన్ సంభాషణలు చేసుకుంటున్నారని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కరోలిన్ లెవిట్ ఇప్పుడు చెప్పారని, ఈ విషయం గురించి భారత దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారన్నారు. “వారు నిజంగా ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలి, కానీ ప్రధానమంత్రి మోదీ ఎందుకు ఈ విషయాన్ని అంగీకరించడం లేదు? ట్రంప్‌తో ఫోన్ సంభాషణలు చేస్తున్న విషయాన్ని సమ్మతించకుండా ఎందుకు తిరస్కరిస్తున్నారు?” అని ప్రశ్నించారు. భారత్–అమెరికా భవిష్యత్ సంబంధాలు చాలా సానుకూలంగా, బలంగా ఉండాలని తాను కోరుకుంటున్నానని ట్రంప్ అన్నారని కరోలిన్ లెవిట్ చెప్పారు. “నేను అనుకోవడం ఆయన చాలా బలంగా, సానుకూల అభిప్రాయంతో ఉన్నారు, మీకు తెలుసుకదా, ఈ మధ్య దీపావళి సందర్భంగా వారిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నారు, శుభాకాంక్షలు చెప్పుకున్నారు, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో ఉన్నతస్థాయి వ్యక్తులు పాల్గొన్నారు” అని లెవిట్ మంగళవారం మీడియాతో ఒక సందర్భంగా అన్నారు. భారత్‌కు అమెరికా తరపున సెర్గీ గోర్ ఒక గొప్ప దౌత్యవేత్త అని కూడా ఆమె అన్నారు. ట్రంప్, ఆయన వాణిజ్యబృందం భారత్‌పట్ల గౌరవంతో చాలా తీవ్రంగా చర్చలు కొనసాగిస్తున్నది, ప్రధానమంత్రి మోదీ అంటే ట్రంప్‌కు చాలా చాలా గొప్ప గౌరవం ఉంది అని కూడా లెవిట్ చెప్పారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మణిపూర్‌లో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

**ఇంఫాల్ :** మణిపూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో భద్రతా సిబ్బందితో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు మరణించిన తర్వాత, సైన్యం ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని, ఆ ప్రాంతంలో నిషేధిత సంస్థ శిబిరాన్ని ధ్వంసం చేసిందని బుధవారం రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నిషేధిత యునైటెడ్ కుకి నేషనల్ ఆర్మీ (యుకెఎన్ఎ)కి చెందిన సాయుధ దళాల ఉనికి గురించి సమాచారం ఆధారంగా, మంగళవారం జిల్లాలోని హెంగ్లెప్ సబ్‌డివిజన్ పరిధిలోని ఖాన్పీ గ్రామంలో ఆపరేషన్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. స్పియర్ కార్ప్స్ సిబ్బంది చేసిన ఆపరేషన్‌లో ఎకె56, ఎంఎ4 ఎంకె II రైఫిల్, మందుగుండు సామగ్రి, యుద్ధ సామగ్రి నిల్వలు సహా నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారని ఆ ప్రకటన తెలిపింది. యుకెఎన్ఎ శిబిరం కూడా ధ్వంసమైంది, అదనపు ఆయుధాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆ ప్రకటన తెలిపింది.

# ఓటు చోరీతోనే బిహార్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వ ఏర్పాటు..

ప్రస్తుతం దేశంలో బ్రిటిష్ రాజ్‌ను పోలిన పరిస్థితి భవిష్యత్తులో ఎన్నికలు అనుమానమే : ప్రియాంకగాంధీ

**బెట్టియా :** బీహార్‌లో ఎన్‌డిఎ కూటమి ‘ఓటు చోరీ’ ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చూస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలు సహా 65 లక్షల మంది పేర్లను ఎస్ఐఆర్ ద్వారా ఓటర్ల జాబితా నుండి తొలగించారన్నారు. తమ 20 ఏళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారనే విషయం తెలిసినందున ఎన్‌డిఎ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని విమర్శించారు. బుధవారం పశ్చిమ చంపారన్ జిల్లాలోని వాల్మీకి నగర్, చాన్పాటియాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఆ సందర్భంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితి బ్రిటిష్ రాజ్‌ను పోలి ఉందని, భవిష్యత్తులో దేశం ఎన్నికలు జరుగుతాయో లేదో అనే అనుమానం కలుగుతుందన్నారు. తన సోదరుడు రాహుల్‌గాంధీ హర్యానాలో ‘ఓటు దొంగతనం’ గురించి వివరణ ఇచ్చారని ఆమె చెప్పారు. 2024లో ఉత్తర రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో కాంగ్రెస్ ఓటమి పాలైందని, ఒక క్ర మ పద్ధతిలో అవకతవకలు జరిగాయని రాహుల్ వ్యాఖ్యలు చేసినట్లు ప్రియాంకా పేర్కొన్నారు. ‘ఎన్‌డిఎ ప్రతిదీ నాశనం చేస్తుంది... భవిష్యత్తులో ఎన్నికలు జరుగుతాయో లేదో స్ప ష్టంగా లేదు... మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? వారిని అధికారం నుండి తరిమికొట్టండి’ అని ర్యాలీలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి



అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీపైనా తీవ్రంగా మండిపడ్డారు. నేరాలు, అవినీతిని నియంత్రించడం, యువతకు ఉపాధి కల్పించడం కంటే కాంగ్రెస్ పోస్టర్లలో ఆర్‌జెడి నాయకుడు, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ ఫోటో లేకపోవడం పట్ల ఆ యన ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తోందని ఆమె అన్నారు. అయితే, మోదీ స్వయంగా రాజకీయ ర్యాలీ ల వేదికలపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను తనతో పాటు తీసుకెళ్లలేదని ఆమె పేర్కొన్నారు. బీహార్ యువత కంటే రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ భవిష్యత్తు గురించి ఎన్‌డిఎ ఎక్కువ ఆందోళన చెందుతున్నట్లు కనిపిస్తుందని వాద్రా వ్యంగ్యంగా అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే బిహార్ ప్రజలు రూ. 25 లక్షల వరకు ఉచిత చికిత్స పొందుతారని చెప్పారు. ‘పేద కుటుంబానికి కనీసం ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి మేము మా వంతు ప్రయత్నం చేస్తాము... వివిధ విభాగాలలో లక్షలాది ఖాళీలను భర్తీ చేస్తాము’ అని ఆమె అన్నారు. మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అన్ని కర్మాగారాలు ఏర్పాటు చేయబడుతున్నాయని వాద్రా పేర్కొన్నారు. ఎన్‌డిఎ ఉద్దేశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలని, కార్పొరేట్‌లకు భూమి, వనరులను అప్పగించే వారు ఎప్పటికీ పేదల కోసం పనిచేయరన్నారు. మోదీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అంబానీ, అదానీ కోసం పనిచేస్తుందిదని, ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు తిరిగి వస్తుందని ఆమె ఆరోపించారు. పన్నులు, వ్యవసాయంలో అధిక ఇన్పుట్ ఖర్చు కారణంగా బిహార్ రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోలేకపోయారని ఆమె ఆరోపించారు. మోదీ సామ్రాజ్యంలో రైతులకు ఎంఎస్‌పి లభించదని, వారు తమ జీవితాంతం రుణాలు చెల్లించడంలోనే గడుపుతారని, అయితే కొంత మంది వ్యాపారవేత్తల అప్పులు మాఫీ చేయబడుతాయన్నారు. బిహార్‌లో అధిక నిరుద్యోగిత రేటు పని కోసం యువత రాష్ట్రం నుండి బయటకు వలస వెళ్లేలా చేస్తోందని ప్రియాంక అన్నారు. ఇండియా కూటమి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, ప్రతి పేద కుటుంబానికి ఇల్లు లేదా 3.5 దశాంశాల భూమిని అందిస్తుందని, ఆస్తుల రిజిస్ట్రేషన్ మహిళల పేర్లతో ఉంటుందని ఆమె అన్నారు. ఉపాధిహామీ కింద పని దినాల సంఖ్య రెట్టింపు అవితాయని, పాత పెన్షన్ పథకాన్ని తిరిగి ప్రవేశపెడతామని వాద్రా చెప్పారు. ‘ప్రజల సమస్యలను వినే సహన ప్రభుత్వం అవసరాన్ని నొక్కి చెబుతూ ఆమె తన దివంగత తండ్రి రాజీవ్ గాంధీతో కలిసి యుపిలోని అమేథి అసెంబ్లీ స్థానంలోని ఒక గ్రామానికి వెళ్ళినప్పుడు, ఒక మహిళ మాజీ ప్రధానిని కుళాయి నీటి కనెక్షన్ ఇవ్వనందుకు తిట్టినప్పుడు జరిగిన ఘటనను ఆమె గుర్తు చేసుకున్నారు. ఆయన ఆ విషయాన్ని ఓపికగా, మర్యాదగా పరిష్కరించారన్నారు.

# ఆర్మీని రాజకీయాల్లోకి లాగొద్దు

### రాహుల్ గాంధీకి రాజ్‌నాథ్ హితవు



**జముయ్/బంకా :** భారత సైన్యాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి లాగొద్దని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. సైనికులకు ఒకే మతం ఉందని, అదే సైన్య ధర్మమని అన్నారు. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా, సైనికులు ధైర్యం, శౌర్యం ప్రదర్శించి భారత్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని తెలిపారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భారత సైన్యం అగ్రవర్ణాల గుప్పిట్లో ఉందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ స్పందించారు. ‘దేశంలో రిజర్వేషన్ ఉండాలి. బిజెపి కూడా రిజర్వేషన్లకు మద్దతు ఇస్తుంది. పేదలకు రిజర్వేషన్లు ఇచ్చాం. కానీ మన సైనిక సైనికులకు ఒకే మతం ఉంది. ఆ మతం సైన్య ధర్మం. ఇది తప్ప వేరే మతం లేదు. మన సైన్యాన్ని రాజకీయాల్లోకి లాగకండి. కుల, మత రాజకీయాలు దేశానికి చాలా హాని కలిగించాయి. సమాజంలోని అన్ని వర్గాలను అండగా ఉండాలనేది మా ఆలోచన. కులం, తెగ లేదా మతం ఆధారంగా వివక్ష చూపడం మాకు ఇష్టం లేదు. మన దేశంలోని రుషులు, ప్రజలు కులమతాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు’ అని బిహార్‌లోని బంకాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సాయుధ దళాల్లో రిజర్వేషన్లు డిమాండ్ చేయడం ద్వారా దేశంలో అరాచకత్వాన్ని సృష్టించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. బిహార్ ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ ఇటీవల చెరువులో దూకి చేపలు పట్టడంపైనా రాజ్‌నాథ్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నాయకుడికి చెరువులోకి దూకడం తప్ప వేరే మార్గం లేదని ఎద్దేవా చేశారు. దేశాన్ని నడపడం పిల్లల ఆట కాదని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను తుదముట్టించామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కాస్త విరామం ఇచ్చామన్నారు.

### రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ :రాజ్‌నాథ్

ఇటీవలే బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత సైన్యం దేశ జనాభాలోని 10శాతం మంది నియంత్రణలో ఉందని ఆరోపించారు. దేశ జనాభాలో 90శాతం మంది దళితులు, మహాదళితులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు వంటి అట్టడుగు వర్గాలకు చెందినవారు ఉన్నప్పటికీ, వారు కార్పొరేట్, బ్యూరోక్రసీ, న్యాయవ్యవస్థ, ఇతర కీలక సంస్థలలో తక్కువ ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని బ్యాంకుల్లో ఉన్న డబ్బు అంతా 10 శాతం మంది ఖాతాల్లోకి వెళ్తుందన్నారు. అన్ని ఉద్యోగాలను వారే పొందుతున్నారన్నారు. బ్యూరోక్రసీ, న్యాయవ్యవస్థలో కూడా వారిదే ఆధిపత్యమని అన్నారు. సైన్యంపై కూడా వారి నియంత్రణలోనే ఉందన్నారు. ఈ క్రమంలో రాహుల్‌కు కౌంటర్ వేశారు రాజ్‌నాథ్ సింగ్. భద్రతా దళాల్లో రిజర్వేషన్లు డిమాండ చేస్తూ రాహుల్ గాంధీ అరాచకత్వాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

# భారీ ఎన్నికల మోసం బహిర్గతం

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జైరాం రమేశ్

**న్యూఢిల్లీ :** భారతదేశంలోనే అతిపెద్ద ఎన్నికల మోసాన్ని రాహుల్ గాంధీ బయటపెట్టారని కాంగ్రెస్ బుధవారం పేర్కొంది. ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలపై నిద్రలో ఉండే ఎన్నికల సంస్థ అకస్మాత్తుగా ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్లను తొలగించడంలో, నకిలీ ఓటర్లను జోడించడంలో చురుకుగా మారుతుందని విమర్శించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ బుధవారం ‘ఎక్స్’లో ఈ మేరకు పోస్టు పెట్టారు. ఓటర్ల జాబితా సవరణ వాస్తవానికి ‘ఓట్ల దొంగతనం’ అని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరం హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ‘దొంగిలించబడ్డాయి’ అని గాంధీ పేర్కొన్న తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ‘మోదీషా మోడల్ స్పష్టంగా ఉంది: ప్రజా మద్దతు రానప్పుడు ఓటరు జాబితా మార్చండి’ అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఇది ఓటర్ల జాబితా సవరణ కాదని, ఇది ఓట్ల దొంగతనమని తెలిపారు.

# బిహార్‌లో జెడి(యు)నాయకుడి ఇంట్లో మృతదేహాలు గుర్తింపు

### అన్నయ్య, అతని భార్య, కుమార్తె

**పూర్నియా (బీహార్) :** బిహార్‌లోని పూర్నియా జిల్లాలోని జెడి(యు) నాయకుడి నివాసంలో అన్నయ్య, అతని భార్య, కుమార్తె చనిపోయారని పోలీసులు బుధవారం తెలిపారు. కేహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూరోపియన్ కాలనీలోని వారి ఇంటి నుంచి మంగళవారం రాత్రి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. మరణించిన వారిని నవీన్ కుష్వాహా, అతని భార్య మాలా దేవి, కుమార్తె తను ప్రియగా గుర్తించినట్లు పూర్నియా సదర్ సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డిపిఒ) జ్యోతి శంకర్ తెలిపారు. నివాసితుల ప్రకారం, నవీన్ స్థానిక జెడి(యు) నాయకుడు నీరంజన్ కుష్వాహా అన్నయ్య అని ఆయన అన్నారు. ఇంట్లో మృతదేహాలు దొరికాయని సమాచారం అందిన వెంటనే, ఒక పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. మరణానికి ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి మృతదేహాలను పోస్ట్‌మార్టం పరీక్షలకు పంపారు అని ఎస్‌డిపిఒ తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలం నుండి ఆధారాలు సేకరిస్తున్నారని, దర్యాప్తు జరుగుతోందని ఆయన అన్నారు. నవీన్ కుష్వాహా ఈ ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందాడని, అతను గతంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశాడని స్థానికులు పేర్కొన్నారని మరొక అధికారి తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు కొందరు, తను ప్రియ తమ ఇంట్లోని మెట్ల మీద నుండి పడి మరణించినట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. తన కుమార్తెను రక్షించే ప్రయత్నంలో ఆమె తండ్రి మెట్లపై నుండి పడి మరణించాడని కూడా వారు అనుమానిస్తున్నారు. మరణ వార్త విన్న తర్వాత గుండెపోటుతో మరణించారని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. పోలీసులు కేసును అన్ని కోణాల నుండి దర్యాప్తు చేస్తున్నారని ఆయన అన్నారు.

# అమెరికాకు చైనా ఉపశమనం

**బీజింగ్:** అమెరికా వస్తువులపై అదనంగా విధించిన 24 శాతం సుంకాల రద్దు కా లాన్ని పొడిగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఏడాది పాటు మినహాయింపు ఇవ్వడంతో 10 శాతం సుంకాన్నే అమెరికా చెల్లించాల్సి ఉంటుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. అమెరికాచైనా అధ్యక్షుడు దక్షిణ కొరియా వేదికగా భేటీ అయిన క్రమంలో తాజా పరిణామానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఫెంటనైల్ పేరుతో చైనాపై 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే. మొత్తం విధించిన సుంకం 57శాతం నుంచి 47శాతానికి తగ్గింది. అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను పునరుద్ధరించేందుకు చైనా అంగీకరించింది. చైనా నుంచి అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఇబ్బంది ఉండదని ట్రంప్ వెల్లడించారు. ట్రంప్‌జిన్‌పింగ్ భేటీ క్రమంలో వాణిజ్య ఒప్పందం కుదరనున్నట్లు రెండు దేశాల అధికార వర్గాలు సంకేతాలిచ్చాయి.

### భారత్‌కు సహాయం...

ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్న నేపథ్యంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా సిద్ధంగా ఉందని భారత్‌లోని చైనా దౌత్యకార్యాలయం అధికారి యూజింగ్ వెల్లడించారు. ఒకప్పుడు చైనా కూడా ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడిందని, తమ అనుభవాలను భారత్‌తో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ సమస్య నుంచి బయట పడగలదని ఆకాంక్షించారు. గతంలో చైనా రాజధాని బీజింగ్‌తో పాటు అనేక నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించింది. గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి చైనా ప్రభుత్వం నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో గాలి నాణ్యత మెరుగైంది. స్వచ్ఛత చేకూరింది. భారత్‌లోనూ వాయు కాలుష్య నియంత్రణకు చైనా తరహా కఠిన చర్యలు అనుసరణీయమన్న అభిప్రాయం నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. చైనాను ఆదర్శకంగా తీసుకొని దేశ పరిస్థితులకు, సవాళ్లకు అనుగుణమైన విధానాన్ని అమలు చేయాలన్న సూచనలు అందుతున్నాయి.

# రేపు నిసార్ పని ప్రారంభం: ఇస్రో

**బెంగళూరు:** ఇస్రో మరో కీలక కార్యక్రమాన్ని ప్రకటించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసాతో కలిసి అభివృద్ధి చేసిన నిసార్ ఉపగ్రహం శుక్రవారం నుంచి పని ప్రారంభిస్తున్నట్లు భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ నారాయణన్ వెల్లడించారు. నాసాఇస్రో సింథటిక్ అపెర్చర్ రేడార్ (నిసార్) అత్యంత ఖరీదైన భూ పరిశీలన ఉపగ్రహం. భూమిపై మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండు సార్లు పర్యవేక్షించే సామర్థ్యం దీని సొంతం. మొత్తం 2,400 కేజీల నిసార్ ఉపగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా జులై 30న ఇస్రో ప్రయోగించింది. డేటా సమీకరణ పూర్తి కావడంతో ఈనెల 7న నిసార్ శాటిలైట్ ఆపరేషనల్ కాబోతోందని ప్రకటించనున్నట్లు నారాయణన్ వెల్లడించారు. ఆయన బుధవారం ఎమర్జింగ్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఈఎస్‌టీఐసీ)లో ఈ వివరాలు తెలిపారు. రెండు సార్ వ్యవస్థలు... ఎల్ బ్యాండ్‌ఎస్ బ్యాండ్ సెన్సార్లను మోసుకెళ్లిన తొలి మిషన్ నిసార్ అని అన్నారు. ఎల్ బ్యాండ్ రేడార్ అడవి నేలల్లో తేమను గుర్తించగలదు. జీవరాశులు, భూమిమంచు ఉపరితలాల కదలికలను కొలవగలదు. ఎస్ బ్యాండ్ రేడార్ కొన్ని రకాల





వ్యవసాయం, గడ్డి భూముల పర్యావరణ వ్యవస్థలు, మంచులోని తేమను గమనించగలదు. ఈ రెండు వ్యవస్థలు మేఘాలు, హిమపాతం ఆధారంగా డేటాను సేకరించగలవు. నిసార్ అందించే డేటా అసాధారణమైందని, ఈ ఉపగ్రహంతో చాలా ఉపయోగాలు ఉన్నాయని నారాయణన్ తెలిపారు. అలాగే, గగన్‌యాన్ మిషన్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో దీనిని ప్రయోగిస్తామన్నారు. 2027లో దేశీయంగా తయారు చేసిన రాకెట్‌లో వ్యోమగాములను పంపే లక్ష్యంతో ఈ మిషన్ కోసం 8వేలకుపైగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. భూమి చుట్టూ తిరగడం కోసం వ్యోమగాములను పంపడానికి ముందు మూడు మానవరహిత మిషన్లను ఇస్రో చేపడుతుందని నారాయణన్ అన్నారు. 2028 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం మొదటి మాడ్యూల్ ప్రయోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 2035 నాటికి ఫై మాడ్యూల్ ఆర్బిటల్ ల్యాబ్ పనులు పూర్తి చేస్తామని నారాయణన్ చెప్పారు.

# షట్‌డౌన్ కారణం : ట్రంప్ వ్యాఖ్య

**వాషింగ్టన్:** బుధవారం జరిగిన కీలకమైన ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ పరాజయం పొందడానికి అమెరికాలో 36 రోజులుగా కొనసాగుతున్న షట్‌డౌన్ కారణమని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. ట్రంప్ ఎన్నికల్లో పాల్గొనకపోవడం ఒక కారణమైతే, షట్‌డౌన్ సమస్య కూడా రిపబ్లికన్ల ఓటమికి రెండో కారణమని ఎన్నికల విశ్లేషకులు వ్యాఖ్యానించారు. ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే ట్రంప్ తన ట్రూత్ సోషల్ వేదికగా స్పందిస్తూ విశ్లేషకుల వ్యాఖ్యలను పోస్టు చేశారు. పార్టీలో కొందరు మాత్రం అభ్యర్థుల ఎంపికలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని విమర్శించగా, మరికొందరు రిపబ్లికన్లు దేశంలో పెరుగుతున్న జీవన వ్యయాలను, ధరలను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాలిఫోర్నియాలో భారీ స్కామ్ జరిగింది, ఓటింగ్ ప్రక్రియలో రిగ్గింగ్ జరిగింది అని ట్రంప్ ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ‘‘మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్’’ అనే నినాదంతో అన్ని దేశాలపై విపరీతంగా సుంకాలు పెంచడంతో పాటు స్వదేశంలో ఉద్యోగాల్లో కోతలు విధించడం, ప్రాణాంతకమైన వలస విధానాన్ని ముందుకు తీసుకురావడంద్వారా దేశాన్ని అతలాకుతలం చేయడం, పొరుగున కెనడాతోపాటు బ్రెజిల్‌తో సంబంధాల విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం, డాడ్జ విధానం తీసుకురావడం, అంతర్జాతీయ ఫండ్స్‌లో కోత పెట్టడం, ట్రంప్ విధానాలవల్ల జీవన వ్యయాలు పెరిగిపోవడం, సరుకుల ధరలు పెరుగుదలతోసహా అనేక విషయాల్లో తరచు ఆయన అనేక కోర్టు కేసులు ఎదుర్కోవడం, రాష్ట్రాలలో ఫెడరల్ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేసి వ్యతిరేకత తెచ్చుకోవడం ట్రంప్‌కు మైనస్‌లుగా మారాయి. ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది.

### 36వ రోజుకు చేరిన షట్‌డౌన్

అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా షట్‌డౌన్ బుధవారంనాటికి 36వ రోజుకు చేరుకుంది. 2019లో ఫడింగ్‌కు సంబంధించిన బిల్లుల ఆమోదంలో వైఫల్యంవల్ల 35 రోజులు షట్‌డౌన్ అమలుకాగా ఇప్పుడు తాజా షట్‌డౌన్ ఆ రికార్డును అధిగమించింది. మంగళవారం రాత్రి కూడా సెనేట్ వరుసగా 14వ సారి ఫండింగ్ బిల్లులను ఆమోదించడంలో విఫలమైంది. 54—44 ఓట్లతో బిల్లు వీగిపోయింది. దీంతో చరిత్రలో ఇప్పటివరకూ జరిగిన షట్‌డౌన్ రికార్డులన్నింటినీ ప్రస్తుత షట్‌డౌన్ కాల పరిమితి అధిగమించింది. ఈ ఎన్నికల తర్వాత సమస్య పరిష్కారం కాగలదని కొందరు రిపబ్లికన్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

# హాస్టల్ టాయిలెట్‌లో కెమెరాలు

### రెండువేల మంది మహిళల ఆందోళన

**బెంగళూరు:** మహిళల వసతి గృహం టాయిలెట్‌లో రహస్య కెమెరాలు అమర్చిన ఘటన కలకలం సృష్టించింది. మంగళవారం రాత్రి ఒక టాయిలెట్‌లో వాటిని గుర్తించిన మహిళలు ఆందోళనకు దిగారు. తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. ఈ ప్రాంతం కర్నాటకకు సమీపంలో ఉంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఒక ప్రముఖ సంస్థ తమ ఉద్యోగుల కోసం వసతి గృహాన్ని నిర్వహిస్తోంది. అక్కడే ఉంటున్న ఒడిశాకు చెందిన ఒక మహిళా ఉద్యోగి ఈ కెమెరాలు అమర్చింది. రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తోంది. ఆ హాస్టల్‌లోనే ఉంటున్న మరో మహిళకు ఆమె కదలికలపై అనుమానం వచ్చింది. తన అనుమానాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. వారు వెతకడంతో ఈ కెమెరాల గుట్టు బయటపడింది. ఈ విషయం బయటికి పొక్కడంతో తీవ్ర కలకలం రేగింది. అక్కడ వసతి పొందుతున్న సుమారు రెండువేల మంది మహిళలు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు.

# కార్గో విమానం కూలి ముగ్గురు దుర్మరణం

**వాషింగ్టన్:** అమెరికాలోని లూయిస్‌విల్లేలో విమాన ప్రమాదం జరిగింది. మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ11 రకానికి చెందిన యూపీఎస్ కార్గో విమానం టేకాఫ్ అవుతుండగానే కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. యూపీఎస్ ఫ్లైట్ నంబర్ 2976 విమానం హోనులులుకు సాయంత్రం 5.15 గంటలకు (అమెరికా కాలమానం) బయల్దేరింది. నిమిషాల వ్యవధిలోనే ప్రమాదానికి గురైంది. దీనిని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ధ్రువీకరించింది. ఒ క్కసారిగా మంటలు రావడంతో విమానం కూలిపోయింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమంలో వైరయ్యాయి.

# ఎన్నికల వేళ బిహార్‌లో ‘స్టింగ్’ కలకలం

### ఇది బిజెపి నేతల నిజరూపం: ఆర్‌జెడి

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైన తరుణంలో ఓ స్టింగ్ ఆపరేషన్ సంచలనంగా మారింది. హిందీ వార్తా సంస్థ ఈ వివరాలు వెల్లడించింది. బిహార్ దుష్ట రాజకీయ నేతల నిజ స్వరూపానికి వార్తానివేదిక అద్దంపట్టింది. నాయకుల కోసం అమ్మాయిల సరఫరా గురించి బిజెపి మహిళా నేత సంభాషణకు సంబంధించిన వీడియోను ఎక్స్ మాధ్యమంగా ఆర్‌జెడి జాతీయ అధికార ప్రతినిధి కాంచన యాదవ్ పంచుకున్నారు. వార్తా నివేదిక బయట పెట్టినది కనీసం రాయలేకపోతున్నా అంటూ పోస్టు పెట్టారు. ‘బిజెపి నాయకుల ఎత్తులుజిత్తులు, వారి వ్యక్తిత్వం, నిజ రూపం బహిర్గతమైంది. మహిళలంటే వారికి ఎంత గౌరవమో ఈ వీడియో క్లిప్‌తో స్పష్టమవుతున్నది’ అంటూ ఆమె విమర్శలు గుప్పించారు. ‘నాయకుల ఇష్టాయిష్టాలు నాకు తెలుసు. వాళ్లకు అందమైన అమ్మాయిలు కావాలి. కొందరికి ఒకరు, మరికొందరికి ఇద్దరు అవసరం. కొన్నిసార్లు ఇద్దరు నాయకులు ఒకే అమ్మాయిని కోరుకుంటారు. ఇంకొందరు డబ్బు చెల్లిస్తారు కానీ శృంగారంలో పాల్గొనరు. అందుకోసమే ఎవరికి ఎలాంటి అమ్మాయి ఇష్టమో గమనంలో ఉంచుకొని సరఫరా చేస్తాం. మీరు అభ్యర్థులను ఏర్పాటు చేయండి. హైప్రొఫైల్ అమ్మాయిలను పంపడం మా బాధ్యత. బీహార్ ఎన్నికల కోసం అధిష్ఠానం పెద్ద బాధ్యతే అప్పగించింది. దీంతో పని సులభమవుతుంది. మాకు అన్ని చోట్ల పలుకుబడి ఉంది. అన్ని పార్టీల్లో మనవాళ్లు ఉన్నారు. నా వైపు నుంచి మీకు పూర్తి హామీ ఉంటుంది. మనల్ని ప్రశ్నించేవారెవరూ ఉండరు. పార్టీ ఎమ్మెల్యేలకూ దీని గురించి తెలుసు. ప్రశ్నించే ధైర్యం ఎవరికి లేదు. నేనేమీ సామాన్య నేతను కాదు. నాకు చాలా మంది బడా నాయకులతో పరిచయం ఉంది’ అంటూ ఆ వీడియోలో మహిళా నేత సంభాషణ సాగింది. ఆమెను బిజెపి నాయకురాలు ఫూల్ జోషిగా గుర్తించారు. ఆమె జార్ఖండ్‌లోని పార్టీ ఎస్‌సీ మోర్చా మంత్రి. అధిష్ఠానం ఆదేశాలతో బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ‘జై బిజెపి, విజయ్ బిజెపి’ పేరిట ప్రచారం చేస్తున్నారు.

# కాలుష్య నియంత్రణకు సాయం చేస్తాం

### భారత్‌కు చైనా హామీ



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలు ష్య కోరల్లో చిక్కుకున్నాయి. రెండు వారాలుగా గాలి నాణ్యత బాగా క్షీణించిం ది. అనేక ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) గణాంకాలు వెల్లడించాయి. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకువచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ‘చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాం టి సమస్యను ఎదుర్కొంటున్నవారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సి ద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం’ అని యూజింగ్ పేర్కొన్నారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా... గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. గతంలో చైనాలో కూడా రాజధాని బీజింగ్‌తో పాటు ప లు నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం ప్రపంచ రికార్డులు సృష్టించిం ది. ప్రభుత్వం వెంటనే మేల్కొని గట్టి నియంత్రణ చర్యలు తీసుకోవడంతో చై నా మహానగరాల్లో కాలుష్య మేఘాలు చెదిరిపోయాయి. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘి స్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది. ఇండియా కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయి లో కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

# వారంలో 50 మంది మృత్యువాత

### దేశంలో వరుస ఘోర విషాదాలు

**న్యూఢిల్లీ:** గతవారం భారతదేశం అనేక పెద్ద ప్రమాదాలను, ఘోర విషాదాలను చవిచూసింది. దేశవ్యాప్తంగా ఈ వారం రోజుల్లో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఘోర ప్రమాదాలు ఎంతో మంది ప్రాణాలను బలిగొన్నాయి. రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, దేవాలయాల్లో తొక్కిసలాటలు ఈ ప్రమాదాలకు కారణాలుగా నిలిచాయి. నవంబర్ 1వ తేదీన కార్తీక మాస ఏకాదశి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఏకాదశికి తోడు శనివారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆ రోజు ఆలయానికి రెండు వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తే... ఏకంగా 15 వేల మందికి పైగా వచ్చారు. ఆ తొక్కిసలాటలో 9 మంది మరణించగా, 25 మందికి పైగా గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో అక్టోబర్ 24న జరిగిన స్లీపర్ బస్సు ప్రమాదంలో 19 మంది మరణించారు. నవంబర్ 3వ తేదీన రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం దేశం మొత్తాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. 72 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ సమీపంలో మంగళవారం (నవంబర్ 4) సాయంత్రం ఘోర రైలు ప్రమాదం జరిగింది. గెవ్రా రోడ్ నుంచి బిలాస్‌పూర్ వైపు వస్తున్న లోకల్ రైలు, గూడ్స్ రైలును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 11 మంది మరణించారు. 20 మందికి పైగా గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్ చునార్ జంక్షన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం (నవంబర్ 5) నదీ స్నానానికి వెళ్లేందు కు రైలు దిగిన కొందరు భక్తులు స్టేషన్ నుంచి బయటకు వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మతిచెందగా... పలువురికి గాయాలయ్యాయి. నవంబర్ 3న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అదుపుతప్పిన టిప్పర్ 3040 వాహనాలను బలంగా ఢీకొట్టింది.

ప్రజాపక్షం
గురువారం, 06 నవంబరు

## వైట్‌హౌస్ ఒత్తిళ్లకు తలవంచిన భారత్!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సందర్భాల్లో చేసిన.. చేస్తున్న వ్యాఖ్యలు నిజమే. కాదని కేంద్రం ఎంతగా బుకాయిస్తున్నప్పటికీ, వాస్తవాలు ఒక్కొక్కటిగా బయటపడుతూనే ఉన్నాయి. భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధం తన వల్లే నిలిచిపోయిందని ట్రంప్ పదేపదే ప్రకటిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందనేది ఇప్పుడు బయటపడుతున్నది. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గిన తీరును చూస్తే మోదీ సర్కార్ నేడు అమెరికా ఒత్తిళ్లకు తలవంచింది. వాషింగ్టన్ కొత్త ఆంక్షలు ఈనెల 21 నుంచి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో, రష్యా నుంచి దిగుమతులను ఈనెలాఖరు నుంచి తగ్గించుకోనుంది. కొత్త ఆంక్షలను గౌరవిస్తూ, రష్యా నుంచి నేరుగా కొనుగోళ్లను నిలిపివేయాలన్నది భారత రిఫైనరీల నిర్ణయం. దేశంలోకి దిగుమతి అవుతున్న చమురులో దాదాపు సగభాగం రష్యా నుంచే వస్తున్నది. అమెరికా అడ్డగోలుగా ఆంక్షలు విధించినప్పుడు, రష్యాయే భారత్‌కు అండగా నిలిచింది. చమురు ఉత్పత్తులను తక్కువ ధరకే సరఫరా చేసింది. ఆదుకుంది. కానీ, భారత్ మాత్రం స్నేహధర్మాన్ని పాటించడం లేదు. అగ్రరాజ్యం బెదిరింపులకు దీటైన సమాధానం ఇవ్వలేదు. అమెరికా ఆంక్షలు రష్యా ప్రభుత్వ చమురు కంపెనీలు రోస్నెఫ్ట్, లుకాయిల్‌పై ప్రభావం చూపిస్తాయన్న పేరుతో, 'కొనుగోళ్ల క్రమబద్ధీకరణ' పాచిక విసిరింది. భవిష్యత్తులో రష్యా చమురు దిగుమతులను నిలిపివేయనున్నట్లు మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్, హెచ్‌పిసిఎల్, మిత్తల్ ఎనర్జీ లిమిటెడ్ వంటి సంస్థలతో ప్రకటనలు చేయించింది! కేంద్రానికి తెలియకుండా, అనుమతి తీసుకోకుండా ఇంతటి కీలక నిర్ణయాలు వెలువడవు. రోస్నెఫ్ట్‌తో దీర్ఘకాల ఒప్పందం ఉన్నప్పటికీ, రష్యా చమురు కొనుగోళ్లను రిలయన్స్ ఎందుకు నిలిపివేస్తున్నదనేది బహిరంగ రహస్యం. అక్టోబర్ నెలలోనూ భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురు సరఫరాలో అగ్రభాగం, సగటున రోజుకు 1.6 నుంచి 1.8 మిలియన్ బ్యారెల్స్ చమురు రష్యా నుంచే వచ్చింది. రష్యా చమురుపై అమెరికా కొత్త ఆంక్షలు ప్రకటించిన తర్వాత దిగుమతులు తగ్గుతున్నాయి. ఈ నెలాఖరుకు 'తగ్గుదల' కనీస స్థాయికి పతనం కావడం ఖాయంగా కనిపిస్తున్నది. నిజానికి, ఎన్నో రంగాల్లో భారత్‌కు రష్యా సాయం చేస్తున్నది. అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలిచింది. పైగా రెండు దేశాల మధ్య దశాబ్దాలుగా వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఇప్పుడు అవి ప్రమాదంలో పడ్డాయి. భారత్ ఎవరికీ తలవంచదని, రష్యా నుంచి చమురు దిగుమతులపై తమను ఎవరూ శాసించలేరని ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా ప్రకటించి రెండు వారాలు కూడా కాలేదు... భజనపరులు కేంద్ర సర్కారు ఘనతను కీర్తించడం ఇంకా మానలేదు... చమురు కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం కొత్త పల్లవి ఎత్తుకుంది. రష్యాపై అమెరికా విధించిన ఆంక్షలు ఇంకా అమల్లోకి రాకముందే, రంగులు మార్చేసింది. రష్యా నుంచి చమురును పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాదు. అవసరమైతే, మరోసారి రష్యాను మధ్యవర్తిగా తీసుకోవాలని విలువగా నామమాత్రపు దిగుమతులను కొనసాగిస్తుంది. ప్రత్యక్ష కొనుగోళ్లు తగ్గినా, మధ్యవర్తుల ద్వారా రష్యా చమురు భారత్ చేరుతుందనే వాదన బలంగా సిగ్గుచేటు. ఈ లావాదేవీలు మధ్యవర్తులకు లాభాల పంట పండిస్తాయి. దేశం అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది. ఆ ప్రభావం అధిక ధరల రూపంలో ప్రజలపై పడుతుంది. ఎవరు ఏటు పోతేనేం...అమెరికా మాట వేదవాక్యం. రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకుంటామని భారత్ హామీ ఇచ్చినట్టు ట్రంప్ ప్రకటించారు. భారత్ ఆచరించింది. అమెరికా నుంచి దిగుమతులు ఇప్పటికే భారీగా పెరిగాయి. క్రమంగా భారత చమురు మార్కెట్‌ను అమెరికా ఆక్రమిస్తుంది, శాసిస్తుంది. వాస్తవానికి, అన్ని ప్రధాన దేశాలతో మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్య లావాదేవీలు అత్యవసరం. ఇదే, చిరకాలంగా భారత్ అనుసరిస్తున్న విధానం. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం నేరుగా కొమ్ముకాయడం మొదలైన తర్వాత పరిస్థితులు మారాయి. ప్రభుత్వ నిర్ణయాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అమెరికా పెత్తనం పెరిగింది. టారిఫ్‌ల నుంచి వీసాలవరకూ, అన్ని రకాలుగా వేధింపులు ఎదురవుతున్నా, అడిగే ధైర్యం లేదు. టారిఫ్‌పై చర్చలు ఎటూ తేలవు. ఏ రకంగా చూసినా, రష్యాతో మైత్రికి చరమగీతాలు. అంతిమంగా మోదీ విధానాలు. రష్యా నుంచి చమురు కొనాల్సిందేనన్న నిబంధన ఏమీ లేదు. తప్పనిసరి కానేకాదు. అయితే, హఠాత్తుగా నిర్ణయాలు మార్చుకోవడం వల్లే అనుమానాలు. ఇది కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఎక్కడ చౌకగా లభిస్తే అక్కడ కొనుక్కోవటం వ్యాపార లక్షణం. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి నిర్ణయాలు తీసుకుంటే దేశ ప్రజలపై భారం మోపటం క్షమించరానిది. ఎక్కడ చౌకగా లభిస్తే అక్కడ కొనుక్కోవటం వ్యాపార లక్షణం. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి నిర్ణయాలు తీసుకుంటు దేశ ప్రజలపై భారం మోపటం క్షమించరానిది. ట్రంప్ చేసిన ప్రతి ప్రకటనా నిజమేనని రుజువయ్యే విధానాలు ప్రమాదకరం. దేశ సార్వభౌమత్వానికి విఘాతం. భారత ఆత్మగౌరవానికి శరాఘాతం.

# తెలంగాణ ప్రాంతానికి వరప్రదాయని ఆయిల్ పామ్

మొక్కలు నాటిన మూడు సంవత్సరాల తర్వాత గెలల కోత, 30 సంవత్సరాల వరకు దిగుబడి స్థిర ఆదాయం.

ప్రపంచంలోనే అత్యధిక దిగుబడినిచ్చే పంటలలో ఒకటి ఆయిల్ పామ్. ప్రపంచవ్యాప్తంగా వంటనూనెల వినియోగంలో 33 శాతం ఆయిల్ పామ్ ఉపయోగిస్తే, భారతదేశంలో 60 శాతంగా ఉంది. అందుకే ప్రతి సంవత్సరం ఇండోనేషియా, మలేషియా నుండి సుమారు పది మిలియన్ మెట్రిక్ టన్నుల దాకా ముడి పామాయిల్ ను విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించి దిగుమతి చేసుకుంటున్నది. ముడి చమురు తర్వాత ఇది రెండవ అత్యధిక దిగుమతి.

ఆయిల్ పామ్ సగటు ఉత్పాదకత మిగతా నూనె పంటల కంటే ఎక్కువగా ఉండడం వలన మార్కెట్లో పామ్ ఆయిల్ తక్కువ ధరకు లభించటమే కాకుండా పోషక విలువలలో కూడా మిగతా నూనెల కంటే ఏ మాత్రం తీసిపోదు. దేశం మొత్తం పామాయిల్ వినియోగంలో 72 శాతం వరకు ఆహార సంబంధిత పరిశ్రమలలో వినియోగిస్తుండగా మిగిలిన 28 శాతాన్ని సౌందర్య ఉత్పత్తులు, ఔషధాల, జీవ ఇంధనం తయారీలో వాడుతున్నారు. నూనె గింజల పంటలలో కెల్లా ఆయిల్ పామ్ ఎక్కువ దిగుబడినిస్తుంది.



సాధారణంగా వరి సాగుకు నీటి ఆవశ్యకత ఎక్కువ కానీ ఒక ఎకరా వరి సాగుకు అవసరమైన నీటితో మూడు ఎకరాల దాకా ఆయిల్ పామ్ సాగు చేయవచ్చు. పైగా ఇది పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. వరికి ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ సాగు చేస్తే విద్యుత్ ఖర్చుపై కూడా ఆదా చేయవచ్చు. అంతేకాకుండా ఇతర పంటలతో పోల్చినప్పుడు ఆయిల్ పామ్ పంట యాజమాన్యం కూడా చాలా సులభతరంగా ఉండడమే కాకుండా ఖర్చు కూడా చాలా తక్కువ.

ఇతర పంటల మాదిరిగా కాకుండా ఒకసారి ఆయిల్ పామ్ సాగు చేస్తే 25 నుండి 30 సంవత్సరాలు , సంవత్సరానికి ఎకరాకు 1,20,000 రూపాయల దాకా ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ తోటలలో తొలి మూడు సంవత్సరాలు అంతర్ పంటలు సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఈ పంట ఆయిల్ పామ్ యాక్ట్ 1993 పరిధిలోకి వస్తుంది. రైతులకు మార్కెటింగ్ ఇబ్బందులు కూడా తలెత్తవు. ఆయిల్ పామ్ చట్టం పరిధికి లోబడి కేటాయించబడిన కంపెనీలు గెలలు కొనుగోలు చేస్తాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కంపెనీలు గెలలు కొనుగోలు చేస్తాయి. అంతేకాకుండా 15 రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాకు జమ చేసే సదుపాయం ఒక్క ఆయిల్ పామ్ పంటకు మాత్రమే ఉంది.

ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం భారతదేశంలో ఆయిల్ పామ్ సాగు అవకాశాలు అధ్యయనం చేయడానికి 1986 లో డాక్టర్ చద్దా ఆధ్వర్యంలో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 11 రాష్ట్రాలలో 14.375 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా గుర్తిస్తూ 1988 లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా చాలా రాష్ట్రాలలో ఆయిల్ పామ్ ను నీటి వసతి కింద సాగు చేయడం మొదలైంది. ఆ తర్వాత కాలంలో ఆయిల్ పామ్ సాగుపై రాష్ట్ర ప్రభుత్వాలు చూపించిన చొరవతో, కేంద్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు, నిపుణుల కమిటీతో కూడిన వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు. 2012 వరకు ఈ కమిటీలు భారత దేశంలోని 19 రాష్ట్రాలలో 48.325 లక్షల ఎకరాలు నీటి వసతి కింద ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా గుర్తించారు. ఇందులో తెలంగాణ ప్రాంతానికి చెందిన పూర్వపు ఖమ్మం, నల్లగొండ జిల్లాలు కూడా ఉన్నాయి. జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ వారి విజన్ 2050 నివేదికను బట్టి చూస్తే 2050 నాటికి మన దేశ జనాభాకు అవసరమైన వంటనూనెలో 45 శాతం పామాయిల్ వాటా ఉంటుందని అంచనా. దేశం పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే అదనంగా సుమారు 70 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగు చేయవలసి ఉంటుందన్నది అధికారుల అంచనా. దేశంలో ప్రస్తుతం ఆయిల్ పామ్ 13.24 లక్షల ఎకరాలలో సాగులో ఉంది. పామాయిల్ దిగుమతులను పూర్తిగా తగ్గించుకొని ఇప్పుడు వెచ్చిస్తున్న విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలంటే ఆయిల్ పామ్ సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారులు, శాస్త్రవేత్తలతో కూడిన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ 2019 నవంబర్ నెల 28 నుండి 30 తేదీలలో రాష్ట్రంలో పర్యటించి ఆయిల్ పామ్ సాగు అవకాశాలపై ఒక నివేదిక ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం వారు తెలంగాణ రాష్ట్రంలో 10.90 లక్షల ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు అనువైనదిగా గుర్తించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు ఈ ఆయిల్ పామ్ సాగుకు అనువైనవిగా అనుమతించారు. దీనికి అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాలలో ఆయిల్ పామ్ చేపట్టేందుకు, సాగు విస్తరణ చేపట్టేందుకు 14 కంపెనీలకు అనుమతులు ఇచ్చారు. (మేడ్చల్ ,మల్కాజ్‌గిరి, హైదరాబాదు మినహాయించి).

వంట నూనెల ఉత్పత్తిని పెంచి దిగుమతులను తగ్గించడానికి భారత ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. ఈ దిశగా 2021 నుండి ఎన్ఎంఈఓపి పథకం ప్రారంభించారు. ఈ పథకం కింద ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, అంతర్ పంటల సాగు, బిందు సేద్య పరికరాల ఏర్పాటు కోసం మొదటి నాలుగు సంవత్సరాల కాలంలో ఒక ఎకరాకు మొత్తం 50 వేల 918 రూపాయల రాయితీ ఇస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 2.73 లక్షల ఎకరాలలో 65,337 మంది రైతులు సాగు చేస్తున్నారు. 2021–22 సంవత్సరంలో సాగులోకి తెచ్చిన ఆయిల్ పామ్ తోటలు కాపుకి వచ్చాయి. ప్రస్తుతం 65,500 ఎకరాల నుండి గెలల ఉత్పత్తి జరుగుతుంది. రాష్ట్రంలో నూనె ఉత్పత్తి శాతం (ఓఈఆర్) 19.42 శాతం, ఇది దేశంలోనే అత్యధికం. ముడి పామాయిల్ ఉత్పత్తి సుమారు 60వేల టన్నులు ఉంటుందని అంచనా. ఆయిల్ పామ్ గెలల ధర ప్రస్తుతం మెట్రిక్ టన్ కి 19,400 రూపాయలు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ వారిచే స్థాపించబడిన రెండు ప్రాసెసింగ్ మిల్లులు నిర్వహణలో ఉన్నాయి. వీటి మొత్తం సామర్థ్యం గంటకి 120 మెట్రిక్ టన్నులు. ఆయిల్ ఫెడ్ చే సిద్దిపేట జిల్లాలో 300 కోట్ల అంచనా వ్యయంతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మించారు. ఈ మిల్లు త్వరలోనే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ మిల్లులో గెలల క్రషింగ్ ద్వారా వచ్చే ముడి పామాయిల్ ను శుద్ధి చేసే ఏర్పాటు కూడా చేశారు. ఇలాంటి ఏర్పాటులో రాష్ట్రంలో ఇదే మొదటిది. మిల్లు ఏర్పాటు వలన ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా 2000 మందికి ఉపాధి కలిగే అవకాశం ఉంది. ఇంతే కాకుండా ఇతర ప్రైవేట్ కంనెనీలకు కేటాయించిన జిల్లాలలో మరొక ఆరు మిల్లులు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి 2026 సంవత్సరం నాటికి అందుబాటులోకి వస్తాయి.

**ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకం :**

ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని, ఒకసారి మొక్కలు నాటితే మూడవ సంవత్సరం నుండి 30 సంవత్సరాల దాకా పంట దిగుబడి తీసుకోవచ్చని రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ ఎకరాలలో సాగు చేయగలిగే లాభదాయకమైన పంట ఈ ఆయిల్ పామ్ అని ఆమె వివరించారు. ఆయిల్ పామ్ మొక్కలకు, డ్రిప్ సౌకర్యానికి, అంతర్ పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని దీర్ఘకాలం రైతులు లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ భాష కోరారు.

**జి.మధుగౌడ్,** ప్రజాపక్షం ప్రతినిధి

### ఆయిల్ పామ్ రైతు పి.అనంతరావు విజయగాథ

జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన రైతు పి.అనంతరావు చాలా సంవత్సరాలు మిర్చి, పత్తి సాగు చేశారు. ఈ పంటలకు కూలీల వ్యయం, తరచూ చీడపీడల బారిన పడి క్రిమిసంహారక మందులకు ఎక్కువ డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది. పంట సమయంలో అకాల వర్షాలు అతని పంట నష్టాన్ని పెంచేవి. మిర్చి, పత్తి సాగు ద్వారా ఆయన ప్రతి సీజన్లో 10,000 నుండి 20 వేల మధ్య నికర ఆదాయాన్ని సంపాదించేవారు.

పంట మార్పిడి చేద్దామని స్థిరమైన ఆదాయం కోసం అనంతరావు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపారు. 2021–22 సంవత్సరంలో 36 ఎకరాల భూమిలో ఆయిల్ పామ్‌ను మొదలు పెట్టారు. ఈ పంట మార్పిడి ఆయన జీవితంలో ఎంతో కీలకమైనదిగా మారింది. తక్కువ మంది వ్యవసాయ కూలీలతో, తక్కువ చీడపీడలతో ఆయిల్ పామ్ తోట స్థిరంగా అధికమైన లాభాదాయకమైన పంటగా నిరూపితమైంది. ఆయన మెరుగుగా నిర్వహించిన తోట ఏప్రిల్ 2024 నుండి ఇప్పటివరకు 261.50 మెట్రిక్ టన్నుల పామాయిల్ గెలలు ఇచ్చింది. ఇందుకుగాను 46.85 లక్షల రూపాయల ఆదాయం కూడా పొందారు. ఇది మిర్చి, పత్తి సాగుతో వచ్చిన ఆదాయం కంటే చాలా ఎక్కువ కావడంతో రైతు ఎంతో సంతోషించా రు. ఆయిల్ పామ్ సాగును ఎంచుకున్నందుకు తనకు సంతృప్తికరమైన దిగుబడులను ఆదాయాన్ని ఇచ్చిందని మిక్కిలి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈయన విజయగాథ ఎంతో మంది రైతులకు ప్రేరణగా నిలిచింది.

### మరో రైతు రూపి రెడ్డి గోపాల్ రెడ్డి విజయ గాథ

మహబూబాబాద్ జిల్లా ఆలేరు గ్రామానికి చెందిన రూపిరెడ్డి, గోపాల్ రెడ్డి పసుపు, మిర్చి వంటి అనేక పంటలు సాగు చేశారు. అయితే మంచి దిగుబడి వచ్చినప్పటికి మద్దతు ధర తక్కువగా ఉండటం, సాగు ఖర్చులు ఎక్కువ కావడం స్థిరమైన ఆదాయం వచ్చేది కాదు. ఉద్యాన శాఖ ప్రోత్సాహంతో ఆయన కొత్తగా ఆయిల్ పామ్ సాగును నిర్ణయించుకున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావు పేట గ్రామానికి వెళ్లి అక్కడి రైతులతో అన్ని వివరాలు తెలుసుకున్నారు. దీనివల్ల ఆయిల్ పామ్ సాగులోకి మారాలని ధైర్యంగా నిర్ణయించుకున్నారు. సెప్టెంబర్ 2021 లో ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ నిపుణులు ఇతర స్నేహితుల సహాయంతో ఆయన ఆరు ఎకరాలలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. పశువుల ఎరువులు వేయడం, పచ్చి రొట్టె ఎరువులు వేయడం, కోళ్ల పశువుల పెంట, గొర్రెల పెంటను ఉపయోగించడం వంటివి చేశారు.

మూడు సంవత్సరాల శ్రమ అనంతరం 2024 జూలైలో ఆయిల్ పామ్ పండ్ల గెలలు కోతకు వచ్చాయి. అక్టోబర్ 2025 వరకు 71 టన్నుల దిగుబడి పొందారు. అంటే దాదాపు 13 లక్షల రూపాయల ఆదాయం కూడా ఆయన సంపాదించారు. ఇది ఆయన జీవితాన్ని మార్చేసిన నిర్ణయం. అందుకే తన అనుభవాన్ని స్మరించుకుంటూ ఇతర రైతులకు ఆయిల్ పామ్ సాగు వల్ల లాభాల గురించి, దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, స్థిర ఆదాయం గుర్తించి వివరిస్తూ స్ఫూర్తి ప్రదాత అయ్యారు.

# పేద విద్యార్థుల కలల వెనుక...నిధుల కరువు

రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, అణచివేసే సమాజంలో అణగారిన వ్యక్తుల సృజనాత్మకతను వెలికితీసి స్వేచ్ఛను ప్రసాదించే శక్తులను పెంపొందింప చేసేదే విద్య. అలాంటి విద్యను ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కుగా మన రాజ్యాంగం హామీగా ఇచ్చింది. కానీ ఆ హక్కు వాస్తవరూపం దాల్చడానికి కేవలం పాఠశాలల గోడలే కాదు, ఆర్థిక ఆధారమూ అవసరం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉన్నత విద్య అనేది ఇప్పటికీ ఒక కల. ఆ కలను సాకారం చేయడానికి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ముఖ్యమైన సంక్షేమ పథకం ఫీజు రీయింబర్స్‌మెంట్. ఇది పుట్టుకతోనే సామాజిక న్యాయానికి పునాదులు వేసిన పథకం. పేద విద్యార్థుల చదువు డబ్బుల కొరతతో ఆగిపోకూడదని, ప్రతిభకు అవకాశాల ద్వారాలు తెరవాలని ప్రారంభమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో(2008) ప్రారంభించబడి నేడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం ఆయా రాష్ట్రాల స్వంత పంథాలో నడుస్తుంది. ఈ పథకం లక్ష్యం సూటిగా, స్పష్టంగా ఉంది. విద్య అనేది పేదలకు చేరాలంటే, డబ్బు అడ్డంకి కాకూడదు.ఈ పథకం వల్ల లక్షలాది విద్యార్థులు ఇంజినీరింగ్, డిగ్రీ, మెడికల్, పాలిటెక్నిక్, ఫార్మసీ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశం పొందారు. ప్రైవేట్ కాలేజీలు కూడా వీరికి ప్రభుత్వ భాగస్వామ్య విద్యా కేంద్రాలుగా మారాయి.

**సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు లభించిన మేలు:**

ఫీజు రీయింబర్స్మెంట్ వల్ల సమాజంలో కొన్ని గమనించదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి. పేద కుటుంబాల పిల్లలు ఇప్పుడు ఇంజినీరింగ్, ఫార్మసీ,లా, డాక్టర్ , నర్సింగ్ మొదలయిన కోర్సులు చేయగలుగుతున్నారు. ఈ ఉన్నత చదువుతో వృత్తి అవకాశాలు లభించి, పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి రావడం మొదలైంది. చిన్న ఊర్లలో, మారుమూల తండాల్లో, గిరిజన గూడాల్లో కూడా ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగింది. ప్రభుత్వ ఆర్థిక సాయం వల్ల పేద అమ్మాయిలను చదివించడంలో తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు, వారు పురుషులతో సమానంగా ఆర్థికంగా, సామాజికంగా దేశాభివృద్ధిలో తమ భాగస్వామ్యాన్ని పోషిస్తున్నారు.

**నిధుల కొరతతో విద్యార్థుల కంటతడి:**

ఇటీవలి సంవత్సరాల్లో ఫీజు రీయింబర్స్మెంట్ పథకానికి ప్రభుత్వాల నుండి నిధుల విడుదలలో భారీ ఆలస్యం జరుగుతుంది. కాలేజీలకు రెండు, మూడు సంవత్సరాల బకాయిలు పెండింగ్‌లో ఉండటం సాధారణమైపోయింది. ఈ పరిస్థితి విద్యార్థులకు, కాలేజీలకు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు తెచ్చింది. ఈ పరిస్థితికి కారణాలను విశ్లేషణచేస్తే, ప్రభుత్వ బడ్జెట్ లోటు, ఎన్నికల ప్రాధాన్యతలు మారడం, రుణాల బరువుతో రాష్ట్ర ఆర్థిక స్థితి దెబ్బతినడం, పథకాన్ని సరైన గణాంకాల ఆధారంగా ప్రణాళిక చేయకపోవడం, అధికార యంత్రాంగంలో ఆలస్యం, ఫైల్ ప్రాసెసింగ్ లో నిర్లక్ష్యం, దీని ఫలితంగా విద్యార్థులు సర్టిఫికేట్లు అందుకోలేక, ఉన్నత చదువులకు దరఖాస్తు చేయలేక, ఉద్యోగాల ఎంపికలో వెనుకబడుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే ప్రభుత్వానికి సమాంతరంగా విద్యా సేవ అందిస్తున్న ప్రైవేట్ కాలేజీలు ఎందుకు వివక్షకు గురవుతున్నాయి? ఇవి ప్రభుత్వం కోసం విద్యా భాగస్వాములుగా పని చేస్తున్నాయి. పేద విద్యార్థులకు ప్రభుత్వ పథకాల కింద సీట్లు ఇచ్చి, వారికి క్లాసులు, సౌకర్యాలు, సిబ్బందినీ అందిస్తున్నాయి. కానీ ఫీజు రీయింబర్స్మెంట్ మొత్తాలు సకాలంలో రాకపోవడం వల్ల ఈ సంస్థలు జీతాలు, ల్యాబ్ నిర్వహణ, మౌలిక వసతులు అందించడంలో ఇబ్బందులు పడుతున్నాయి.

ప్రైవేట్ కాలేజీలు లాభాపేక్షతో కూడినవైనా, వాస్తవంగా ఇవి ప్రభుత్వ బాధ్యతను పంచుకుంటున్న సంస్థలు. అందుకే వీటిని వివక్షగా చూడకుండా భాగస్వాములుగా గుర్తించి సహకరించడం సమాజ ప్రయోజనానికి అవసరం. ప్రైవేట్ కాలేజీలు కేవలం విద్యార్థులకు విద్య ఇవ్వడమే కాదు, నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. వేలాది లెక్చరర్లు, టెక్నీషియన్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది ఈ కాలేజీల ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం వలన ఈ వర్గాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది.

**ఎన్నికల హామీలు, తరువాత ఎగనామాలు... నమ్మకం ఎక్కడ?**

ప్రతీ ఎన్నికల సమయంలో విద్యకు బడ్జెట్‌లో తగు ప్రాధాన్యత, రీయింబర్స్మెంట్, ఉచిత విద్య అనే హామీలు ఇచ్చే ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక అదే మాటలను మరిచిపోవడం ఒక దురదృష్టకర వాస్తవం. పేద విద్యార్థుల చదువు కోసం అని వాగ్దానాలు ఇచ్చి, తరువాత వాటికి నిధులు కేటాయించకపోవడం ఇది ప్రభుత్వానికి ఉన్న శీత దృష్టి, లేదా అసమాన న్యాయం అని చెప్పక తప్పదు.

**ప్రభుత్వాల బాధ్యత విద్యపై పెట్టుబడి:** విద్యపై పెట్టే ప్రతి రూపాయి వ్యయం కాదు, భవిష్యత్తుపై పెట్టుబడి. విద్య ద్వారా మాత్రమే సమాజం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుంది. పేద విద్యార్థులకు ఆర్థిక అడ్డంకులు లేకుండా చదివే అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని నిలబెట్టుకోవాలంటే సకాలంలో నిధుల విడుదల, ప్రమాణీకృత డేటా ఆధారంగా ప్రణాళికలు, ప్రైవేట్ కాలేజీలను భాగస్వాములుగా గుర్తించడం. విద్యార్థుల హక్కుల రక్షణకు చట్టబద్ధ హామీ ఇవ్వాలి.

**విద్యార్థుల కంటతడి సమాజానికి పాఠం:**

ఫీజు రీయింబర్స్మెంట్ లాంటి పథకాలు కేవలం ప్రభుత్వ పత్రాలలో ఉండకూడదు. అవి పేద విద్యార్థి ఇంట్లో వెలిగే దీపం. ఒక కుటుంబం చదువుతో ఎదిగితే, దాని ప్రభావం తరతరాల మీద ఉంటుంది. నిధుల ఆలస్యం, వివక్ష, రాజకీయ ప్రాధాన్యతలతో ఈ దీపం ఆరిపోకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉంది. విద్యార్థి కలలు సంవిధాన హామీతోనే కాదు, ప్రభుత్వ నిబద్ధతతోనే నెరవేరతాయి. ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా, నిధులు సకాలంలో విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తు రక్షించాలి. విద్యలో పెట్టుబడి అంటే దేశ భవిష్యత్తులో పెట్టుబడి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని మర్చిపోతే, పేద విద్యార్థుల కన్నీటి చరిత్ర మనం చదవాల్సి వస్తుంది.

**మహేశ్వరం భాగ్యలక్ష్మి**

# కేరళ కమ్యూనిస్టు పాలన ఆదర్శం



డా. కె. నారాయణ
సిపిఐ కేంద్ర కంట్రోల్ కమిషన్(సిసిసి) చైర్మన్
94909 52222

కేరళ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రాత్మకంగా, పేదరికం నిర్మూలనను అధికారికంగా ప్రకటించడం దేశంలోని ప్రజాస్వామ్య శక్తులకు గర్వకారణం. భారతదేశంలో కమ్యూనిస్టులు రక్తపాతం లేకుండా ప్రజాస్వామ్య మార్గంలో అధికారంలోకి వచ్చిన తొలి రాష్ట్రం కేరళ. అప్పట్లో చాలామంది రాజకీయ పండితు లు ఈ ప్రభుత్వం ఎక్కువకాలం నిలబడదని, ఎలాంటి ఫలితాలూ సాధించదని అనుకున్నారు. కానీ కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి.

**భూమి సంస్కరణల నుంచి అక్షరాస్యత వరకు**

మొదటి అడుగుగా భూమి సంస్కరణలను అమలు చేశారు – రైతులకు భూమి హక్కులు కల్పించారు. రెండ వ అడుగుగా నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించారు. 100 శాతం అక్షరాస్యత సాధించారు. ఇప్పుడు మూడవ చారిత్రాత్మక ఘట్టంగా పేదరిక నిర్మూలనను ప్రకటించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రాన్ని నడిపిస్తూ ఈ ఘనత సాధించింది.

**డబుల్ ఇంజిన్ ప్రభుత్వ వైఫల్యం**

ఇదే సమయంలో గుజరాత్‌లో బిజెపి గత 27 ఏళ్లు గా అధికారంలో ఉంది. 2014 నుంచి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం నడుస్తున్నది. 2001లో సీఎం గా వచ్చిన నరేంద్ర మోదీ ఆ తర్వాత ప్రధాని అయ్యారు. కానీ ఈ దీర్ఘకాల పాలనలో పేదరిక నిర్మూలన వైపు కేవలం ప్రసంగాలే తప్ప పురోగతి లేదు.

కేరళలో ప్రజల సంక్షేమంపై దృష్టి ఉండగా, గుజరాత్‌లో కార్పొరేట్ సంక్షేమమే ప్రధానమైంది.

అదానీ, అంబానీ లాంటి మిత్ర కార్పొరేట్లకు లాభదాయకమైన విధానాలు అమలు చేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించేందుకు ప్రయత్నించారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించే ప్రయత్నా న్ని కార్మిక వర్గం, ఉద్యోగులు కలిసి అడ్డుకున్నారు.

ఇప్పుడు ₹33,000కోట్ల ఎల్ఐసి నిధులను నష్టాల్లో ఉన్న అదానీ కంపెనీకి అప్పగించడం దీనికి మరో ఉదాహరణ.

**కేరళ మోడల్:**అత్యంత పేదరిక నిర్మూలన ప్రాజెక్ట్ (EPEP) కేరళలో ఎలా విజయవంతమైంది?

2021లో ప్రారంభించిన ఎక్స్‌ట్రీమ్ పావర్టీ ఎరాడికేషన్ ప్రాజెక్ట్ (EPEP) దీనికి కీలకంగా మారింది.

**ముఖ్యాంశాలు:**

అత్యంత పేద కుటుంబాలను స్థానిక సంస్థలు, మహిళా సంఘాలు, పంచాయతీల ద్వారా గుర్తించడం.

'ప్రతి కుటుంబానికి ప్రత్యేక మైక్రో ప్రణాళిక రూపొందించడం – ఆహారం, నివాసం, ఆదాయ వనరులు, ఆరోగ్యం వంటి అంశాలపై అవసరమైన సహాయం అందించడం – ఇళ్లు నిర్మించడం లేదా పునరుద్ధరించడం, భూమి కేటాయించడం, ఉపాధి, ఆరోగ్య సేవలు, పత్రాల సదుపాయం.

కరోనా సమయంలో కేరళ ఆరోగ్యశాఖ ప్రదర్శనకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) కూడా ప్రశంసలు తెలిపింది.

ఫలితం – పేదరికం లేని తొలి భారత రాష్ట్రం

2025 చివరి నాటికి కేరళ జనాభా సుమారు 3.6 కోట్లుగా ఉంటుంది (భారత జనాభాలో 2.6%).

గుజరాత్ జనాభా 7.2 కోట్లుగా (5.2%) ఉన్నప్పటికీ అక్కడ పేదరికం తగ్గుదల చాలా నెమ్మదిగా ఉంది, అసమానతలు పెరిగాయి.

**గుజరాత్‌లో దోపిడీ పాలన**

గుజరాత్‌కు చెందిన 26 మంది ప్రముఖులు భారీ బ్యాంకు రుణాలు తీసుకుని చెల్లించకుండా విదేశాలకు పారిపోయారు.

మెహుల్ చోక్సీ (₹8,500 కోట్లు – గీతాంజలి జెమ్స్), రిషి అగర్వాల్ (₹4,600 కోట్లు – ఎబిజి షిప్‌యార్డ్, లలిత్ మోదీ, నీరవ్ మోదీ, కేతన్ పారేఖ్ తదితరు లు ప్రభుత్వ ప్రోత్సాహంతో దేశం విడిచి వెళ్లిపోయారు.

ఇలాంటి దినదినమూ దోచుకునే దోపిడీ పాలనలో పేదరిక నిర్మూలన ఎలా సాధ్యం అవుతుంది?

**ముగింపు**

కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చూపిన మార్గం స్పష్టంగా చెబుతోంది – ప్రజల ఆధారిత పాలన, వికేంద్రీకరణ, సామాజిక న్యాయం ఉంటేనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది.

బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల కార్పొరేట్ ఆధారిత విధానాలు కేవలం అసమానతలనే పెంచుతున్నాయి.

లేఖ

# తెలుగు రాష్ట్రాలను కుదిపి వేస్తున్న బస్ ప్రమాదాలు

తెలుగు రాష్ట్రాల్లో బస్సు ప్రమాదాలు తరచూ జరుగుతుండటంతో ప్రజల్లో భయాందోళన పెరుగుతోంది. రోడ్లపై ప్రయాణమంటేనే ప్రాణాలను పణంగా పెట్టినట్టేనన్న పరిస్థితి ఏర్పడింది. హైవేల్లో బస్సులు బోల్తా పడటం, కాలిపోవడం, లోయల్లోకి దూసుకెళ్లడం వంటి ఘటనలు అనేక కుటుంబాలను విషాదంలోకి నెట్టేశాయి. పది రోజుల క్రితం హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరీ ట్రావెల్స్ వోల్వో బస్సుకు కర్నూలు శివారులో జరిగిన ప్రమాదం మరోసారి భద్రతా ప్రమాణాలపై చర్చను రేకెత్తించింది. సుమారు 25 మంది ఘటనా స్థలిలో మాడి బూడిద అయ్యారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా వున్నారు. అనేకమంది క్షత గాత్రులు కావడం జరిగింది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని రంగా రెడ్డి జిల్లా చేవెళ్ల లో కంకర లారీ ఆర్టీసీ బస్‌ను ఢీ కొన్న ఘటనలో 19 మంది మరణించడం అనేక మంది క్షత గాత్రులు కావడం అందరినీ విషాదంలో ముంచింది. గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన కొన్ని బస్సు ప్రమాదాలు:

2010 (అనంతపురం): ఎపిఎస్ఆర్టీసి బస్సు అదుపుతప్పి బోల్తా, 18 మంది మృతి.

2012 (కృష్ణా): బస్సు చెరువులో పడటంతో 22 మంది మరణం.

2013 (పాలెం, మహబూబ్‌నగర్): వోల్వో బస్సు మంటల్లో కాలిపోవడంతో 45మంది సజీవదహనం.

2014(మెదక్): స్కూల్ బస్సు–రైలు ఢీ, 26 మంది విద్యార్థుల దుర్మరణం.

2015(ఖమ్మం): విద్యార్థులతో ఉన్న బస్సు బోల్తా, 13 మంది మృతి.

2017: ఎపిఎస్ఆర్టీసి బస్సు లోయలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

2018 (కొండగట్టు): 57 మంది భక్తుల మరణంతో చరిత్రలోనే పెద్ద ప్రమాదం.

2019: శ్రీశైలానికి వెళ్తున్న భక్తుల బస్సు లోయలో పడటంతో 9 మంది మృతి.

2019(కర్నూలు): వోల్వో తూఫాన్ ఢీ, 15 మంది మృతి.

2021 (ఏలూరు): బస్సు వాగులో పడటంతో 9 మంది మృతి.

2025 (కర్నూలు): వోల్వో బస్సు మంటల్లో చిక్కుకుని 20 మందికి పైగా సజీవదహనం.

ప్రతి ఒక్క ఘటన తర్వాత విచారణలు జరుగుతున్నప్పటికీ, ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. నిపుణులు డ్రైవర్లకు తగిన శిక్షణ, రోడ్డు మౌలిక సదుపాయాల మెరుగుదల, వాహనాల టెక్నికల్ చెకింగ్‌లను కచ్చితంగా అమలు చేయాలని సూచిస్తున్నారు. ప్రయాణికుల భద్రతకోసం ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రోడ్డు భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని అభిప్రాయపడుతున్నారు.

కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

## కారు బోల్తా... మహిళ మృతి



ప్రజాపక్షం/మోతె : కారు బోల్తా కొట్టి మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని మామిళ్ళ గూడెం వద్ద సూర్యాపేట ఖమ్మం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టిఎస్05 ఈఎస్ 0537 గల కారు హైదరాబాద్ నుండి ఖమ్మం వైపుకు వెళ్తున్న కారుకు అడ్డుగా కుక్క రావడంతో ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో కారు బోల్తా కొట్టి అన్నపర్తి రాణి (38) అక్కడికి అక్కడే మృతి చెందింది. మృతురాలి స్వంత గ్రామం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పోచవరం గ్రామస్తురాలు. భర్త సాయిరాం, ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దేవాలయాల పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత

మాజీ ఎంపి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : దేవాలయాల పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని మాజి ఎంపి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం బిజెపి ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి గుట్ట సింహద్వారం వరకు 11 జ్యోతులతో పాదయాత్ర నిర్వహించి అవినీతి పాలన నుండి నీది నువ్వే కాపాడుకోవాలి స్వామి అని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారి పవిత్ర యాదాద్రి ఆలయంలో ఇటీవల బయటపడుతున్న అవినీతి, అక్రమ వ్యవహారాలు భక్తుల హృదయాలను కలచివేస్తున్నాయన్నారు. దేవాలయ సంప్రదాయాలకు విరుద్ధంగా జరుగుతున్న ప్రక్రియలను అంగీకరించలేమని, ఈ అవకతవకలు వెంటనే నిలిపివేయాలని, ఆలయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రం ఉపయోగించవద్దని ప్రభుత్వం మరియు ఎండోమెంట్స్ శాఖను హెచ్చరించారు.

## రైల్వే స్టేషన్‌లో డిఆర్ఎం తనిఖీ



ప్రజాపక్షం/కృష్ణ : గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర ఏస్ గుప్తా బుధవారం కృష్ణ రైల్వే స్టేషన్‌ను తనిఖీలు చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ప్రస్తుతం రైల్వే సిబ్బంది ఉన్న పాత భవనాలను, రైళ్లకు నీటి సదుపాయలను, ప్రయాణికులకు తాగునిటీ సౌకర్యాలను పరిశీలించారు. అలాగే రాబోయే 2027 సంవత్సరంలో వచ్చే కృష్ణ పుష్కరాలు పురస్కరించుకొని కృష్ణ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై, అదనపు సౌకర్యాలు కల్పించే ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం, ఆర్‌డబ్ల్యూ, పిడబ్ల్యు, ఇంజనీర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత



ప్రజాపక్షం/నర్వ: మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా సియంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. నర్వ మండలంలోని కల్వాల గ్రామానికి చెందిన ఖాజా హుసేన్ లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్వల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ చెక్కుని అందజేయడం జరిగింది.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

ప్రజాపక్షం/వీపనగండ్ల : మండల పరిధిలోని తూంకుంట గ్రామానికి చెందిన మంగదొడ్డి వెంకటేశ్వర్లు (55) తీవ్రమైన కాలినొప్పిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసుకొని మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. ఎస్సై కే.రాణి కథన ప్రకారం రెండు సంవత్సరాల క్రితం వెంకటేశ్వర్లుకు కాలికి గాయం కావడంతో అది సెప్టిక్‌గా మారింది. అప్పటి నుండి నిరంతరం నొప్పులతో బాధపడుతూ, చికిత్స పొందుతున్నప్పటికి ఆరోగ్యం కుదుటపడలేదు. ఈ కారణంగా ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపినట్లు వివరించారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 1 గంట సమయంలో గాయపడ్డ కాలిలో నొప్పి భరించలేక ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు వివరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగిందని తెలిపారు.

## పుల్గర్‌చర్లలో శాఖాహార ర్యాలీ, పిరమిడ్ ధాన్య కేంద్రం ప్రారంభం



జీవహింస మహాపాపం- పత్రీజీ ఆశయాలే మానవ మంగళం

ప్రజాపక్షం/వీపనగండ్ల : మానవ శరీర నిర్మాణం పూర్తిగా శాఖాహార జీవన విధానానికి అనుకూలమని, శాఖాహారం ద్వారా శరీరం, మనస్సు శుద్ధి పొందుతుందని ధ్యాన ప్రచార కార్యదర్శులు ఆనంద్ ప్రసాద్, బంగ్లా ఆంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పుల్గర్ చర్ల గ్రామంలో శ్రీజ, అశోక్ వర్ధన్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో శాఖాహార ర్యాలీ నిర్వహించడంతో పాటు పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాఖాహారం మనిషి ఆరోగ్యానికి మేలే కాకుండా, ఆధ్యాత్మిక శ్రేయస్సుకూ దోహదపడుతుంది. శాఖాహారం ద్వారా జీర్ణ వ్యవస్థ శుద్ధి అవుతుంది. పిరమిడ్‌లో ధాన్యం చేస్తే మూడు రేట్లు ఎక్కువ శక్తి లభిస్తుంది. మానవ శరీర నిర్మాణం శాఖాహారం కోసం సృష్టించబడింది. జీవహింస మహా పాపం గాంధీజీ చూపిన అహింసామార్గం, పత్రీజీ బోధించిన ధ్యానమార్గం అన్నీ శాఖాహారం పునాదిపైనే ఆధారపడి ఉన్నాయని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ర్యాలీ సందర్భంగా జీవహింసకు దూరంగా ఉండండిశాఖహారమే సత్యమార్గం ధ్యానం ద్వారా ఆరోగ్యంపిరమిడ్ ద్వారా శక్తి వంటి నినాదాలతో గ్రామంలో ప్లకార్లతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, నరసింహ యాదవ్, రామకృష్ణ, సాయిబాబా, జైపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతయ్య, ప్రవీణ్, రాధా, మహేశ్వరి, సుమతి, చిన్న రాయుడు, వెంకట్ రెడ్డి, స్వప్న, శైలజ, ఈశ్వరమ్మ, జ్ఞానేశ్వరి, వసంత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్తదేవస్థానములో బుధవారం కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. నేత్రపర్వంగా జరిగిన ఆదిదంపతుల కళ్యాణాన్ని భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కళ్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు ఆలయకమిటీ అన్నదానం చేశారు.

# ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం

నూతన ఇందిరమ్మ ఇండ్లను ఘనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



ప్రజాపక్షం/జడ్చర్ల : రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతరంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ ''ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడం ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రదమైన నివాసం లభిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి అర్హ కుటుంబం ఇల్లు కలిగే వరకు కృషి చేస్తా'' అన్నారు. తరువాత ఎమ్మెల్యే, కలెక్టర్ లబ్ధిదారులతో భోజనం చేశారు. గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నేతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పేరుతో మట్టి దోపిడీ



జెసిబిలతో సోలార్, దాబాలకు మట్టి తరలింపు

బృహత్ పల్లె ప్రకృతి వనం చెట్ల తొలగింపు : ఫిర్యాదు చేసినా పట్టించుకోని తహసీల్దార్, ఎంపిడిఓ

ప్రజాపక్షం/ అడ్డాకుల : ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అడ్డాకుల మండల కేంద్రలోని చెరువు గట్టుపై ఉన్న ఎర్ర మట్టిని జెసిబిల సాయంతో కొంత మంది ఇష్టానుసారంగా తవ్వి సోలార్ కంపెనీ, దాబాలకు తరలిస్తున్నారు. 20 లక్షల రూపాయలతో గత ప్రభుత్వ హయాంలో గుట్టపై బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వనంలోని చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్కింగ్ డే రోజున ఇందిరమ్మ ఇండ్లకు తహసిల్దార్ అనుమతులు ఇస్తున్నారు. కాగా కొంత మంది నాయకులు మాత్రం సెలవు దినాలు, ఆదివారం నాడు ఇందిరమ్మ ఇండ్లకు మట్టి కొడుతున్నామని చెప్పి అడ్డ దారిలో ఎర్ర మట్టిని అమ్ముకుంటున్నారు. ఈ విషయం గురించి స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బుధవారం నాడు ఉదయం 3 గంటల నుండి 8 గంటల వరకు మట్టిని తరలించారు. అయినా రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా ఎర్ర మట్టిని తరలిస్తున్న జెసిబిల ఓనర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య



ప్రజాపక్షం/నారాయణపేట : బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదు అని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# మతోన్మాదం ప్రగతికి ప్రమాదకరం



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : దేశంలో మతోన్మాదం పెరగటం దేశ ప్రగతికి ఆటంకమని వామపక్ష ప్రజాసంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. వనపర్తి సిపిఐ ఆఫీసులో కవిజనజ్వాల రాధాకృష్ణ రచించిన జనజ్వాల మహాకవిత్వం పుస్తకాన్ని భారత విప్లవోద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి 41వ వర్ధంతి సందర్భంగా ప్రోగ్రెస్ డెమోక్రటిక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జే రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జనజ్వాల రాధాకృష్ణ, డా.భగవంతు, కొంకల నారాయణ, గణేష్, కేశవులు, వెంకటేష్, మోష తదితరులు మాట్లాడుతూ.. పాలకులు దేశంలో మతాన్ని పెంచిపోషిస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల్లో మతాన్ని ఎక్కించి సమస్యలపై పోరాడకుండా పక్కదారి పట్టిస్తున్నారు. వామపక్ష భావజాలమే దేశంలో ఉండే 90 శాతం మంది పేదలు ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుంది అన్నారు. పార్టీలకతీతంగా వామపక్ష భావజాం గల వారందరూ ఐక్యమై పోరడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా చైతన్యానికి ప్రతిబంధకంగా పరిణమించే మతం కులం జాతి వివక్షతను ఎదుర్కోవలసిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఐక్యమైపోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాహక్కులను వామపక్షాలు మాత్రమే కాపాడగలవన్నారు. వాపక్షవాదులందరూ సంఘటితం కావలిసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. శ్రీరామ్, గోపాల కృష్ణ, శ్రీహరి, రవిచంద్ర సంఘ రక్షిత కుతుబ్ ,అరవిందు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ప్రచారంలో కాంగ్రెస్ నేతలు




ప్రజాపక్షం/వీపనగండ్ల : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా కృషి చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు వీపనగండ్ల మండల కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ప్రజలను కలుసుకుంటూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విశేష ఆదరణ పొందుతున్నాయని నాయకులు తెలిపారు. నవీన్‌యాదవ్ గెలుపు ద్వారా జూబ్లీహిల్స్ ప్రాంతంలో అభివృద్ధి వేగం మరింత పెరుగుతుందని, స్థానిక సమస్యల పరిష్కారానికి కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు. గ్రామా గ్రామాన తిరుగుతూ నాయకులు ప్రజలను కాంగ్రెస్ అభ్యర్థి తరపున ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రచారంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోదల బీరయ్య, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రావుల నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, నాయకులు బొల్లారం సుదర్శన్ రెడ్డి, చిన్నారెడ్డి, బస్వరాజ్ గౌడ్, రవీందర్ రెడ్డి, గోపి, దనుంజయ, భరత్ రెడ్డి, చక్ర వెంకటేష్, వెంకట్ , రాజయ్య, మహేష్, రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన సూచనల ప్రకారం రోజువారీ ప్రణాళికతో ప్రజా సందర్శనలు, డోర్ టు డోర్ ప్రచారం కొనసాగుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



ప్రజాపక్షం/ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రంలో ఎన్టీఆర్ కాలనీలో సొంబట్ల తోటలో వృద్ధ మల్లికార్జున స్వామి శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా గువ్వలపల్లి కొండన్న ఉమదేవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాలాభిషేకం చూస్తూ పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో 365 వత్తుల దీపం వెలిగించడం వల్ల ఏడాది పొడవునా దీపారాధన చేసినంత పుణ్యం లభిస్తుందని ఆలయ అర్చకులు పటేల్ నరసింహులు చెబుతున్నారు. ఈ దీపాన్ని సంవత్సర దీపం అని కూడా అంటారు. ఇది జ్ఞానానికి లక్ష్మి కటాక్షానికి పాప నివారణకు మోక్ష ప్రాప్తికి దోహదపడుతుందని విశ్వసిస్తారు. ఉద్యోగ వ్యాపార రీత్యా ప్రతిరోజూ దీపం వెలిగించలేని వారికి ఇది అనుకూలమైనది. పౌర్ణమి నాడు శివకేశవుల నామాలను జపిస్తూ, ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో ఈ దీపాన్ని వెలిగిస్తారు అని తెలిపారు. ఈ ఆలయంలో 16 సంవత్సరాల నుండి ప్రతి కార్తీక మాసంలో 2116 దీపాలు వెలిగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌ఓసి అందజేత

ప్రజాపక్షం/నర్వ : మండల పరిధిలోని పాతర్చేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గురు నరసప్పకి రూ.5,00,000 ఎల్ఓసి నియామకపత్రాన్ని వారి కుమారునికి అందజేసిన యువజన సర్వీసుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చెన్నయ్య సాగర్, గ్రామ అధ్యక్షులు లంకాల రమేష్, జిల్లా నాయకులు బొలుబండ వెంకటేష్, మండల ఎస్సి అధ్యక్షులు ఎన్.వెంకటయ్య, గ్రామ సీనియర్ నాయకులు ఎస్ఎస్ రాములు, కె.శ్రీనివాసులు గౌడ్, యు.బాలరాజ్, జికె నరసింహులు, జి.కొండన్న, ఎల్ మన్యం, ఏర్పుల ఆంజనేయులు, వై.వెంకటేష్, కమ్మరి శ్రీను, పనుల నరసింహులు, మెకాని క్రాము, కె.రాఘవేందర్ గౌడ్, టి.రాము, పి.సంజీవ, టి. వెంకట్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం



ప్రజాపక్షం/నారాయణపేట్ : నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగం పెరగడం ద్వారా నేడు క్యాన్సర్ వంటి అతి భయంకరమైన రోగాల బారిన పడుతున్నారు. జీవితంలో ప్లాస్టిక్ వినియోగం బాగా తగ్గించాలని సంకల్పంతో పతంజలి యోగ సమితి సభ్యులు వివిధ రకాలైన శుభకార్యాలకు వెళ్ళినప్పుడు సొంతంగా స్టీల్ ప్లేట్లు ఇంటి నుండి తీసుకొచ్చి భోజనం చేస్తే చాలా మందికి ఆదర్శంగా ఉంటున్నారు. ప్లాస్టిక్ నివారణ తగ్గిస్తూ పర్యావరణాన్ని కాపాడాలని ఈ విధంగా ప్రతి ఒక్కరు తమ జీవన విధానంలో ప్లాస్టిక్ వినియోగాన్ని బాగా తగ్గించాలని పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షులు, సురేష్ కుమార్ తెలియజేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయినట్లు డాక్టర్ నిసార్, డాక్టర్ దేవేంద్రనాథ్ తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన కందూరు రాంరెడ్డి కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరానికి మొత్తం 25 మందిని పరిశీలించగా, వారిలో 15 మందికి కంటికి ఆపరేషన్ అవసరం ఉన్నందున మహబూబ్‌నగర్ తీసుకువెళ్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్వైజర్ నరేందర్ గౌడ్, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణ మండల పరిధిలోని పిన్నంచర్ల, మూలమల గ్రామాలలో రాష్ట్ర పశుసంవర్ధక క్రీడాశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆత్మకూరు పిఎసిఎస్ చైర్మన్ గాడి కృష్ణమూర్తి, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి రహమతుల్లా తెలిపారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు శ్యామ్, రవికాంత్, మోహన్, కమలాకర్ గౌడ్, అరవింద్, విష్ణు, గోవర్ధన్, రాజు, మన్నెమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ యాదగిరి శెట్టి, అక్షర నాగేష్, దామోదర్, రఫిక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



ప్రజాపక్షం/మాగనూర్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుని దివ్య అనుగ్రహంతో పాటి మీది సంధ్య బలరాం దంపతులు భక్తి శ్రద్ధలతో అభిషేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అలాగే జగదేవి, డాక్టర్ సురేష్ కుమార్ దంపతులు అన్నప్రసాద కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిష్టయ్య చారి,కోశాధికారి కే. కృష్ణయ్య, కార్యదర్శి భరత్ కుమార్, గ్రామ పెద్దలు ఆనంద్ గౌడ్, ముష్టి వెంకటయ్య, చెన్నప్ప , చాకలి లింగప్ప, కడేచూర్ తిమ్మయ్య, సుదర్శన్ రెడ్డి, కోమటిట వాబయ్య, దాసరి వాబయ్య, బొంబాయి మురళి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులోకి చేప పిల్లల విడుదల



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి చెరువులోకి చేప పిల్లలను వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ రఘుమారెడ్డి బుధ వారం విడుదల చేశారు. ప్రభుత్వం నుండి ఉచితంగా విడుదలైన సుమారు 72 వేల రవ్వ, బొచ్చ, పెరిక జాతికి చెందిన చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని సూచిం చారు. వారిని అన్ని రకాలుగా ఆదుకుంటానికి ప్రభుత్వం ముందుంటుంద న్నారు. ఈ కార్యక్ర మంలో ఆయనతో పాటు మత్స్య సహకార శాఖ ఏడి రాజారాం, సూపరెండెంటెంట్ వీర మల్ల శ్రీనివాస్, కార్మిక సంఘం అధ్యక్షులు బుంగపట్ల తిమ్మయ్య, నాయకులు నూతి తిరుమలేష్, బైరగోని భిక్షం, నూతి వెంకటేష్, మోర సత్యం, మోర సత్తయ్య, నూతి సతీష్ పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా విద్యార్థు లను వేధిస్తూ అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట హరి బాబు డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలో ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా అక్రమంగా తరగతులను నిర్వహిస్తున్న విద్యాసంస్థలను గుర్తించి బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తరగతులను బంద్ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురునానక్ జయంతి,కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రభుత్వం అన్ని రకాల విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినప్ప టికీ కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు బేఖాతారు చేస్తూ తమ ఇష్టం వచ్చిన రీతిగా ప్రవర్తిస్తూ ఫీజుల కోసం, ర్యాంకుల వేటలో విద్యార్థు లను మానసికంగా వేధిస్తూ,ఒత్తిడికి గురి చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నా రని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పందు, సంపత్, మణికంఠ,భరత్ కుమార్,శశి కుమార్,అజయ్,దేవేందర్, గణేష్,కార్తికేయ,వెంకట్,మనికే శ్వర్,లోకేష్, నిఖిల్ పాల్గొన్నారు.



## సిపిఐ శతాబ్ది వేడుకలు పండుగలా చేద్దాం

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** దేశంలో సిపిఐ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి నూరు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన వేడు కలను పండుగలా జరుపుకోవాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కార్యకర్తలను కోరారు. గరిడేపల్లి మండల కేంద్రంలో బుధ వారం కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి అధ్య క్షతన జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కంటే ముందుగాని, తర్వాత గాని జరిగిన ప్రతి ఉద్యమంలో, ప్రతి పోరాటంలో సిపిఐ క్రియాశీ లక పాత్ర పోషించిందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్య దర్శి కడియాల అప్పయ్య, సహాయ కార్యదర్శి పోటు పూర్ణచంద్రరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా కనకయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి, చేవా వెంకన్న, కుందూరు వెంకటరెడ్డి, అంబటి వెంకటరెడ్డి, తిరగమళ్ళ కిరణ్, వేశాల ఆంజనేయులు, ప్రతాని సైదులు, పంగ సైదులు, ఈదయ్య, షేక్ పీర్‌సాహెబ్, గోధుమల ఈశ్వరాచారి, అంబటి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## తుఫాన్ తాకిడికి 'మిర్చి' ఆగం



**ప్రజాపక్షం/మోతె :** తుఫాన్ తాకి డికి మిర్చిపంట ఆగమైంది. ఇటీ వల భారీగా కురుస్తున్న వర్షాలకు మిర్చిపంట వేసిన రైతులకు కంట నీరే మిగిలింది. లక్షలు ఖర్చు పెట్టి మిర్చి పంట వేస్తే తుఫాన్ తాకి డితో పంట దెబ్బతిని ఆదుకునే వారు లేక దీనస్థితిలో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రాంపురం తండకు చెందిన రైతు ఆంగోతు రవి తెలిపిన వివరాల ప్రకారం తనకున్న రెండు ఎకరాలలో మిర్చి పంట వేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలో నీళ్ళు నిలిచి గాలి ఆడకపోవడంతోపాటు, మిర్చి తోటలోని వాగు సాగి వరద తాకిడికి భూసారం కొట్టుకొని పోయి అడుగుపిండి, యూరియా సైతం నీటిలో కలిసి పోయిందని తెలిపారు. మిర్చి తోటకు పూసిన పూత రాలిపోవడంతోపాటు చేను ఎండుముఖం వేసిందని వాపోయాడు. వ్యవసాయ అధికారులు స్పందించి న్యాయం చేయాలని తన మిర్చి తోటను సందర్శించి నష్టపరి హారం ఇప్పించాలని వేడుకుంటున్నాడు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, స్టార్ హాస్పిటల్ హైద రాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించే పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 126వ ఉచిత మెగా వైద్య శిబిరం భువన గిరి పట్టణంలోని పహాడీ నగర్ శ్రీ ఆర్కే హాస్పిటల్ నందు నిర్వహించారు. ఈ వైద్య శిబిరం నందు హైదరాబాద్ స్టార్ హాస్పిటల్ వారి పెద్ది శ్రీకాంత్ ఆధ్వ ర్యంలో భువనగిరి పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా బీపీ షుగర్, పిఎఫ్‌టి పరీక్షలు నిర్వహించి పల్మనాలజిస్ట్ వైద్యులసే వైద్య పరీ క్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో శ్రీ ఆర్కే హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్ కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ పెద్ది శ్రీకాంత్, డాక్టర్ చావా అస లేష, స్టార్ హాస్పిటల్ మార్కెటింగ్ డిజిఎం వినోద్, శ్రీ ఆర్‌కె హాస్పిటల్ ఇంచార్జ్ కొండల్ రెడ్డి, స్టార్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొ న్నారు. ఈ వైద్య శిబిరం నందు వంద మదికి పైగా పరీక్షలు నిర్వహించి నట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలియజేశారు.

## తుంగతుర్తిలో జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** సూర్యా పేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో ఈనెల 6 నుంచి 8 తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ ఎడ్యుకేషనల్ ఇన్సిటిట్యూ షన్స్ సొసైటీ 11 జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. తుంగతుర్తి పట్టణ శివారు నాగారం రహదారిపై ఉన్న ఈ పాఠశాల, కళాశాలలో జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో 5వ జోన్‌కు సంబంధించి మొత్తంగా సూర్యాపేట జిల్లాలోని తుంగ తుర్తి, సూర్యాపేట పాఠశాల, కళాశాల విద్యార్థినిలు పాల్గొననున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుండి వలిగొండ, చౌటుప్పల్, ఆలేరు, అడ్డగూ డురు విద్యార్థులు, జనగామ జిల్లాలోని నర్మెట్ట, జాఫర్‌ఘడ్, పాలకుర్తి చెందిన పాఠశాల, కళాశాలల సుమారు 765 మంది క్రీడాకారులు పాల్గొన నున్నారు. మొత్తంగా 19 మంది పిడి, పిఈటీల ఆధ్వర్యంలో కొనసాగ నుంది. ఈ స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్ పుట్ తదితర వాటికి రెండు మైదానాలు ఏర్పాటు చేశారు. తుంగతుర్తిలో జోనల్‌స్థాయి క్రీడలు నిర్వహించడం ఇది రెండవ సారి.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా కేంద్రం లోని శ్రీరామలింగేశ్వర ఆలయం వద్ద బుధవారం అయ్యప్ప స్వాములకు మహా అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. సూర్యాపేట పట్టణానికి చెందిన కొంపెల్లి ఉషారాణి కుమారుడు అనిల్‌రెడ్డి, ఆశ్రితరెడ్డి, స్నేహిత్‌రెడ్డిలు అమెరికాలో నివాసం ఉంటూ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు, అన్ని మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా కొంపెల్లి ఉషారాణి మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వాములంద రికి అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనిత, సురేందర్ రెడ్డి, భవిష్య, నవీన్, ప్రశాంత, వేణు, వాసవి, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు, పరిశోధనలకు పెద్దపీట

### విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశో ధనలకు పెద్దపీట వేయడంలాంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళుతున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. బుధవారం పోచంపల్లి మండలం దేశ్ముఖి గ్రామంలోని విజ్ఞాన్ యూనివ ర్సిటీ 202627 సంవత్సరానికి బీటెక్, బీఫా ర్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్బీ (హా నర్స్), బీబీఏ ఎల్ఎల్బీ (హానర్స్), బీఎస్సీ (హా నర్స్) అగ్రికల్చర్, ఫార్మ్‌డీ అడ్మిషన్ల వీశాట్ 2026/27 నోటిఫికేషన్ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము బీటెక్లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కం ప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈవీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మ్‌డీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రిక ల్చర్, డిప్లొమా ( సీఎస్ఈ. ఈసీఈ, మెకాని కల్,ఈఈఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, ఎమ్మెస్సీ డేటాసైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, పీహెచ్డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకు అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంప స్లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబా టులో ఉన్నట్లు తెలిపారు. మరింత పూర్తి సమా చారం విద్యార్థులు యూనివర్సిటీ వెబ్సైట్ సంప్ర దించి తెలుసుకోవచ్చు అన్నారు. అడ్మిషన్స్. విజ్ఞాన్.ఎసి. ఇన్ ద్వారా ఆన్లైన్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామ న్నారు. వీశాట్ 2026 దరఖాస్తును ఫిబ్రవరి 25 లోగా పూర్తిచేయాలన్నారు. వీశాట్ పరీక్ష రాసిన వారికి బీటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధా న్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇన్చార్జ్ రిజిస్ట్రార్ డా దిరిశాల విజయరాము, డీన్ అడ్మిషన్స్ డా కేవీ క్రిష్ణకిశోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజి స్ట్రార్ ఏ. గౌరిశంకర్ రావు ఉన్నారు.

## అండర్-17 టైక్వాండో క్రీడాకారుల ఎంపిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకా రంతో 69వ ఎస్‌జిఎఫ్ తెలంగాణ రాష్ట్ర స్థాయి టైక్వాండో అండర్17 (బా లురు,బాలికలు)ఎంపిక పోటీలు ఈనెల 3 నుండి 5వరకు మూడు రోజులు పాటు స్థానిక ఏలిమినేటి మాధవ రెడ్డి పోలీస్ ఆడిటోరియంలో విజయవం తంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి సుమారు 350 మంది క్రీడాకారులు,కోచ్‌లు,మేనేజర్లు, టెక్నికల్ అధికారులు, పిఈ టిలు,పిడిలు పాల్గొన్నారు. పోటీల అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.ఎంపికైన క్రీడాకారులు నవం బర్ 25 డిసెంబర్ 2 వరకు ఇటానగర్, ఆరుణాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ టైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రా నికి బాధ్యత వహిస్తారు.అనంతరం విజేతలకు మెడల్స్,సర్టిఫికెట్లును జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి మొహమ్మద్ అక్బర్ ఆలీ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ వై. సాయి,కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సిఈఓ ఎం.వి గోనారెడ్డి ,ఎస్‌జిఎఫ్ రాష్ట్ర పరిశీలకులు ఎం.ఈశ్వర్ జిల్లా సెక్రటరీ దగ్గుబాటి విమల,ది టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్,వ్యాయామ ఉపాధ్యా యులు కుంభం నర్సి రెడ్డి,శంభులింగం, నాగరాజు, రవీందర్, యుగేం దర్,అష్రఫ్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఐఏ ఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, ఆర్‌డిఓ శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రక్తదాన శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవులు ముది రాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సమాచార హక్కు చట్టం పై అవగాహన కల్పిస్తూ,ఓటరు చైతన్య కార్య క్రమాలు నిర్వహించడం తో పాటు,పాలు సామాజిక కార్యక్రమాలు నిర్వహి స్తునమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం పేద ప్రజలు వస్తు న్నందున వారికి ఉపయోగపడాలని తన పుట్టినరోజు సందర్భంగా నల్లగొం డలోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ ఏ ఖాన్,జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ నాగేష్,మెడికల్ ఆఫీసర్ దీపికా,సంస్థ సలహా దారులు రామలింగయ్య,బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి ప్రశాంత్,మేఖల శ్రీహరి,ఎరు కల నరహరి గౌడ్,మెట్టు మధు,కలవాల హరికృష్ణతదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్న ప్రతీక్ ఫౌండేషన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** విద్యార్థులలో పుస్తక పఠన అలవాటును పెంపొందించడానికి నిత్య పుస్తక కానుక ఉద్యమం నేటి డిజిటల్ యుగంలో, యువతరం మొబైల్ స్క్రీన్‌లకే పరిమితమవుతున్న తరుణంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఒక కీలకమైన పుస్తక పఠన ఉద్యమాన్ని చేపట్టింది. విద్యా ర్థులు తిరిగి పుస్తకాల ప్రపంచానికి మళ్లేలా ప్రోత్సహించడమే ఈ మిషన్ లక్ష్యం అని విశ్రాంత ప్రిన్సిపాల్ ఫౌండేషన్ సిఈఓ ఎం.వి గోనారెడ్డి అన్నారు. పట్టణంలో ఫౌండేషన్ ఈ మిషన్‌లో భాగంగా ప్రతిరోజూ విద్యార్థు లకు ముఖ్యమైన విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. పిల్లలు, యువతలో విశ్లేషణాత్మక ఆలోచన,భాషా నైపుణ్యాలు,విస్తృత జ్ఞానాన్ని పెంపొందించడానికి పుస్తకాలు అత్యంత శక్తివంతమైన సాధనాలని ఉద్ఘాటిం చారు. డిజిటల్ సమాచార సునామీ మధ్య, స్థిరమైన, లోతైన జ్ఞానా న్ని అందించే పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి, ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని ఫౌండేషన్ విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఫౌండేషన్ రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన పఠన సంస్కృతిని అందించి,వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుం దని పేర్కొన్నారు.

## ఈనెల 8న సదర్ సమ్మేళనం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈనెల 8న శనివారం సాయంత్రం 6 గంట లకు భువనగిరి జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న సదర్ సమ్మేళన కార్యక్రమానికి జిల్లా యాదవ సంఘం నాయకులు యాదవ యువత ప్రతి ఒక్కరు యాదవ కుల బంధువులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాల్సిందిగా శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు పుట్టా వీరేశం యాదవ్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట మండలంలో యాదవ సంఘం ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముఖ్యర్ల సతీష్ యాదవ్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే గణంగా రెండో సారి నిర్వహించే సదరు సమ్మేళన కార్యక్రమానికి యాదవ కుల బంధువులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయా ల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రిష్ణ యాదవ సంఘం నాయకులు గుండబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, ఆవుశేటీ రమేష్ యాదవ్, పర్వతం రంజిత్ యాదవ్, ఆఖిల బారతయాదవ మహసభ యాద గిరిగుట్ట మండల అధ్యక్షుడు పసుల బాలయ్య యాదవ్, నియోజకవర్గం అద్యక్షుడు ఆకుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గొడుగులు పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్) :** మలిదశ తెలంగాణా ఉద్యమ నేత,ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు యార శ్రీను,లలిత దంపతుల ప్రథమ పుత్రుడు జన్మదినం సందర్భంగా గొడుగులు అందజేశారు. బుధవారం చందంపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి రోజు పాఠశాలకు వచ్చి క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాథనోపాధ్యయులు కనుకుంట్ల నావిన్ రెడ్డి ,ఉపాధ్యాయులు వి బాలాజీ,ఆదిత్య, శ్రీహరి,తల్లి దండ్రులు,అంగన్వాడీ టీచర్ రమణ,గ్రామ పెద్దలు వెంకన్న, సురేష్ గుప్త పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ



**ప్రజాపక్షం/హాలియా:** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి జీవితానికి ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని హాలియా ఎస్సై బండి సాయి ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మదారి గూడెం గ్రామంలో జూనియర్ కబడ్డీ బాల,బాలికల జిల్లా జట్టు ఎంపిక లో భాగంగా జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్ఐ సాయి ప్రశాంత్ మాట్లాడారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల ఊబిలో కూరుకుపోతే యువతకు భవిష్యత్తు ఉండదని ఆయన చెప్పారు. మత్తు పదా ర్థాలు మనిషిని ఆకట్టుకుంటాయని వాటికి దూరంగా ఉండేందుకు యువత ఉన్నత లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. ఒక లక్ష్యం లేని జీవితం వృధా అని అందుకు తగ్గట్టుగా యువత మనిషి భవిష్యత్తుకు ఉపయోగపడే లక్ష్యా లను ఎంచుకొని దానికి అనుగుణంగా సాధన చేయాలని సూచించారు. ప్రధా నంగా యువ క్రీడాకారులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే శారీరక ఫిట్నెస్ బాగుంటుందని దానివలన క్రీడల్లో రాణిస్తారని చెప్పారు. ఈ కార్యక్ర మంలో చందంపేట ఎస్ఐ లోకేష్,జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భూలోకరావు,రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ నాయకులు ముచ్చర్ల ఏడుకొం డలు,జిల్లా కబడ్డీ కార్యదర్శి కర్తయ్య, జాయింట్ సెక్రెటరీ డోమినిక్,వీరా సింగ్,ఎడవల్లి రాంబాబు, ఎడవల్లి యల్లయ్య,కోచ్ అన్వర్ ఖాన్,ఉదయ రాజ్,సత్యనారాయణ పాల్గొన్నారు.

## 'చెకుముకి'తో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిం చడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి కె అశోక్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్ళ మూడి రమేష్ బాబుతో కలిసి చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రి కను ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 7వ తేదీన పాఠశాల స్థాయి చెకు ముకి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 12వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్న ఈ పరీక్ష విజయవంతానికి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు. గత సంవత్సరం నిర్వహించిన పోటీలలో రాణించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి తమ సత్తాచాటారని గుర్తు చేశారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వనమాల వెంకటేశ్వర్లు, తల్లాడ రామచంద్రయ్య, వల్లపట్ల దయానంద్, సోమ సురేష్, క్రాంతి కుమార్, సునీత, ఉపేందర్ పాల్గొన్నారు.



## యాదాద్రి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందడి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి క్షేత్రంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. స్వామి వారి క్షేత్రంలోని ఆలయ మాడా వీధులు పూర్తిగా కార్తీక పూజలు నిర్వహించే భక్తులతో పెద్ద ఎత్తున సంద డిగా మారాయి. ఈ సందర్భంగా వ్రత మండ పంలో భక్తులు సత్యనారాయణ స్వామికి పూజలు నిర్వహించారు. దీపారాధన మండపంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక పూజలు జరి పించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివ చ్చారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, నిజాభి షేకం, కార్తీక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పండగ నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి క్షేత్రానికి పోటెత్తారు. దీంతో ఆలయ మాడవీధులు, శివాలయం, వ్రత మండపాలు, కార్తీక దీపారాధన ప్రదేశాలు భక్తు లతో కిటకిటలాడాయి.



## శ్రీచైతన్య పాఠశాలపై కఠిన చర్యలకు డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** శ్రీచైతన్య పాఠ శాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధ వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ఎదురుగా విద్యార్థి సంఘాల నాయ కులు ధర్నా చేపట్టి మాట్లాడారు. పాఠశాల సెలవు రోజులలో కూడా విద్యార్థులకు సెలవు ఇవ్వ కుండా పాఠశాలను నడుపుతుందని అట్టి పాఠ శాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు ఎటు వంటి నోటీసులు ఇవ్వకుండానే గుర్తిం పు రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఎల్‌హెచ్‌పిఎస్ సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా రాజు నాయక్, బిసి సంఘం జిల్లా ఉపా ధ్యక్షులు పోలోజు మహేష్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్య క్షులు ధనియాకుల శ్రీకాంత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖిల్ పాల్గొన్నారు.



క్రీడ




# ప్రధానిని కలిసిన భారతజట్టు

## మహిళల ఛాంపియన్లను అభినందించిన మోదీ

చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు మంగళవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు ఆదివారం దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐసిసి ట్రోఫీని నెగ్గింది. 52 సంవత్సరాల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీని గెలుచుకున్నందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టును ప్రధాని మోదీ అభినందించారు. వరుసగా మూడు పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్న తర్వాత టోర్నీలో అద్భుతమైన పునరాగమనం చేసి టైటిల్‌ను సాధించడంపై ప్రధాని ప్రశంసించారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత మహిళా జట్టుకు హోటల్‌లో డ్రమ్స్, పూలతో ఘన స్వాగతం లభించింది. ప్లేయర్లు, కోచ్ అమోల్ మజుందార్ కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ప్రధాన మంత్రి మోదీ జట్టును అభినందించారు. భారత క్రికెట్ ఈ చారిత్రాత్మక క్షణం కలల విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ప్రధానికి 'నమో' అని ఉన్న జెర్సీని అందజేశారు.





ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ వర్తమానంలో ఎప్పుడూ ఎలా ఉండగలుగుతున్నారు అంటూ ప్రధానమంత్రిని ప్రశ్నించారు. అలా ఉండటం తన జీవితంలో ఒక భాగమైందని, అది తనకు అలవాటుగా మారిందని ప్రధానమంత్రి తెలిపారు. 2021లో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్లీన్ క్యాచ్‌ను కూడా ప్రధాని గుర్తు చేశారు. ఆ సమయంలో ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫైనల్ మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ బంతిని ఎలా జేబులో వేసుకుందో ప్రధాని చర్చించారు. బంతి తన వద్దకు రావడం తన అదృష్టమని, దాన్ని తాను కాపాడుకున్నానని చెప్పింది. అమంజోత్ కౌర్ క్యాచ్‌పై ప్రధాని చర్చించారు.

ఇది తాను చూడటానికి ఇష్టపడే ఒక తడబాటని చెప్పింది. క్యాచ్ పట్టుకుంటూ మీరు బంతిని చూస్తుండాలి.. కానీ క్యాచ్ తర్వాత మీరు ట్రోఫీని చూస్తుండాలని ప్రధాని పేర్కొన్నారు. తన సోదరుడు ప్రధానమంత్రికి ఎంత పెద్ద అభిమాని అని క్రాంతి గౌడ్ చెప్పగా.. దానికి వెంటనే కలవమని చెప్పారు. ఫిట్ ఇండియా సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని క్రికెటర్లను ప్రధాని కోరారు. పెరుగుతున్న ఊబకాయం సమస్య గురించి ఆయన చర్చించారు. పాఠశాలలకు వెళ్లి అక్కడి యువతను ప్రోత్సహించాలని కోరారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మాట్లాడుతూ ప్రధానమంత్రి తమను ప్రేరేపించారని, తమకు ప్రేరణగా నిలిచారని తెలిపింది. నేడు అమ్మాయిలు అన్ని రంగాల్లో ఎలా బాగా రాణిస్తున్నారని.. దీనికి ప్రధానమంత్రి కారణమని.. ప్రధానిని కలవడానికి తాను చాలా కాలంగా ఎదురు చూస్తున్నానని దీప్తిశర్మ చెప్పుకొచ్చింది.

## టీమిండియా వరల్డ్ క్లాస్ టీమ్..


### ప్రపంచ కప్ గెలవడానికి అర్హులు

### న్యూజిలాండ్ ప్రధాని



మహిళల వన్డే ప్రపంచ కప్ సాధించిన భారత జట్టును న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లుక్సాన్ అభినందించారు. న్యూజిలాండ్ ఉమెన్స్ టీమ్ టైటిల్‌ను గెల్చుకోలేకపోయినందున భారత్ ప్రపంచ కప్ గెలవాలని తాను కోరుకున్నానని లుక్సాన్ అన్నారు. ముఖ్యంగా సెమీ ఫైనల్‌లో కఠినమైన ప్రత్యర్థి ఆస్ట్రేలియాను టీమ్‌ఇండియా మట్టికరిపించడం తనకెంతో నచ్చిందన్నారు. 'భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హైలైట్స్ నేను చూశాను. ఛాంపియన్‌గా నిలిచిన టీమ్‌ఇండియాకు అభినందనలు. భారత్ ప్రపంచ స్థాయి జట్టు. వారి ఆటతీరు అద్భుతం. వరల్డ్ కప్ గెలవడానికి అర్హులు. న్యూజిలాండ్ గెలిస్తే బాగుండేది. అయినప్పటికీ మా జట్టు ప్రదర్శన పట్ల గర్వపడుతున్నాం. ఆస్ట్రేలియాను ఏ జట్టు ఓడించినా మేం సంతోషిస్తాం. భారత్ ఈ విషయంలో ముందుంటుంది' అని లుక్సాన్ పేర్కొన్నారు. తాజాగా ముగిసిన ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 53 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. టోర్నీలో కివీస్ ఏడు మ్యాచ్‌ల్లో నాలుగే పాయింట్లు సాధించి లీగ్ దశకే పరిమితమైంది. 2025కు ముందు ఆస్ట్రేలియా ఏడుసార్లు, ఇంగ్లాండ్ నాలుగుసార్లు, న్యూజిలాండ్ ఒకసారి వరల్డ్ కప్ సాధించాయి. ఇటీవల ముగిసిన టోర్నీలో టీమ్‌ఇండియా ఛాంపియన్‌గా నిలిచి ప్రపంచ కప్ సాధించిన నాలుగో దేశంగా నిలిచింది.

ఫోకస్






## పెద్ద చరిత్ర!

సెర్బియాలోని డన్యూబ్ నదీ తీర ప్రాంతాలలో బయటపడిన ఈ మట్టి బొమ్మ చిన్నదే కావచ్చు. కానీ, చరిత్ర క్రమాన్ని వివరించే పెద్ద కథ దీని వెనక ఉంది. మానవుడు ఆధునికతను సంతరించుకుంటూ ఎదుగుతున్న వైనాన్ని ఈ బొమ్మ ప్రతిబింబిస్తుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, ఇది సుమారుగా క్రీస్తు పూర్వం 1,500 క్రితం నాటిది. రథంలో ఒక మనిషి కూర్చున్నట్టు కనిపించే దీని చరిత్ర కాంస్య యుగానికి సంబంధించినదై ఉండవచ్చు. పురాతన డుబోవాక్‌జుటో బర్డో సంస్కృతి చెందిన మట్టి బొమ్మ శక్తివంతమైన ప్రయాణానికి చిహ్నం. అభివృద్ధికి సూచిక. ఈ విగ్రహంపై కనిపిస్తున్న స్వస్తిక్ చిహ్నం మతానికిగానీ, సిద్ధాంతానికిగానీ సంబంధించినది కాదు. అది ఆ నాటి ప్రేమతత్వానికి నిదర్శనం. నాటి సంస్కృతిలో సూర్యుని, ఆవృత చక్రాల పునరావృతానికి నిదర్శనంగా రథం భాసిల్లుతున్నది. జీవన సమతుల్యతకు అద్దం పడుతుంది. సాధారణ యూరోపియన్ సమాజాల ఆధ్యాత్మిక నమ్మకాలు, కళా వ్యక్తీకరణ, ప్రపంచ దృక్పథాలను డుబోవాక్ జుటో బర్డో సంస్కృతి బాగా ప్రతిబింబిస్తుంది. అందుకు నిదర్శనంగా పరిశోధకులు ఈ బొమ్మను పేర్కొంటున్నారు. నాటి ప్రజల ఆధ్యాత్మిక భావనలను, సాంస్కృతిక విలువలను కూడా ఇది వివరిస్తున్నది. మొత్తానికి, ఈ చిన్న మట్టి విగ్రహం బ్రోంజ్ యుగాన్నటి యూరోప్ ప్రజల ఆధ్యాత్మిక ప్రపంచానికి, జీవన తత్వాలకు ఒక అద్భుతమైన ప్రతీకగా నిలుస్తోంది.



## శతాబ్దాల క్రితమే భూకంపాలను గుర్తించే పరికరం!

చైనా గణిత శాస్త్రవేత్త, ఆవిష్కర్త జాంగ్ హెంగ్ క్రీస్తు శకం 132లో ఒక అద్భుతమైన పరికరాన్ని రూపొందించాడు. ఇది కొన్ని వందల మైళ్ళ దూరంలో సంభవించే భూకంపాలను కనుగొనగల సామర్థ్యం కలిగి ఉండేది. ఈ ఆవిష్కరణ ఆధునిక భూకంప సాధనాల ఆవిష్కారానికి ముందే, నాటి తరం కనబరచిన అద్భుతమైన శాస్త్రీయ విజ్ఞానానికి నిదర్శనం. ఈ యంత్రం బాండ్లతో నిండి ఉండే నిర్మాణాన్ని కలిగి ఉంది. పెద్ద ఇత్తడి పాత్రని రూపొందించి, దాని చుట్టూ ఎనిమిది డ్రాగన్ తలలను అమర్చారు. ప్రతి డ్రాగన్ తలలో ఒక చిన్న బంతి వంటి వస్తువును పెట్టారు. భూకంపం సంభవిస్తే, సంబంధిత దిశలో ఉన్న డ్రాగన్ తల బంతిని బయటకు తీస్తుంది. అది పక్కన ఉన్న కప్ప నోటిలో పడుతుంది. ఇలా, బంతి పడిన దిశ ఆధారంగా భూకంపం ఏ వైపునుంచి వచ్చిందో గుర్తించేవారు. ఈ పరికరం అకాల భూకంపాలను తెలుసుకునేందుకు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉపయోగించబడింది. విజ్ఞాన పరంగా, ఇది ప్రపంచంలోనే మొదటి భూకంప గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం. అప్పట్లో భూమి వ్యవహారాలు, ప్రకృతి వైపరీత్యాల గురించి బయట ప్రపంచానికి అంత సమాచారం లేకపోయినా, చైనాకు సంబంధించిన పురాతన విజ్ఞానాన్ని ఈ పరికరం చాటిచెప్పింది. ఆ రోజుల్లోనే ఇలా భూకంపాలను ముందుగానే గుర్తించగల పరికరాన్ని రూపొందించడం జాంగ్ హెంగ్ యొక్క శాస్త్రీయ నైపుణ్యం, చైనీయుల ఇంజనీరింగ్ సంప్రదాయాలు ఎంత అభివృద్ధిలో ఉన్నాయో చెప్పే ఒక గొప్ప ఉదాహరణ. అంతేకాకుండా, ఇది ఆధునిక సైస్మోగ్రాఫ్ పరికరాల అభివృద్ధికి స్ఫూర్తి కలిగించింది. ఇవన్నీ చైనా పురాతన విజ్ఞానపరంపరలో ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తున్నాయి.

## జంతువులతో మనిషి మమేకం!

ఒకప్పుడు జంతువులతో మనిషి మమేకమయ్యాడు. క్రమంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, జీవకారుణ్యాన్ని మరిచాడు. తన స్వార్థం కోసం జంతుజాలాన్ని విచక్షణారహితంగా హతమార్చడం మొదలు పెట్టాడు. ఫలితంగా వేలాది జీవరాశులు కనుమరుగైపోయాయి. మరెన్నో ఉనికిని కోల్పోయే ప్రమాదం అంచున ఉన్నాయి. సరైన చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. తీర్మానాలు కాగితాల్లో మూలుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనైనా, మన పూర్వీకుల గురించి, వారికి జంతువులతో ఉన్న సంబంధం గురించి తెలుసుకోవడం అత్యవసరం. మనిషికి, జంతువుకీ మధ్య విడదీయరాని అనుబంధం ఉందని నిరూపించే ఈ అద్వితీయ శిల్పం మెక్సికోలోని వెరాక్రుజ్ ప్రాంతానికి చెందినది. పరిశోధకుల అంచనా ప్రకారం ఇది క్రీస్తు శకం 400–800 మధ్యకాలం నాటిది. ఇందులో ఒక మనిషి తలపై తోడేలును పోలిన మాస్క్‌ను ధరించడాన్ని గమనించవచ్చు. అది అతని వేట సామర్థ్యానికి, పరాక్రమానికి చిహ్నం. ఇక పక్కనే ఉన్న శునకం తన యజమాని కోసం ఏ క్షణమైనా పోరాటానికి సిద్ధంగా ఉన్నట్టు, అప్రమత్తమై ఉంది. ఈ శిల్పం వెరాక్రుజ్ ప్రాంతాల్లోని ప్రాచీన సంస్కృతుల ఆచారాలను, మానవులు–జంతువుల సంబంధాలను, ఆధ్యాత్మిక నమ్మకాలను ప్రతిఫలించవచ్చని నిపుణులు అంటున్నారు. ఆ పురుషుడు శక్తి, రక్షణ లేదా ప్రకృతి, అదృశ్య ప్రపంచానికి అనుసంధానం కలిగి ఉన్నవాడని చెప్పడానికి అతను ధరించిన మాస్క్ ఓ సంకేతం. శునకాలు విశ్వాసం, వేట, లేదా ఆచార కార్యక్రమాలలో సహకారాన్ని సూచిస్తున్నాయి. మిసో అమెరికన్ నాగరికతల్లో శునకాలు మృతుల ఆత్మను లోకాంతర యాత్రలో మార్గనిర్దేశించేవి అన్న విశ్వాసం చాలామందిలో ఉండేది. ఈ శిల్ప కళాఖండాన్ని ప్రస్తుతం బెల్జియంలోని మ్యూజియం ఆన్ డె స్ట్రూమ్ (ఎంఎఎస్), ఆంట్వెర్ప్‌లో భద్రంగా ఉంచారు. వెరాక్రుజ్ ప్రాంతం ప్రీకోలంబియన్ కళా, సాంస్కృతిక సంపదను పరిశీలించేందుకు సందర్శకులకు అవకాశం ఇస్తున్నది. దీని శిల్పకళా నైపుణ్యం, సంకేత పరమైన అర్థాలను, మిసోఅమెరికన్ నాగరికతల ఆధ్యాత్మిక–సామాజిక జీవనాన్ని మనకు తెలియచేస్తున్నాయి.



## భారత గడ్డపై వందేళ్ళ చరిత్ర సిపిఐదే

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత గడ్డపై సిపిఐది వందేళ్ళ చరిత్ర అని, వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా ఈనెల 18,19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్ జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. బుధవారం బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ ప్రజా సంఘాల సమావేశం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి హాజరై మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి పోరాడిన చరిత్ర సిపిఐది అని, భారత దేశ గడ్డపై 100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించినటువంటి పార్టీ సిపిఐ అని, స్వాతంత్ర్యం అనంతరం అంతరాలు లేని సమాజం కోసం, భూ సంస్కరణలు అమలు కోసం, పీడిత తాడిత ప్రజలకు అండగా వెట్టి చాకిరి విముక్తికై, బానిసత్వానికి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, ఇందుకోసం ప్రతి ప్రజా సంఘం నడుం బిగించాలని చెప్పారు.ఈ బస్ జాత నవంబర్ 18 తేదీన బీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరుకు చేరుకొని 19వ తేదీన పరకాలలో ముగించుకొని భూపాల పల్లి జిల్లాకు వెళ్లనని అన్నారు. ఈ బస్ జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్ ఎ స్టాలిన్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టపాక రవి, వేల్పుల సారంగపాణి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర భారత గడ్డ పైన సిపిఐ వందేళ్ల శతాబ్ధి ఉత్సవాలు

## బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహించబోయే బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సరూర్‌నగర్ మండల భగత్‌సింగ్‌నగర్‌లో గ్యార క్రాంతికుమార్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలుతో కలిసి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడు తూ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో నిర్వహించబోయే సభకు 40దేశాల ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సభను సరూర్‌నగర్ మండలంలోని కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఖమ్మం బయలుదేరి విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరిపైన ఉందని ఇప్పటి నుండే కార్యాచరణ ముందుకు సాగాలని బస్తి, కాలనీ శాఖల్లో సమావేశాలు, సెమినార్లు నిర్వహించి సభ విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురా లు, మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఫైమిదా, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపాల్, సరూర్‌నగర్ మండల కార్యధర్శి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు

- డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ శాతాబ్ది బహిరంగ సభను జయప్రదం చేయాలి
- యుద్ధ ప్రాతిపదికన తడిసిన ధాన్యం,పత్తిని మద్దతు ధరతోనే కొనుగోలు చేయాలి
- కపాస్ కిసాన్ యాప్‌లో పత్తిని ఎకరాకు ఏడు క్వింటాల పరిమితిని సడలించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ(నకేరేకల్) :** ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. సిపిఐ నకేరేకల్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం స్థానిక గుడిపాటి పంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. సమావేశానికి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సిపిఐ100 సంవత్సరాల ప్రస్థానంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించిందని, దేశ స్వతంత్ర పోరాటంలో అగ్రభాగం నిలిచిందని, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమి కొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదే అన్నారు. రాష్ట్రంలో మొంథా తుఫాన్ ప్రభావంతో ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి, వరి పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్‌తో పూర్తిగా నీటిలో మునిగిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. తడిసినటువంటి వరి ధాన్యం, పత్తిని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతోనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను కోరారు. కపాస్ కిసాన్ యాప్‌లో ఎకరాకు ఏడు క్వింటాల పరిమితి కేవలం మధ్య దళారులకు లాభం చేకూర్చేందుకే కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. నల్లగొండ జిల్లాలో నల్లరేగడి భూములు ఏక్కవగా ఉనందున్న రైతులు వరి పంట తరువాత పత్తిపంట సాగునే చేస్తారుఅని దిగుబడి కూడ ఎకరానికి సూమరు 12 నుంచి 15క్వింటాలకు పైగానే దిగుబడి వస్తున్న విషయాన్ని సిసిఐ అధికారులు గుర్తించాలని తెలిపారు. ఇప్పటికైన ఏడు క్వింటాల పరిమితిని ఎత్తివేసి యధావిధిగా12 క్వింటాలు పత్తిని దిగుమతి చేసుకునేలా నిబంధనలు సడలించాలన్నారు. 8 నుంచి12 శాతం ఉన్న నిబంధనను ఎత్తివేసి 20 శాతం వరకు పెంచాలన్నారు.నియోజకవర్గంలోని బి వెల్లంల,ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తి చేయడానికి నిధులు కేటాయించి త్వరితరగతిన పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశానికి గౌని లక్ష్మీనర్సయ్య అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్,గీత పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి బోడిగె సైదులు,శాంతి జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, సిపిఐ నార్కట్‌పల్లి మండల కార్యదర్శి పెండల శంకర్, చిట్యాల మండల కార్యదర్శి, ఎండి అక్బర్, నకేరేకల్ పట్టణ కార్యదర్శి పాల్వాయి విద్యాసాగర్,జిల్లా సత్యం, వెంపటి శ్రీనివాస్, ఎస్‌కె షరీఫ్, తీగల మల్లా రెడ్డి, బోడ మలేష్,జె జంగయ్య,వంగల నాగయ్య,అలకుంట్ల నర్సింహా,దుబ్బ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



## రాజీలేని పోరాటాలు

### యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి ధ్యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/మోత్కూర్ :** డిసెంబర్ 26న ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల భారత స్థాయి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యదర్శి ధ్యానాల దామోదర్ రెడ్డి కోరారు. సిపిఐ కార్యాలయం (కె.ఆర్ భవన్) లో బుధవారం పెండెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సిపిఐ మోత్కూరు మండల కౌన్సిల్ సమావేశంకు ముఖ్యఅతిథిగా దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత గడ్డపై 100 ఏళ్ళు పూర్తి చేసుకుంటుందని వెట్టి చాకిరి విముక్తి కోసం కార్మికులను కర్షకులను పెట్టుబడుదారుల వ్యవస్థనుండి విముక్తి కల్పించడానికి నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐకి దక్కిందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన 100 సంవత్సరాల ముగింపు సభను డిసెంబర్ 26న ఖ మ్మం జిల్లాలో జరిగే బహిరంగ సభలో లక్షలాది మంది పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ మోత్కూర్ మం డల కార్యదర్శి అన్నెపు వెంకట్ మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు జాత ఈ నెల 21న మోత్కూర్ వస్తున్న సందర్భంగా బస్సు జాతకు మోత్కూర్ మండలంలో అధిక సంఖ్యలో పాల్గొని జాతకు స్వాగతం పలకాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మండలంలో అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఇటీవల కురిసిన వర్షాల్లో నష్టపోయిన రైతులకు, కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం చెల్లించి వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో గీతా పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండ లి జిల్లా అధ్యక్షులు భూష్పాక నరసింహ, సిపిఐ మోత్కూరు మండల స హాయ కార్యదర్శి పులకరం మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జిట్టా రాములు, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిని ఉప్పలయ్య, పొడిచేడు, కొండగడప తదితరులు పాల్గొన్నారు.



## శ్రమ జీవుల విరాళం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సిపిఐ శత వసంతాల ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభ, ఉత్సవాల జయప్రదం కోసం అన్ని వర్గాల నుండి సంపూర్ణ సహకారం అందుతోందని, ఉత్సవాల జయప్రదానికి తాము సైతం అంటూ పట్టణంలోని పెద్ద బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ శ్రమ ఫలితం నుంచి కూడబెట్టిన రూ.100,116లను బుధవారం కార్మిక అడ్డాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అందించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు, కర్షకులు, పేద వర్గాల జెండా ఎర్రజెండా అని, వందేళ్లుగా ఎర్రజెండాను మోస్తూ తమ సమస్యల పరిష్కారం కోసం అలు పెరగని పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామికుల ఎర్రజెండా మరింత ఎరుపెక్కించి బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజా వ్యతిరేక పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగరంలో ఐదు లక్షల మందితో జరిగే బహిరంగ సభ, ఉత్సవాలను జయప్రథం చేసేందుకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు కదలాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అకాలవర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేల చొప్పున అందజేయాలని సిపిఐజిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం తాడూరు మండలంలోని భలాన్‌పల్లి, ఐతోల్, పాపకల్, ఇంద్రకల్, సిర్సవాడ, ఏటిదారిపల్లి గ్రామాలలో సిపిఐ జిల్లా బృందం పర్యటించి తాడూరు మండలంలోని ఆ యా గ్రామాలలో మూడురోజులుగా కురుస్తున్న అకాలవర్షానికి తడిచిముద్దయిన పత్తిచేను నేలకు ఒరిగిన వరిచేలు వేల ఎకరాలపంట నీటమునిగి రైతులు పంటలు నష్టపోయి తీవ్రవేదనకు గురయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఐమండల తాడూరు సహాయకార్యదర్శి దాంగట్ల వెంకటస్వామి, భలాన్‌పల్లి గ్రామశాఖ కార్యదర్శి రవి, సిపిఐజిల్లా కౌన్సిల్‌సభ్యులు బండిలక్ష్మి పతి, శివశంకర్, సిపిఐగ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల దోపిడీలు ఖండిస్తూ 15న బస్సు యాత్ర

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కళాభవన్‌లో బుధవారం జిల్లా విస్తృ స్థాయి సమావేశం కౌన్సిల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.వెంకటేష్ అధ్యక్షత సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహా హాజరై సమావేశానికి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ, సిపిఐ భారత గడ్డపై పుట్టి వంద సంవత్సరాలు అవుతున్నది. 1925న డిసెంబర్ 26 కాన్పూర్ పురుడు పోసుకున్నది. భారత కమ్యునిస్టు పార్టీ భారత గడ్డపైన వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. భారతదేశంలోని స్వాతంత్ర కావాలని, గర్జించిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు అన్నారు. డిసెంబర్ 26 న ఖమ్మంలో జరగబోయే శతాబ్ది వందేళ్ళ ఉత్సవాలు విజయవంతం చేయగలరని నారాయణపేట జిల్లా ఇంటికి ఒక్కొక్కరు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలి అన్నారు. అదేవిధంగా వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఉత్సవాలను పోరాటాలను త్యాగాలను గుర్తు చేసుకుంటూ పాలకుల దోపిడీలు ఖండిస్తూ ఈనెల 15వ తేదీన గద్వాలలో బస్సు యాత్రప్రారంభమై వనపర్తి, నారాయణపేట జిల్లాకి 16 వ తేదీన జిల్లా మీదుగా ఖమ్మంకి బయలుదేరుతుంది. ఇటీవల మొత్తం తుఫాను వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు 30000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి టి.నరసింహా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. సంతోష్, ఎస్. వెంకటేష్, డి.చెన్నయ్య, వెంకటయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## జాప్యం లేకుండా పనులు పూర్తి : కార్పొరేటర్ ప్రభుదాస్



ప్రజాపక్షం/కాప్రా : నిర్ణీత వ్యవధిలో నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలం టూ హెచ్‌బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని తిరుమలనగర్ కాలనీ లో జరుగుతున్న సిసి రోడ్డు పనులను ఆయన జిహెచ్ఎంసి అధికారులతో కల్సి పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సిసి రోడ్డు పనులు పూర్తవటంలో జాప్యం జరిగితే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తూ ఈ విషయాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాపక్షం/ఉప్పల్: తెలంగాణ ఉద్యమకారుడు, బిసి జెఎసి నేత నెర్థం భాస్కర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం నోవా బ్యాంకెట్ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నెర్థం బాలయ్య భాగ్యలక్ష్మి సేవా ట్రస్టు చైర్మన్ భాస్కర్ గౌడ్, డా॥ మనుషా గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 2,000 మంది ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేసుకున్నారు. అవసరమైన వారికి అవసరమైన కళ్ళద్దాలు కూడా అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ నేతలతో పాటు, వివిధ కుల సంఘాల, బిసి పొలిటికల్ జెఎసి, ఆటో, ట్రాలీ యూనియన్ నాయకులు, తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జెల సత్యరాజ్ గౌడ్, అంబటి జగదీష్ ముదిరాజ్, ఆకిటి బాల్ రెడ్డి, దుర్గయ్య,తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇచ్చి యువకుడిపై లైంగిక వేధింపులు, హత్య : నిందితుల అరెస్టు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : లిఫ్ట్ ఇస్తామంటూ కారులో తీసుకొని వెళ్లిన ఓ యువకుడిపై మద్యం సేవించిన మైనర్ బాలుడితో పాటు మరో ముగ్గురు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడి హతమార్చిన ఉదంతంలో నిందితులను నాచారం పోలీసులు అరెస్టు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ కళ్యాణపురి ప్రాంతంలో ఉంటూ పెయింటర్‌గా జీవనం గడుపుతున్న 45 ఏళ్ల ఓ యువకుడు గత ఆదివారం రాత్రి సరూర్‌నగర్ జిల్లెలగూడలోని సోదరుడి ఇంటికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లేందుకు అర్థరాత్రి దాటాక ఎల్‌బి నగర్ వద్ద వేచి ఉన్నాడు. అదే సమయంలో నాచారం రాఘవేంద్రనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జునైద్ అలియాస్ జాఫర్ (18),



ఇందిరానగర్ నివాసి షేక్ సైఫుద్దీన్(18), కార్తికేయనగర్ నివాసి పొన్నా మణికంఠ(21), మల్లాపూర్‌లోని కెఎల్‌రెడ్డి నగర్‌కు చెందిన మైనర్ యువకుడు మద్యం సేవించి కారులో వెళుతుండగా బాధిత యువకుడు ఉప్పల్ వరకు లిఫ్ట్ కావాలంటూ అడగడంతో సరేనంటూ కారులో ఎక్కించుకొన్నారు. ఉప్పల్ రింగ్ రోడ్ వచ్చినా అతడిని కారులోంచి దిగనివ్వకుండా బెదిరిస్తూ మార్గమధ్యంలో వారంతా మద్యం మత్తులో లైంగికంగా వేధిస్తూ నాచారం పారిశ్రామికవాడలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకొని వచ్చి కత్తితో 8 కత్తి పోట్లు పొడిచి చనిపోయి ఉంటాడని భావించి అక్కడే పడేసి పరారయ్యారు. కొన ఊపిరితో ఉన్న అతడిని చూసిన స్థానికులు అందించిన సమాచారంతో నాచారం పోలీసులు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా జరిగిన విషయాన్ని పోలీసులకు చెప్పి చికిత్స పొందుతూ అదే రోజు మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని నలుగురు నిందితులను బుధవారం అరెస్టు చేసారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
### స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య


ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య అన్నారు. బుధవారం ఈడబ్ల్యూఎస్ కాలనీలో ప్రజలు ప్రతి రోజు రోడ్డు ప్రక్కన చెత్త వేస్తుంటే రోడ్డు గుండా పోయే వాహనదారులకు, ప్రజలకు దుర్వాసన వస్తుంది. అది చూసిన స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు కుంటోళ్ళ యాదయ్య చెత్త వేసే దగ్గర ఒక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఇది చూసైనా చెత్త వేయకుండా కొంతవరకు ప్రజలకు మార్పు వస్తుందని అన్నారు.ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మున్సిపల్ చెత్త ట్రాక్టర్ మీయొక్క కాలనీకి వచ్చినప్పుడు ప్రజలు అందరు చెత్తను అందులో వేయాలని ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఎలాంటి రోగాలు రాకుండా ఉంటుందని కుంటోళ్ళ యాదయ్య అన్నారు. కాలనీ ప్రజలు ఇలాంటి బోర్డుని ఏర్పాటు చేసినందుకు స్ఫూర్తి ఆర్గనైజేషన్‌కి ధన్యవాదాలు తెలిపారు.




## ఆలయాల్లో భక్తుల రద్దీ

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని పలు ఆలయాలు రాత్రి నుండి విద్యుత్ అలంకారాలతో ముస్తాబు చేశారు. తెల్లవారు జాము నుంచి మహిళలు, భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి దీపారాధన శివలింగాలకు పాలాభిషేకం చేశారు. కార్తీక పౌర్ణమి మహిళలు 365 ఒత్తులతో దీపాన్ని వెలిగించాలని, అలా చేయడం వలన శివుడుని సంవత్సరమంతా పూజించినంత పుణ్యఫలితం కలుగుతుందని, ఉసిరి చెట్టు కింద దీపాలను వెలిగిస్తే శుభ ఫలితాలు ఎదురువుతాయని భక్తుల నమ్మకం. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎన్ఎఫ్‌సి నగర్,ఎదులాబాద్,అవుషాపూర్,అంకుషాపూర్, పోచారం మున్సిపాలిటీ పలు ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కమిటీ చైర్మలు, సభ్యులు చేస్తున్నామని తెలిపారు.

## పోచమ్మ ఆలయ కమాన్ ప్రారంభం



ప్రజాపక్షం/నాగారం: కార్తీక ఫౌర్ణమిని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ, శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి, షిర్డీ సాయిబాబా,శ్రీ పోచమ్మ,శ్రీభవానీశంకరస్వామి దేవాలయంలో సుదర్శన ఆయుష్ హోమలను శ్రీ సాయి దత్త పిఠాధిపతి(సాయిధామం)శ్రీశ్రీశ్రీ స్వామి శ్రీరామనంద ప్రభుజీచే పూజలు చేశారు. అనంతరం శ్రీ పోచమ్మ దేవాలయం ఆర్చిని నిర్మాణ దాత మూడి కొండయ్య చైతన్యజ్యోతిలతో కలసి ప్రభుజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి,మాజీ కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య, దేవస్థాన కమిటీ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్‌లు ప్రారంభించారు.

### అటకెక్కిన పారిశుద్ధ్యం...
## కంపుకొడుతున్న డబుల్ బెడ్‌రూమ్ పరిసరాలు

* పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్..
* చెరువు నుంచి వస్తున్న నీటితో 'డబుల్' వాసులకు ఇబ్బందులు





ప్రజాపక్షం/శామీర్‌పేట : పేదవారి సొంతింటి కల నెరవేర్చుటకు గత ప్రభుత్వం మంజూరు చేసిన రెండు పడకల ఇళ్ల లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లో పారిశుద్ధ్యం అటకెక్కింది. మ్యాన్‌హోల్స్ నిండి పొంగి పొర్లుతు ఆ మురికి నీరు రోడ్డుపైకి వచ్చి దుర్గంధం వెదజల్లుతుంది. పారిశుద్ధ్య నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడ చూడటం లేదని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో నివసిస్తున్నవారు వాపోతున్నారు. నిర్మాణ సమయంలోనే డ్రైనేజిల్లో చేరిన మట్టి రాళ్లు తీయకపోవడంతో డ్రైనేజి నుంచి వచ్చే నీరు జామ్ అయి బయటకు వస్తున్నాయని డబుల్ వాసులు అంటున్నారు. అరకొర వసతులతో డబుల్ బెడ్‌రూమ్‌ల లబ్దిదారులకు ఇండ్లు కేటాయించార ని అనేక సమస్యలతో బాధలు పడుతున్నా పట్టించుకున్న వారే లేరని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తూంకుంట మున్సిపాలిటిలో నగరానికి చెందిన అంబర్‌పేట్, ముషీరాబాద్, సికాంద్రాబాద్ నియోజకవర్గాల్లోని ప్రజలకు తూంకుంట మున్సిపాలిటిలో 9 బ్లాకులకు గాను 1944 ప్లాట్లు నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 30 నుంచి 40 మంది కుటుంబాలకు చెందిన వారు ప్రస్తుతం నివాసం ఉంటున్నారు.

**హడావిడిగా డబుల్ ఇండ్లను ప్రారంభించి చేతులు దులుపుకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం**

తూంకుంట మున్సిపాలిటీలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇండ్లు కేటాయించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించి లబ్దిదారులకు అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్‌లలో అరకొర వసతులు కల్పించి చేతులు దులుపుకున్నారు. ఇండ్ల వెనకాల చెరువు పక్క నుంచి నాలా ఉన్న సంగతి అప్పటి అధికారులకు తెలిసినా పట్టించుకోకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో ఇటీవల వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నీట మునిగి నెల రోజుల పాటు చెరువులను తలపించేలా నీళ్లు ప్రవహించాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సంబంధించి పూర్తి వసతులు కల్పించడంలో అప్పటి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

**ఇండ్లవాసులను పీడిస్తున్న సమస్యలు :** కాగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివసిస్తున్న వారికి అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ సరిగా లేకపోవడంతో దుర్గంధంతో కూడిన నీరు రోడ్డుపైకి వచ్చి తీవ్ర దుర్గంధంతో సతమతమవుతున్నారు. పారిశుద్ధ్యం నిర్వహణ పట్ల తూంకుంట మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పాములు, విష పురుగులు రాత్రి వేళల్లో తిరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురైతున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పక్కనే పారుతున్న నాలాతో ఇండ్లలోకి నీళ్లు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ఉన్న ట్యాంకులు లీకేజి అవుతున్నాయని ప్రజలు అంటున్నారు. డబుల్ ఇండ్లలో అనేక దొంగతనాలు జరుగుతున్నాయి. లిఫ్టులు సైతం సరిగా పనిచేయ డం లేదు. ఇప్పటికైన జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డబుల్ బెడ్ రూమ్ వాసులు పేర్కొంటున్నారు.




## యాక్సిడెంట్ కేసులో బలవంతంగా డబ్బులు వసూళ్లు

ప్రజాపక్షం/ఉప్పల్ : యాక్సిడెంట్ కేసులో కారు యజమాని అయిన ఆకుల నరోత్తమరావును నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేసి 3 లక్షల 37వేల రూపాయలు బలవంతంగా వసూళ్లు చేశారని ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన ఘటన చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే ఆదివారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు అయిన ఆకుల నరోత్తమరావు మల్కాజిగిరి నుండి మోత్కూర్ వెళ్తున్న సమయంలో రాయగిరి దగ్గర ద్విచక్ర వాహనంపై వచ్చి తన కారును ఢీకొనడం తో వెంకటమ్మకు తీవ్ర గాయాలవడంతో ఉప్పల్ లోని సిటీ న్యూరో ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స నిమిత్తం 37 వేల రూపాయలు చెల్లించామని శస్త్ర చికిత్స చెయ్యాలని మరో ఆసుపత్రికి తరలించాలి అంటూ 3 లక్షల రూపాయలు వెంటనే చెల్లించాలి అని వెంకటమ్మ కుమారుడు నాగరాజు, కుటుంబ సభ్యులను బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురిచేసి బాధితులు ఎటిఎం, యుపిఐ ద్వారా 3 లక్షల రూపాయలు వసూళ్లు చేశారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట ఆటో డ్రైవర్ ఆత్మహత్య

* డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆటో స్వాధీనం చేసుకోవటమే కారణం
* పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఓ ఆటో డ్రైవర్ పోలీసులు వేధించారన్న మనస్తాపంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఉదంతమిది. కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకొన్న ఈ ఉదంతంతో ఆత్మహత్యకు పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందటంతో అతడి కుటుంబ సభ్యులు, ఆటో డ్రైవర్లు రాధికా చౌరాస్తాలో ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే...అద్దె ఆటోతో ఆటో నడిపించుకొంటూ జీవనం గడుపుతున్న జమ్మిగడ్డ ప్రాంత నివాసి సింగిరెడ్డి మీన్‌రెడ్డి(32) ఆటోలో (AP28Y1789) వెళుతుండగా కాప్రా రోడ్‌లోని కాల్ పబ్లిక్ స్కూల్ సమీపంలో మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు ఆపి పరీక్షించగా 120 రీడింగ్‌తో అధిక మోతాదుతో మద్యం సేవించినట్లు తేలింది. దీంతో అతడి ఆటోను స్వాధీనం చేసుకొన్న పోలీసులు మౌలాలిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి మరుసటి రోజు కౌన్సిలింగ్‌కు వచ్చి కోర్టులో హాజరైన అనంతరం ఆటోను తిరిగి ఇస్తామని చెప్పి పంపించేసారు. ఇంటికి వెళ్లిన అతడు అదే రోజు రాత్రి 10.30 గంటల సమయంలో



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులు స్వాధీనం చేసుకొన్న ఆటో అద్దెకు తీసుకొన్నానని, వెంటనే ఆటోను అద్దెకిచ్చిన వారికి తిరిగి ఇవ్వకపోతే తనకు ఇబ్బంది వస్తుందని, ఎలాగైనా ఆటోను వెంటనే తిరిగి ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులను బతిమిలాడాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న తనకు కాకుండా మద్యం సేవించని మరో వ్యక్తిని తీసుకొని వస్తే ఆటోను తిరిగి ఇస్తామంటూ పోలీసులు అతడికి నచ్చ చెప్పినా వినక పోగా ఆటో ఇవ్వక పోతే ఆత్మహత్య చేసుకొంటానని అన్నాడు. ఓ పక్క పోలీసులు ఆటోను ఇవ్వక పోవటం, మరో పక్క ఆటో ఎలాగైనా తీసుకొని రావాలని ఆటోను అద్దెకిచ్చిన వ్యక్తి ఒత్తిడి తేవటానికి తోడు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై కిరోసిన్ పోసుకొని పోలీస్‌స్టేషన్ ఎదుటే వెంట తెచ్చుకొన్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు.

దీంతో తీవ్రంగా కాలిన గాయాలకు గురైన విషయాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా బుధవారం మృతి చెందాడు.

**బంధువులు, ఆటో డ్రైవర్ల ఆందోళన**

ఆటో డ్రైవర్ మీన్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవటానికి ట్రాఫిక్ పోలీసుల వేధింపులే కారణమంటూ అతడి కుటుంబ సభ్యులు, ఆటో డ్రైవర్లు బుధవారం రాధికా చౌరాస్తాలో ట్రాఫిక్ పోలీసులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసుకొని చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు.

ఈ విషయం తెల్సుకున్న కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం లభించేలా చూస్తానంటూ హామీ ఇచ్చి పరిస్థితిని చక్కదిద్ది పంపేసారు.

## రోడ్డు మూసివేతతో కాలనీవాసుల ఇబ్బందులు

ప్రజాపక్షం/దమ్మాయిగూడ: కాలనీలోని రోడ్డును అక్రమంగా మూసి వేయడంతో వాహనదారులు, కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అణుశక్తి నగర్ వాటర్ ట్యాంక్ నుండి సిద్ధార్థ కాలనీకి వచ్చే ప్రధాన రహదారిని కొందరు వ్యక్తులు అక్రమంగా మూసివేయడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డును మూసివేయడంతో పిల్లలు, వృద్ధులు, ఉద్యోగాలకు వేళ్లే ప్రతి ఒక్కరూ వందల మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లవలసి వస్తుందని కాలనీవాసులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## మహిళ మృతికి కారణమైన కారు డ్రైవర్ అరెస్ట్

ప్రజాపక్షం/వికారాబాద్:నిన్న రాత్రి మద్యం సేవించి అతివేగంగా కారు ను నడిపిస్తు నలుగురికి గాయలు అవ్వడంతో పాటు ,ఒక మహిళ మృతికి కరణం అయిన ముత్తర గల్ల మహేష్ తండ్రి లక్ష్మి య్య మున్సిపల్ పరిధిలోని కొత్తగడి కి చెందినవ్యక్తి , కారు నెంబర్ టిఎస్ 34.2621కారు నడిపి వేనుక నుండి స్కుటీని బలాంగా గుద్దడంతో అక్కడిక్కడే భారతి మృతికి కరణం అయిన కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసిన జెలుకు పంపించడం జరిగింది అని సిఐ బీంకుమార్ తెలిపారు.



## అధైర్య పడొద్దు...బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

* అనాథ పిల్లలను ఆదుకుంటాం
* మృత్యుల కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: మిర్జాగూడ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలు అధైర్య పడొద్దని ప్రభుత్వం వారికి అండగా ఉండడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకుంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ళ మీర్జగూడ బస్సు ప్రమాదంలో మరణించిన తాండూరు నియోజకవర్గానికి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పరా మర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఓక్కో కుటుంబానికి రూ.7లక్షల చొప్పున పరిహారం చెక్కులను అందజేశారు. తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలని చెందిన ఖలీద్, సరిహా, జూహీరాఫాతిమా, వాల్మీకి నగర్‌కు చెందిన కిష్టాపురం వెంకటమ్మ, బృందావన్ కాలనికి చెందిన తబస్సుంజహాన్, పాతతాండూరుకు చెందిన దస్తగిరిబాబ, యాలాల మండల పరిధి హాజీపూర్ గ్రామానికి చెందిన రుకుగుంట బందెప్ప, లక్ష్మి కుటుంబాన్ని, పేర్కంపల్లి సాయిప్రియ, తనుష్క, నందిని కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

లక్ష్మి నారాయణపూర్ గ్రామానికి చెందిన అఖిలరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం తాండూరు మండల పరిధి గౌతాపూర్‌కు చెందిన ముస్కాన్ బేగం కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద భాధితులు ఎవ్వరు అధైర్య పడోద్దని ప్రభుత్వం మీకు అండగా ఉంటుందన్నారు. రాబోయే మూడు మాసాలలో తాండూరు –హైదరాబాద్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేస్తామన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఇంత మంది మరణించడం చాలా బాధారకరమని అన్నారు. ఈ దుర్ఘటన తనను ఎంతగానో కలచివేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసా ద్, ఆర్టీసి ఆర్ ఎం శ్రీలత, డిప్యూటి ఆర్ఎం సరస్వతి, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ఉత్తమ్ చంద్ రెవెన్యూ, ఆర్టీసి అధికారులు ఉన్నారు.



### తాండూరులో మరో ప్రమాదం...
## ఆటో బోల్తా...ఒకరు మృతి...మరొకరి పరిస్థితి విషమం

ప్రజాపక్షం/తాండూరు:వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. బిక్కు బిక్కు మంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. చేవేళ్ళ ఘోర రోడ్డు ప్రమాదం మరుక ముందే తాండూరులో సమీపంలో కర్నాటక ఆర్టీసి బస్సును ఢీకోట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో ఎక్కడో ఓ మూలన వరుస రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రయాణమే ఓ నరక ప్రాయంగా మారింది. జిల్లాలో రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాలకు ప్రధానంగా వాహనాల ఓవర్ లోడ్, హై స్పీడ్‌తో ఓ కారణం కాగా గోతుల మాయంగా మారిన రోడ్లు ఇందకు తోడవుతున్నాయి. ఓవర్ లోడ్‌ను కంట్రోల్ చేయాల్సిన ఆర్టిఒ, పోలీసు శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగి పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మొన్న చేవేళ్ళ మీర్జాపూర్ ఆర్టిసి బస్సు ప్రమాదంలో 19మంది మృత్యువాత మరువక ముందే, జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో ఓ కారు బీభత్సవం సృష్టించి రోడ్డు పక్కన నిల్చున్న వాహనాలను ఢీ కోట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు.





ఈ ఘటనలు మరువక ముందే తాజాగా తాండూరు మండల పరిధి చంద్రవంచ గేటు సమీపంలో ఓ ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. వివరాలోకి వెళ్ళితే బుదవారం చంద్రవంచ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయిన ఆటో బోల్తా పడింది. చంద్రవంచ గ్రామానికి చెందిన ఆటో లో చింతలకాడి దత్తు, చింతలకాడి జగదీష్, చెలక జగదీష్, కుమ్మరి కాలేషులు తాండూరుకు వెళ్ళి తిరిగి గ్రామానికి ఆటోలో వస్తున్న సమయంలో చంద్రవంచ గేటు సమీపాన కరన్ కోట్ వైపు నుండి ఎదురుగా వస్తు న్న పల్సర్ బైక్‌ను తప్పించ బోయిన ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో చింతలకాడి దత్తు (20)అక్కడికక్కడే మృతి చెందగా , తీవ్ర గాయాల పాలైన చింతలకాడి జగదీష్‌ను చికిత్స నిమిత్తం స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫర్ చేసినట్లు తెలిపారు. స్వల్పా గాయాల పాలైన చెలక జగదీష్, కుమ్మరి కాలేష్‌ను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చెయిస్తున్నారు. ఈ మేరకు కరణ్‌కోట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్లు బాగు చేయాలంటూ గ్రామస్థుల నిరసన



ప్రజాపక్షం/పెద్దేముల్: అస్తవ్యస్తంగా మారిన తాండూరుసంగారెడ్డిని మెరుగు పర్చాలని డిమాండ్ చేస్తూ పెద్దేముల్ మండల పరిది బుద్దారం గ్రామ ప్రజలు రోడ్డుపై బైటాయించిన నిరసన దిగారు. రోడ్లు పూర్తిగా పాడైన అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బుదవారం తాండూరుసంగారెడ్డి రహదారిపై బైటాయించిన బుద్దారం గ్రామ ప్రజలు వాహనాలను ఎక్కడి అక్కడ వాహనాలను ఆపి వేసిన ధర్నాకు దిగారు. గత రెండు సంవత్సరాలు బుద్దారం వాగు, గాజీపూర్ వాగులపై ఉన్న బ్రిడ్జిలు ప్రమాదకంగా మారినాయని, రోడ్డు పూర్తిగా గుంతల మాయంగా మారాయని, గాజీపూర్ బ్రిడ్జిపై బీటి రోడ్డు నిర్మిచక పోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా ప్రయాణికులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. గతుకుల మాయమైన రోడ్లుపై ప్రయాణం చేయడం ఎట్లాని ప్రశ్నించారు. ఇప్పటికైన అధికారులు, పాలకులు స్పందించిన పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## మన్సూరాబాద్‌లో ఆలయాలకు భద్రత కరువు : కొప్పుల నర్సింహా రెడ్డి

ప్రజాపక్షం/హయత్ నగర్ : మన్సూరాబాద్‌లో ఆలయాలకు భద్రత కరువైందని స్థానిక జీహెచ్ఎంసీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రసన్న ఆంజనేయ స్వామి టెంపుల్ లో మంగళవారం రాత్రి దొంగలు పడి హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఆలయ పూజారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ తలుపులు తెరిచి ఉన్నాయని గుర్తించి గుడిలోకి వచ్చి చూడగా హుండీ పగలగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీస్ లకు కంప్లైంట్ చేసినట్లు పేర్కొన్నారు.స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగితెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడి ప్రక్కన మద్యం బ్లాక్ అడ్డాను తొలగించాలని ఎన్ని సార్లు చెప్పిన పోలీసులు పట్టించుకోటవటం లేదని ఆయన ఆరోపించారు.ఈ సంఘటనకు పూర్తీ బాధ్యత పోలీసులదే అని తెలిపారు.

# బేసిక్ పోలీసింగ్‌ను మరవొద్దు

### పోలీసు వ్యవస్థ ప్రతిష్టతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

### సమీక్ష సమావేశంలో కమిషనర్ విసి సజ్జనార్



ప్రజాపక్షం/హైదరాబాద్: విధి నిర్వహణలో బేసిక్ పోలీసింగ్‌ను మరవొద్దని, కోర్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వర్తిస్తే నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ అన్నారు. పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఐసిసిసి ఆడిటోరియంలో సీనియర్ పోలీస్ అధికారులు, స్టేషన్ ఎస్‌హెచ్ఓలు సజ్జనార్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలనిర్వహణ, నేరాల నియంత్రణదర్యాప్తు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్‌టెక్నాలజీ అడాప్షన్, మానవ వనరుల నిర్వహణ, తదితర అంశాల ప్రాధాన్యతను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు ఆయన వివరిస్తూ.. దిశా నిర్దేశం చేశారు.శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతే ధ్యేయంగా మెరుగైన పోలీసింగ్ చేయాలని సూచించారు. ప్రతి పోలీస్ అధికారి కూడా 100 శాతం తమ బాధ్యతను నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. సిబ్బందిని కేవలం ఒకే పనికి పరిమితం చేయొద్దని, అన్ని విభాగాల్లోనూ ప్రావీణ్యం సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వృత్తిని, ఉద్యోగాన్ని ప్రేమిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని వివరించారు. తమ పరిధిలో జరిగే విషయాలకు ఎస్‌హెచ్‌ఓలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గతంలో కొన్ని కేసుల్లో నిర్లక్ష్యం వహించినట్లు దృష్టికి వచ్చిందని, ఆయా కేసులను మళ్లీ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. 'పోలీసింగ్ జాబ్ అనేది అనేక సవాళ్లతో కూడుకుని ఉంటుంది, వాటన్నింటిని అధిగమిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ ముందుకు వెళ్లాలి. అన్ని కేసులను రోటిన్ గా తీసుకోవద్దు. ప్రతి చిన్న నేరాన్ని కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాలి. చిన్న చిన్న నేరాలకు చెక్ పెట్టకుంటే.. భవిష్యత్‌లో అది పెద్ద నేరానికి దారి తీసే ప్రమాదం ఉంటుంది. ప్రతి కేసును సాంకేతికంగా అన్ని కోణాల్లో విశ్లేషణ చేయాలి.' అని విసి సజ్జనర్ గారు అన్నారు.దర్యాప్తును వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతికత ఏఐ వినియోగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. దేశంలోనే తెలంగాణ, హైదరాబాద్ పోలీసులకు ఒక బ్రాండ ఇమేజ్ ఉందని, దానిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు సిపి (క్రైమ్స్) ఎం. శ్రీనివాస్, జాయింట్ సిపి (కోఆర్డినేషన్ అండ్ ఆర్గ) తప్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి (అడ్మిన్) జె. పరిమళ హానా నూతన్, డిసిపి సిసిఎస్ ఎస్. శ్వేత,ఎస్‌బి డిసిపి కె. అపూర్వా రావుతో పాటు అన్ని జోన్ల డిసిపిలు, ఏసిపీలు, ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

## హిందూ సంప్రదాయాలు నేటి తరానికి ఆదర్శం : మధుయాష్కి



ప్రజాపక్షం/హయత్ నగర్: హిందూ సంప్రదాయాలు నేటి తరానికి ఆదర్శం అని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ అన్నారు. మంగళవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని హయత్ నగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో జరిగిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల పూజా కార్యక్రమానికి ఆయనముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి,గజ్జ భాస్కర్ యాదవ్,బోడ చిన్నపర్వతం,రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్,హయత్ నగర్ సిఐ పల్వ నాగరాజ్ గౌడ్,ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్ రెడ్డి,నక్క వెంకటేష్,కొండల్ రెడ్డి,చెన్నగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కార్మికులకు ఇ-శ్రామ కార్డు



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : అర్హత కలిగిన కార్మికులు ఇ-శ్రామ ఇన్సురెన్స్ కార్డులు పొందాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో అంకిత ఎన్జీవో టీం వారి తరుపున కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులను కార్పొరేటర్ లచ్చిరెడ్డి. ఎస్ఐ గౌతమ్ చేతుల మీదుగా కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు తమ రెక్కలపై కష్టపడి జీవనంను గడుపుతారని, ఏ సమయంలో ఎం జరుగుతుందని భయంతో వారు పనిచేసే పరిస్థితి ఉంటుందని వారు తెలిపారు. అర్హత కలిగిన కార్మికులు తమ కుటుంబ సభ్యులకు బరోసాగా ఇన్సూరెన్స్ కార్డులు పొందడం ద్వారా వారికి కుటుంబ సభ్యులకు బరోసా కల్పించిన వారు నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హరిహరపురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, అంకిత ఎన్జీవోస్ టీం జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మం, యూనియన్ అధ్యక్షులు నరసింహచ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయ్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని, కార్యకర్తలు ప్రణాళిక బద్ధంగా పని చేస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం యూసుఫ్ గూడ డివిజన్‌లోని కృష్ణానగర్ బి బ్లాక్‌లో నిర్వహించే ముఖ్యమంత్రి కార్నర్ మీటింగ్‌పై నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేద ప్రజలు అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఆ పథకాలతోనే కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉచిత కరంటు, పింఛన్లు, రైతు బంధు, వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా కాంగ్రెస్ అభ్యర్థి అత్యధిక మేజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో గత పాలకుల పరిపాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వాని గెలిపిస్తే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం, నేతలు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఆదిల్ హైమత్, మున్నాబాబాలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయం ఖాయం



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడం ఖాయమని టిపిసిసి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం యూసుఫ్ గుడా డివిజన్ రేహమత్‌నగర్‌లో మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ నాయకులతో కలిసి భాస్కర్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కి ఓటు వేయాలని అభ్యర్థించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఎవ్వరూ ఎన్ని కుట్రలు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే జోనల్ స్పోర్ట్స్

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విజ్జులత తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల క్యాంపస్‌కు రంగారెడ్డి, వికరాబాద్ జిల్లాల నుండి విద్యార్థులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజ్జులత మాట్లాడుతూ 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడల్లో పాల్గొనేందుకు రంగారెడ్డి, వికరాబాద్ జిల్లాల నుండి 12ఇన్స్టూట్‌ల ద్వారా సుమారు 1020మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈనెల 6,7,8వ తేదీల్లో వివిధ రంగాల క్రీడల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నట్లు వివరించారు. కమ్మదనం గురుకుల పాఠశాల క్యాంపస్‌కు వచ్చే విద్యార్థులకు అన్ని మౌళిక సౌకర్యాల ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు స్పోర్ట్స్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, అధికారులు హాజరయ్యే అవకాశం ఉంటుందని వివరించారు. 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించేందు కు ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## పార్కు స్థలం కాపాడిన హైడ్రాకు అభినందనలు

### రాఘవేంద్రకాలనీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి




ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రకాలనీ సి బ్లాక్‌లో ఉన్న కమ్యూనిటీ హాలు, పార్కు స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసి రూమ్‌లను ఏర్పాటు చేసి క్రయ, విక్రయాలు జరుపుతున్నారని రాఘవేంద్రకాలనీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైడ్రా అధికారులను కలసి తమకు జరుగుతున్న అన్యాయన్ని విన్నవించుకున్నారు. వేంటనే స్పదించిన హైడ్రా కమిషనర్ రంగనాథన్ స్థలాన్ని పరిశీలించి హైడ్రా సిబ్బందితో వచ్చి కబ్జా చేసిన 2000 గజాలు సూమారు 40 కోట్ల విలువ గల స్థలాన్ని కబ్జా కోరల నుండి విడిపించి కాలనీవాసులకు ఫెన్సింగ్ వేసి అందించినందుకు కృతజ్ఞతగా ఈ రోజు రాఘవేంద్ర కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి తమ స్థలాన్ని హైడ్రా అధికారులు కాపాడినందుకు అభినందిస్తూ కాలనీ అంత తిరుగుతూ హైడ్రా జిందాబాద్ అంటూ నినాదలు చేశారు. అనంతరం రాఘవేంద్ర కాలనీ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ హైడ్రా అధ్వర్యంలో కబ్జాలకు పాల్పడుతున్న అక్రమాలకు తగిన బుద్ధి చెప్పి పార్కు స్థలాన్ని కాపాడారని, పార్కు స్థలం చట్ట పరంగా రక్షించబడి ప్రజా ప్రయోజనాల కోరకు అభివృద్ధి చేసే వరకు తమ కృషి కొనసాగిస్తామని తెలిపారు. మున్ముందు మరిన్ని స్థలాలను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సురేందర్ రెడ్డితో పాటు ఉపాధ్యక్షురాలు రేణుక సౌజన్య, ప్రధానకార్యదర్శి వినీత సింగ్, మాజీ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాస రావు,బాల్‌రెడ్డి, సుచేత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

### కష్టపడి డబ్బులు పెట్టి కొన్నాము, అన్యాయం చేయకండి : బాధితులు.

రాఘవేంద్ర కాలనీలో ఇక్కడ మేము డబ్బులు పెట్టి స్థలాలు కొన్నామని 2000 గజాలలో 10 ప్లాట్లుగా చేయగా 15 సంవత్సరాల క్రిందట 10 మంది వరకు ఇక్కడ సుమారు 200 గజాల చెప్పున ప్లాట్లు కోనుగోళ్ళు చేశామని తమను అన్యాయంగా ఇక్కడ స్థలంలో ఫెన్సింగ్ వేసి తమ పొట్ట కొడుతున్నారని ప్లాట్లు కోనుగోళ్ళు చేసి మోసపోయిన 10 మంది బాధితులు లబోదిబోమంటున్నారు. తమ కోర్టు ద్వార స్టే అర్డరు తెచ్చుకున్నామని తమకు న్యాయం జరిగే వరకు పోరడాతామని తెలిపారు.

## తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవ్ : ఎమ్మెల్యే మల్‌రెడ్డి



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యంపై తేమ పేరుతో రైతులను ఇబ్బంది పేడితే చర్యలు తప్పవని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు.బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల,ఇబ్రహీంపట్నం మండల కేంద్రాలలో ఐకెపి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతులు ఆరు కాలం పెట్టుబడి పెట్టి పండించిన పంటలు మద్య దళారుల నుండి విముక్తి కల్గించటం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు.కొనుగోలు కేంద్రాలలో వర్షాలకు వరి ధాన్యం తడువ కుండా రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించి,వరి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం తక్షణమే పరిహారం చెల్లించేటట్లు అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి,కార్యదర్శి సంతోష్ కుమార్,ఐకెపి అధికారులు,రైతులు పాల్గోన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఖచ్చితంగా గెలిచేది బిఆర్‌ఎస్‌యే



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కచ్చితంగా గెలిచేది బిఆర్‌ఎస్ పార్టీయేనని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ , శేరిలింగంపల్లి బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు. బుధవారం కొమిరిశెట్టి సాయిబాబాతో కలసి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్‌తో కలసి షేక్‌పేట్ డివిజన్ పరిధీలోని వెటర్నరీ కాలనీలో ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో లేరని, ప్రచారనికి వచ్చిన కాంగ్రెస్ నాయకులను వాళ్ళు ఇచ్చిన 420 హామీలను ప్రశ్నిస్తుండడంతో కాంగ్రెస్ మంత్రులు, నాయకులు తలలు పట్టుకొని వెనక్కి వేళ్ళిపోతునారని తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి బిఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### కర్రెడ్ల నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కేశంపేట: ఆకాల వర్షాలకు పంటలు నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆకాల వర్షాలకు దెబ్బతిన్న రైతుల పంటలను వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే గుర్తించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన అన్నదాతలకు నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఫసల్ భీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకం అమలు చేస్తే వర్షాలకు పంటలు నష్టపోయిన అన్నదాతలకు పరిహారం ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుబంధు సకాలంలో ఇవ్వకపోవడంతోనే పంటల సాగుకోసం అన్నదాతలు అప్పుల పాలు కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. అన్నదాతలు పండించే పంటలను గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అదుకునేందుకు కృషి చేయాలని, తక్షణమే రైతుబంధు నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్నదాతలతో కలిసి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## అయ్యప్ప పడి పూజలో చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు



ప్రజాపక్షం: సరూర్‌నగర్ : అధ్మాతిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కెపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, అయ్యప్ప గురు స్వామి ఎలిమినేటి సంజీవరెడ్డి నివాసంలో జరిగిన ఆయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుక దంపతులు హాజరై ఆయ్యప్ప దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాధాన్ని స్వీకరించారు.

## ఫోర్జరీ సంతకాలతో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోండి

### బిజెపి కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి

ప్రజాపక్షం/కొందుర్గు: క్రిందిస్థాయి అధికారుల పోర్జరీ సంతకాలతో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ కొందుర్గు మండల రెవిన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ క్రింది స్థాయి అధికారుల సంతకాలను పోర్జరీ చేసి అవినీతికి పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఈ అధికారిపై ఆర్‌డిఒ స్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవడం జరిగిందని, మళ్లీ అదే పని చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లోసుగులను చూసుకొని రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. రికార్డుల్లో ఉన్న తప్పులను సరి చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని, లేని పక్షంలో ఎక్కడి పనులు అక్కడే ఉంటాయని రైతులను హెచ్చరిస్తున్నారని వివరించారు. సామాన్య ప్రజలకు మండల రెవిన్యూ కార్యాలయంలో పనులు కావడం లేదని, ఫైరవీ కారులదే రాజ్యమని వాపోయారు. అధికార పార్టీ నేతల నుండి మొదలుకొని ఫైరవీ కారుల వరకు జోరు సాగుతుందని, గ్రామీణ రైతులు వస్తే నెలల తరబడి ఆఫీసుల చుట్టు తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందుర్గు డిప్యూటీ తహశీల్దార్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నా రెవిన్యూ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అన్నదాతలకు ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులకు బదిలీలు చేయకుండా రెవిన్యూ శాఖ అధికారులు మౌనం వహించడంలో అంతర్యమేమిటో చెప్పాలని పేర్కొన్నారు. రైతుల రక్తం తాగుతున్న రక్త పిశాచాల మాదిరి రెవిన్యూ శాఖ తయారైందని, డిప్యూటీ తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంతో బిజెపి ఆధ్వర్యంలో రెవిన్యూ కార్యాలయం ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్, కౌన్సిల్ సభ్యులు ఈసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## భక్తులతో కిటకిటలాడుతున్న శైవ క్షేత్రాలు

### కార్తీక పౌర్ణమి దీపాలతో కొత్త శోభ సంతరించుకున్న శివాలయాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించా రు. బుధవారం షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భక్తులు తెల్లవారు జాము నుండే శైవక్షేత్రాలకు చేరుకొని కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉత్తర రామలింగేశ్వర స్వామిగా పేరుగాంచిన రామేశ్వరంలో భక్తులు పెద్ద ఎత్తును కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారు జాము నుండే సమీపంలో ఉన్న శివాలయాలకు కుటుంబ సమేతంగా చేరుకొని పారతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, దీపారాధన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరి చెట్టు కింద ప్రత్యేకంగా తయారు చేసిన దీపాలను భక్తులు వెలిగించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించడంతో కొత్త శోభ సంతరించుకుందని చెప్పవచ్చు. అదే విధంగా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం, శివమారుతి గీతా అయ్యప్ప మందిరం, చౌదమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంతో పాటు కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్ నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు గ్రామీల్లోని దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు చేరుకొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### శంకర్‌పల్లిలో....



రంగారెడ్డి జిల్లా,శంకర్ పల్లి మండలం చందిప్ప గ్రామంలోని 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మ సూత్ర మరకత శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం నుండే స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. మరకత శివలింగ దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఆలయ నిర్వాహకులు అభిషేకాలు రద్దుచేసి, భక్తులకు నేరుగా దర్శనం కల్పించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన వితరణ చేశారు.అదేవిధంగా పల్లె శంకర్‌పల్లిలోని శ్రీ రాజరాజేశ్వర దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శివలింగానికి పూజలు, అభిషేకాలు భక్తులు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు చిన్న శంకర్ పల్లికి చెందిన డి.కృష్ణారెడ్డి దంపతులు అన్నదాన వితరణ చేశారు. శంకర్ పల్లి పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొనితులు వేకువ జామున నుండే అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు.

### దిల్‌సుఖ్‌నగర్‌లో....



కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని, దిల్‌షుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్రం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయం ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోయింది. బుధవారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివలింగ అభిషేకాలతో పాటు భ్యాచుల వారికి సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత వైభవంగా నిర్వహించారని ఆలయ కమిటీ చైర్మన్ దేవర లింగారెడ్డి, ప్రధాన కార్యధర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ లయ సంయుక్త కార్యధర్శి భాషపాక సంతోస్‌కుమార్, సభ్యులు ఎస్.ఆర్, శ్రీనివాస్, కె.ఎన్. రావు, సలహాదారులు పూర నరసింహగుప్త, మాజీ ఛైర్మన్ కుమార స్వామి, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## 'చిరంజీవ' విజయం సాధించాలి

### డైరెక్టర్ అనిల్ రావిపూడి

రాజ్ తరుణ్ హీరోగా నటించిన ఆహా ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. ఈ చిత్రంలో కుషిత కల్లపు హీరోయిన్‌గా నటించింది. స్ట్రీమ్ లైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాహుల్ అవుదొడ్డి, సుహాసిని రాహుల్ నిర్మించారు. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి చిరంజీవ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సినిమా ప్రెస్ ప్రీమియర్ షో, ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ ఈ సినిమా చాలా బాగుంది. ఈ సినిమా ఘన విజయం సాధించాలి అని అన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో రాకెట్ రాఘవ, జబర్దస్త్ రాంప్రసాద్, జబర్దస్త్ హైపర్ ఆది, ఆహా సీఈవో రవి కాంత్, ఆహా కంటెంట్ హెడ్ శ్రావణి, నటుడు సంజయ్ కృష్ణ, నటుడు కేకేటి, హీరో రాజ్ తరుణ్, ప్రొడ్యూసర్ రాహుల్ అవుదొడ్డి, డైరెక్టర్ అభినయ కృష్ణ పాల్గొన్నారు.



## 'శివ' రీ-రిలీజ్ ట్రైలర్ లాంచ్

అక్కినేని నాగార్జున ఆల్ టైం కల్ట్ క్లాసిక్ 'శివ' బాక్సాఫీసు రికార్డులని తిరగరాస్తూ ఇండియన్ సినిమాను 'బిఫోర్ శివ', 'ఆఫ్టర్ శివ'గా రిడిఫైన్ చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో 1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్, సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కె డాల్బీ అట్మాస్‌లో నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ సమక్షంలో శివ రీరిలీజ్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కింగ్ నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. అద్భుతమైన 4కె విజువల్స్, డాల్బీ అట్మాస్ సౌండ్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ప్రతి సీన్‌లో టెన్షన్, ఎమోషన్ ఆడియన్స్ ని కట్టిపడేసింది. ట్రైలర్ చివర్లో నాగార్జున సైకిల్ చైన్ లాగిన సీన్ గూస్‌బంప్స్ క్రియేట్ చేసింది. శివ మ్యూజిక్ 4కె డాల్బీ అట్మాస్ థియేటర్లలో చూడాలనే ఎక్సయిట్‌మెంట్ ట్రైలర్ మరింతగా పెంచింది.

నాగార్జున మాట్లాడుతూ.. ఎంతో ప్రేమతో వచ్చిన మీ అందరికీ థాంక్యూ. ఈ సినిమాని మీ నాన్నగారు, అమ్మగారు థియేటర్ లో చూసుంటారు. వాళ్ళందరికీ థాంక్యూ. ఇప్పుడు అదే ప్రేమతో మీరు వచ్చారు. మీకు థాంక్యూ. అందరికంటే నా మిత్రుడు రామ్ గోపాల్ వర్మకి థాంక్యూ. 36 ఏళ్ల క్రితం నాతో శివ సినిమా తీసి నన్ను పెద్ద స్టార్‌ని చేశారు. పొద్దున్నే సినిమా చూశాను స్వప్నంగా అనిపించింది.

రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. 36 ఏళ్ల క్రితం తీసిన ఈ సినిమా.. 36 ఏళ్ల తర్వాత మా ఇద్దరం కూడా ఒకే స్టేజ్‌పై ఇలా మీ ముందు రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లడతామని నేను ఎప్పుడూ కూడా ఊహించలేదు. ఇది వెరీ గ్రేట్ ఫీలింగ్. కొత్త టెక్నాలజీని ఉపయోగించాం. మీకు చాలా మంచి ఎక్స్పీరియన్స్ ఇస్తుంది. చిరంజీవి చెప్పినట్టు సినిమా ఉన్నంతవరకు శివ చిరంజీవిలా చిరస్మరణీయం.



## 'రాంబాయి నీ మీదనాకు' పాట ఆవిష్కరణ

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిల్మ్స్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా నుంచి 'రాంబాయి నీ మీద నాకు...అనే పాటను మంచు మనోజ్, భూమా మౌనిక చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ ఈటీవీ విన్ వారు చేస్తున్న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాకు అన్ని పాటలు రాయడం సంతోషంగా ఉంది. ఇది నిజంగా జరిగిన కథ. ఈ కథ గురించి తెలుసుకున్న తర్వాత రాజు.. రాంబాయి గురించి ఎలా పాట పాడతాడో రాజు పాత్రలా ఊహించి రాశాను అన్నారు.

ఈ కార్యక్రమంలో ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి, డైరెక్టర్ సాయిలు కంపాటి, హీరోయిన్ తేజస్వినీ రావ్, హీరో అఖిల్ ఉడ్డెమారి, నిర్మాత రాహుల్ మోపిదేవి, గాయకుడు నల్లగొండ నర్సన్న, మంచు మనోజ్ భార్య భూమా మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## 'రోలుగుంట సూరి' పాట విడుదల



టాలీవుడ్లో హాట్ టాపిక్‌గా మారుతూ విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న రియలిస్టిక్ ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి'. ఈ మూవీ ఫస్ట్ సాంగ్‌ను ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ లాంగ్ చేశాడు. అనిల్ కుమార్ పల్లా దర్శకత్వంలో నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరోహీరోయిన్లుగా తపస్వీ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై సౌమ్య చాందిని పల్లా నిర్మిస్తున్నారు. ఫస్ట్ సాంగ్‌ను ఆవిష్కరించిన అనంతరం మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ మంచి పాటలు ఉంటే ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి హిట్ చేస్తారు. కథతో పాటు మ్యూజిక్ కూడా బాగుంటే సినిమా బ్లాక్ బస్టర్ అయినట్టే. 'రోలుగుంట సూరి' కూడా అలాంటి సినిమా. తెలుగు ప్రేక్షకులకు బాగ నచ్చే కథతో పాటు దానికి తగ్గట్టే మ్యూజిక్ కూడా ఉంది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందన్న నమ్మకం ఉంది. చిత్రయూనిట్‌కు అభినందనలు అని అన్నారు.



## 'పెద్ది'లో చికిరి చికిరి ప్రోమో రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తాజా చిత్రం 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమాలో అత్యంత కీలమైన పాటగా భావిస్తున్న 'చికిరి చికిరి' ప్రోమోను రిలీజ్ చేశారు. నవంబర్ 7న విడుదల కాబోతున్న 'చికిరి చికిరి' లిరికల్ వీడియో కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కాన్సెప్ట్ వీడియోతోనే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిపోయింది. రెహమాన్ సంగీతం, చరణ్ స్టెప్స్, బుచ్చిబాబు మార్క్‌తో ఈ ఆల్బమ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'డీయస్ ఈరే' తెలుగు ట్రైలర్ విడుదల



ప్రణవ్ మోహన్ లాల్ కథానాయకుడిగా నటించిన సినిమా 'డీయస్ ఈరే'. మిస్టరీ హారర్ థ్రిల్లర్గా రూపొందింది. 'భూత కాలం', 'భ్రమ యుగం' ఫేమ్ రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్ శశికాంత్ నిర్మించారు. తెలుగు రాష్ట్రాల్లో సుప్రసిద్ధ నిర్మాణ సంస్థ శ్రీ స్రవంతి మూవీస్ విడుదల చేస్తోంది. మలయాళంలో అక్టోబర్ 31న 'డీయస్ ఈరే' విడుదలైంది. నవంబర్ 7న పెయిడ్ ప్రీమియర్లతో తెలుగు వెర్షన్ విడుదల చేస్తున్నారు. నవంబర్ 8న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సినిమా విడుదల కానుంది. 'డీయస్ ఈరే' తెలుగు ట్రైలర్ విడుదల చేశారు.



## 'జిగ్రీస్'లో మీరేలే పాట ఆవిష్కరణ


కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్ఫుల్ క్రేజీ ఎంటర్టైనర్ జిగ్రీస్. హరీష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తాజాగా మీరేలే సాంగ్ లాంచ్ చేశారు.సయ్యద్ కమ్రాన్ ఈ సాంగ్ ని ఫ్రెండ్ షిప్ మెలోడీగా కంపోజ్ చేశారు. హరీష్ రెడ్డి ఉప్పుల రాసిన సాహిత్యం ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్ ప్రజెంట్ చేసేలా ఉంది. ఏక్నాథ్ వోకల్స్ సాంగ్‌ని మరింత టచ్చింగ్ గా మార్చింది. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్టైనర్గా ఉండబోతోందిఈ చిత్రానికి . ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్.జిగ్రీస్ నవంబర్ 14న విడుదల కానుంది

## ఆ క్యారెక్టర్‌లో ఎమోషన్స్ ఉంటాయి



నిర్మాత ప్రేరణ అరోరా

సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో శిల్పా శిరోధ్కర్ కీలక పాత్ర పోషించారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను హిందీలో సినిమాలో చేస్తున్నప్పటికీ తెలుగు సినిమా అంటే నాకు చాలా స్ఫూర్తి. రామ్ చరణ్ ఆరెంజ్ సినిమా చూశాను. అప్పటి నుంచి నాకు తెలుగు సినిమా పట్ల చాలా ఇష్టం ఏర్పడింది. తెలుగు సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కమర్షియల్, మాస్, హ్యాపీ, ఫ్యామిలీ అన్ని ఎమోషన్స్‌తో సినిమాలు వస్తుంటాయి. తెలుగు సినిమా చాలా గొప్ప సినిమాలని ఇండియన్ సినిమాకి అందించింది. ఐశ్వర్య రజనీకాంత్‌తో నేను ఒక సాంగ్‌కి వర్క్ చేశాను. సౌత్‌లో అది నా ఫస్ట్ అనుభవం. అప్పుడే రామోజీ ఫిలింసిటీని విజిట్ చేశాను. తర్వాత సుధీర్ బాబు ద్వారా వెంకట్ అభిషేక్‌ని కలిశాను. అప్పుడు జటాధర కథ చెప్పారు. జటాధర చాలా అద్భుతమైన సబ్జెక్టు. ఇందులో ఫ్యామిలీ, ఎమోషన్స్, సూపర్ నేచురల్, మైథలాజికల్ అన్ని ఎలిమెంట్స్ అద్భుతంగా బ్లెండ్ అయ్యాయి. ఇది పాన్ ఇండియా కంటెంట్. అందుకే హిందీలో కూడా ఈ సినిమాని చేయాలనుకున్నాం. అలా తెలుగు, హిందీలో రెండు భాషల్లోనూ ఈ సినిమాని చేయడం జరిగింది. ఈ సినిమాలో డివైన్ ఎలిమెంట్స్ బ్లాక్ మ్యాజిక్ లాంటి ఎక్సైటింగ్ ఎలిమెంట్స్ వున్నాయి. శిల్ప శిరోద్కర్ బిగ్ బాస్ లోకివెళ్లే సమయంలో కలిసాను. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ క్యారెక్టర్ గురించి చెప్పాను. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలోచాలా స్పెషల్‌గా ఉండబోతుంది. ఆ క్యారెక్టర్‌లో చాలా ఎమోషన్స్ ఉంటాయి. కచ్చితంగా సీక్వెల్ లా ప్రీక్వెలా అని చెప్పలేము గాని ఈ సినిమాకి కొనసాగింపుగా ఇంకో సినిమా అయితే ఉంటుంది. మేము మరో తెలుగు సినిమా కూడా మేము చేయబోతున్నాం. పెద్ద హీరోతో ఆ సినిమా చేస్తున్నాం. త్వరలోనే ఆ సినిమా వివరాలు కూడా తెలియజేస్తాం.



## వరల్డ్ ట్రావెల్ మార్కెట్‌లో తెలంగాణ టూరిజం స్టాల్

### లండన్‌లో టిజిటిడిఎస్ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన ట్రావెల్, టూరిజం కార్యక్రమం అయిన వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటిఎం) ఎక్సెల్ లండన్‌లో అధికారికంగా బుధవారం ప్రారంభమైంది. అత్యంత పెద్దదైన ఈ కార్యక్రమం 'మారుతున్న ప్రపంచంలో ప్రయాణాన్ని పునఃసృష్టిస్తోంది' అనే థీమ్‌ను విడుదల చేసింది. 2025 ఎడిషన్ పెరిగిన ఫ్లోర్ స్పేస్, రికార్డు సంఖ్యలో ఎగ్జిబిటర్లను కలిగి ఉంది. డబ్ల్యూటిఎంలో తెలంగాణ టూరిజం శాఖ అధికారులు తమ స్టాల్‌ని లండన్‌లోని ఇండియా డిప్యూటీ కమీషనర్ కార్తీక్ పాండే ప్రారంభించారు. అంతర్జాతీయ పర్యాటక భవిష్యత్తు కోసం అజెండాను రూపొందించడానికి డబ్ల్యూటిఎం ఒక ముఖ్యమైన వేదిక. 24 ముఖ్యమైన సంస్థ ప్రతినిధులు తెలంగాణ టూరిజం తో కలిసి పని చెయ్యటానికి ఆసక్తి చూపుతున్నారు.వారిలో ముఖ్యమైన ట్రావెల్ మీడియా ప్రతినిధులు,టూర్ ఆపరేటర్స్,మెడికల్ టూరిజం సంస్థలు పాల్గొన్నాయి.ప్రత్యేక టూరిజం కార్యక్రమాలు అయిన కలినరీ,హాట్ ఎయిర్ బలూన్ మొదలైన సంప్రదింపులు జరిగాయి.తెలంగాణ లో అమలవుతున్న నూతన పర్యాటక విధానాన్ని పలువురు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్,తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, టూరిజం కన్సల్టెంట్స్ దిల్లేశ్వరి, ఫరాజ్ పాల్గొన్నారు.

# సొంత ఇంటి కలను నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం

### రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు





ప్రజాపక్షం/రంగారెడ్డి: ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని చేపట్టి, అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మినిస్టర్ క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గంలో మంఖాల్ పేజ్ ఒకటి,రెండులో భాగంగా నిర్మించి 2,848 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు లబ్ధిదారులకు అలాట్మెంట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో కోర్టు కేసు ఉండటం వలన మంఖాల్I, మంఖాల్ II డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం ఆగిపోయిందని, కోర్టులో కేసు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చొరవ తీసుకొవడం జరిగిందని చెప్పారు. అందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న 2,848 మందికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. దీంతో నిజమైన ఇల్లు లేని నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేర్చే ఉద్దేశంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించడం జరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను మీకు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం మాజీ ఎంఎల్ఎ, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి కిచన్నగారి లక్ష్మరెడ్డి(కెఎల్ఆర్) మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి యే కాంగ్రెస్ పార్టీ అసలు లక్ష్యం అన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ నియోజకవర్గం ప్రజల కోసం సమయం కేటాయించి, ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం పలువురు లబ్దిదారులు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కందుకూర ఆర్డిఓ కె.జగదీశ్వర్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా హౌసింగ్ శాఖఅధికారులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్ల సాధనకు కేంద్రంపై ఒత్తిడికి సహకరించండి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఒయు బిసి జెఎసి ప్రతినిధుల విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపైన ఒత్తిడితీసుకువచ్చేందుకు సహకరించాలని ఒయు బిసి జెఎసి ప్రతినిధులు సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను కోరారు. ఈ మేరకు ఒయు బిసి జెఎసి ప్రతినిధులు నిజ్జన రమేష్ ముదిరాజ్, దేశగాని సాంబశివ గౌడ్, లింగ స్వామి, శివరాత్రి ప్రశాంత్, రెడ్డి శ్రీనివాస్, నక్క శ్రీశైలం యాదవ్, ఆర్.ఎన్. శంకర్ ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తీవ్ర అన్యాయం జరిగిందని, రాజకీయ ప్రాతి నిధ్యం లేక చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించే బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపైనే ఉన్నదన్నారు. బిసి రిజర్వేషన్ల అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు.

## కేంద్రం యత్నం

(మొదటి పేజీ తరువాయి)

సర్వీసు కండిషన్‌లపై కార్యనిర్వాహకవర్గానికి విస్తృత అధికారాలను ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తమైంది. ఈ కేసు ధర్మాసనం ఎదుట పిటిషనర్లు తమ వాదనలు పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వం అభ్యర్థన చేసిన సమయం అందరినీ ఆశ్చర్యపరిచింది. విస్తృత ధర్మాసనాన్ని కోరడం ద్వారా ఇష్టం లేని తీర్పు రాకుండా లేదా జాప్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో కేసును తప్పించుకునే ఎత్తుగడలకు పాల్పడుతున్నారని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కోర్టులో బహిరంగంగానే వ్యాఖ్యలు చేయడం ద్వారా అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు వారాలకు ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో కేంద్రం అలా అభ్యర్థించడం ద్వారా ఆలస్యం చేయడం లేదా ఆశించని తీర్పు రాకుండా ఉండడమేననే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇలా బహిరంగంగా వ్యాఖ్యలు వ్యక్తమవడం మొదటిసారి కాదు. 2018 జనవరిలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు చలమేశ్వర్, రంజన్ గొగొాయ్, మదన్ బి.లోకూర్, కురియన్ జోసఫ్‌లు అసాధారణ రీతిలో పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేసి నాటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఏకపక్షంగా కేసులను కేటాయించడంపై బహిరంగంగా నిరసన వ్యక్తం చేశారు.

## ప్రయాణికులపైకి ట్రైన్

(మొదటి పేజీ తరువాయి)

చెందారు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో మీర్జాపూర్‌కు చెందిన సవిత(28), సాధన(16), శివకుమారి (12), అప్పుదేవి(20) సుశీలా దేవి(60), జానవా దేవి (60)గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వీరి మృతదేహాలను శవపరీక్షలు నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

### 11కు చేరిన ఛత్తీస్‌గఢ్ రైలు ప్రమాదం మృతుల సంఖ్య

మరోవైపు మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 11కు చేరింది. గాయపడ్డ మరో 20 మందికి సమీప ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో లోకోపైలట్ కూడా ఉన్నారు. గటోరా–బిలాస్‌పూర్ రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న లాల్‌ఖండ్ గ్రామ సమీపంలో సాయంత్రం 4 గంటలకు సరకు రవాణా రైలును వెనుక నుంచి ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ధాటికి ప్యాసింజరు రైలు బోగి ఒకటి గూడ్సు రైలు వ్యాగన్‌పైకి ఎక్కింది. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టాయి. దెబ్బతిన్న రైల్ కోచ్‌ల్లో చిక్కుకున్నవారిని రక్షించాయి. క్షత గాత్రులను వేగంగా సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఆ మార్గంలో వెళ్లే రైళ్లకు పూర్తి అంతరాయం కలిగింది. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5లక్షల చొప్పున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున రైల్వే శాఖ పరిహారం ప్రకటించింది. ప్రమాద ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. అయితే ప్రయాణికుల రైలు రెడ్ సిగ్నల్‌ను దాటి ముందుకు వెళ్లడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్లు రైల్వే బోర్డు ప్రాథమికంగా అంచనా వేసింది. లోకోపైలట్ రెడ్ సిగ్నల్‌ను గమనించకుండా రైలును ముందుకు నడిపి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో గంటకు 60 నుంచి 70 కి.మీ. వేగంతో ప్యాసింజరు రైలు వెళ్లి ఉంటుందని అధికారులు అంటున్నారు.



## కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావం

(మొదటి పేజీ తరువాయి)

తృతీయస్థాయి నాయకుడుగా వ్యవహరిస్తారు. ఈ తీర్మానాన్ని మహింద్ర రాయ యాదవ్ సభలో ప్రవేశపెట్టగా, పాల్గొన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలుత దహాల్, మాధవ్‌కుమార్‌లు సంయుక్తంగా ఒక బటన్‌ను నొక్కి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జన్ జడ్ నిరసనల పర్యవసానంగా 2025 సెప్టెంబరు 9న రాజీనామా చేసిన ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి నాయకత్వంలోని నేపాల్ కమ్యూనిస్టుపార్టీ (యూనిఫైడ్ ఎం.ఎల్) ఈ కొత్త కమ్యూనిస్టు బృందంలో లేకపోవడం గమనించదగింది. గతంలో దశాబ్దకాలంపాటు సాయుధ పోరాటం చేసిన ప్రచండకు చెందిన పార్టీ తన పేరులోని 'మావోయిస్టు' అనే అధికారిక పదాన్నిమొదటిసారిగా ఉపయోగించకుండా పక్కనపెట్టేసింది. ఈ కొత్త పార్టీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగం పంచుకుంటుంది. మావోయిస్టు సెంటర్, యూనిఫైడ్ సోషలిస్టుపార్టీలతోపాటు చీలిపోయిన ఇతర కమ్యూనిస్టుపార్టీలు నేపాల్ సమాజ్‌వాదీ, సిపిఎన్ (సోషలిస్టు), జనసమాజ్‌వాదీపార్టీ నేపాల్, నేపాల్ కమ్యూనిస్టుపార్టీ, సిపిఎన్ (మావోయిస్టు సోషలిస్టు), సిపిఎన్ సమ్యబాది, గోపాల్ కిరితి నాయకత్వంలోని దేశ్‌భక్త సమాజ్‌వాదీ మోర్చాకూడా ఈ కొత్త యూనిఫైడ్ నేపాల్ కమ్యూనిస్టుపార్టీలో విలీనమయ్యాయి. ఐతే ఈ విలీన ప్రక్రియపై అంతర్గతంగా అసమ్మతి కూడా ప్రబలింది. మావోయిస్టు సెంటర్‌లో జనార్దన్‌శర్మ నాయకత్వంలోని ఒక వర్గం ఈ విలీన ప్రక్రియను వ్యతిరేకించింది. ఇదిలా ఉండగా, ప్రచండ ఈ సందర్భంగా మాట్లాడుతూ, యుఎంఎల్ మాజీ నాయకుడు భీమ్ రావల్‌తోపాటు ఇతర అనేక వామపక్షాల నాయకులను కూడా ఈ సరికొత్త వ్యవస్థలోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన చర్చలు తుదిదశలో ఉన్నట్లు చెప్పారు. 2026 మార్చి 5వ తేదీన నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రకటన చేసింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ తొమ్మిది వామపక్షాల విలీనం నేపాల్‌లో ప్రాధాన్యం సంతరించుకుంది. రాజధాని కఠ్మండులోని భృకుటి మండప్‌లో జరిగిన సమావేశం అనంతరం కమ్యూనిస్టుపార్టీ నాయకులు బుధవారం ఈ ప్రకటన చేశారు. త్వరలోనే ఈ తొమ్మిదిపార్టీల విలీన కార్యక్రమం లాంఛనంగా జరుగుతుంది. ఈ విలీన కార్యక్రమం సందర్భంగా బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహిస్తారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com